www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 16-6-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 61 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: దశమి తె. 4.44 తదుపరి ఏకాదశి; నక్షత్రం: హస్త ఉ. 11.13 తదుపరి చిత్త; వర్జ్యం: రా.8.05-9.51; దుర్ముహూర్తం: సా.5.02-5.54; అమృతఘడియలు: శేషం ఉ.6.16 వరకు; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.47 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## భారీస్థాయిలో ఐఏఎస్‌ల బదిలీలు



కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్థానచలనం

20 జిల్లాలకు కొత్త కలెక్టర్లు.. వెయిటింగ్‌లో 10 మంది

వారికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం



హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భారీస్థాయిలో కలెక్టర్ల బదిలీలను చేపట్టింది. 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించింది. వివిధ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో పని చేస్తున్న 20 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసి ఈ నియామకాలు

మిగతా 13వ పేజీలో...

### ట్రాఫిక్ పరిష్కారానికి హోంగార్డులు

సిబ్బంది కొరతను అధిగమించేందుకు వారి సేవల వినియోగం

13 ట్రాఫిక్‌జామ్‌లపై ఎఫ్‌ఎంలో ప్రచారం.. ఔటర్ లోపల

సీసీకెమెరాలన్నింటినీ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించండి

వర్షాల నేపథ్యంలో అప్రమత్తం.. అధికారులకు సీఎం ఆదేశం

### సాధారణ బదిలీలు ఎప్పుడు? 13

ఏళ్లుగా నిరీక్షిస్తున్న 3.50 లక్షల మంది ఉద్యోగులు

### బీసీ స్కాలర్‌షిప్‌లకు 387 కోట్లు

3 విదేశీ విద్యానిధి పథకానికి మరో 15 కోట్లు

## ఆగస్టు 1 విడుదల! 13

### రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ విలువల సవరణ తేదీ ఇదే

- 18 నుంచి క్షేత్రస్థాయి పరిశీలన, 24న తుది జాబితా
- బహిరంగ మార్కెట్, రిజిస్ట్రేషన్ విలువల పరిశీలన
- అంతరం తక్కువగా ఉన్నచోట కొద్దిగా.. ఎక్కువగా ఉన్నచోట భారీగా విలువల సవరణకు ప్రతిపాదనలు
- లే అవుట్లు వేసేందుకు అనువైన గ్రామాల గుర్తింపు
- హైవేలు, వాణిజ్య ప్రాంతాల్లో వేర్వేరు ప్రతిపాదనలు



## నిధుల దారులన్నీ రుణమాఫీ వైపే!

రైతు కార్పొరేషన్ ఏర్పాటుచేసి రుణాలు బదలాయించడం ఓ దారి

ఎఫ్ఆర్‌బీఎం కింద వీలైనంత ఎక్కువ రుణాన్ని సేకరించడం మరో మార్గం

ప్రభుత్వ భూముల తనఖా, వేలం ద్వారా రుణమాఫీ ఇంకో దారి

అదీ కుదరకుంటే బిల్లులు ఆపి.. ఆ నిధులతో మాఫీకి సీఎం రెడీ?

'రైతు భరోసా'పై శాసనసభలో చర్చించాకే నిర్ణయం తీసుకునే చాన్స్

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేసేందుకు సర్కారు సిద్ధమైంది. ప్రకటించినట్టుగానే ఆలోగా మాఫీ చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ నేతలతో పేర్కొన్నట్లు సమాచారం. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణకు ప్రభుత్వం ముందు మూడు మార్గాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. రైతు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలను బదలాయించడం. రెండు.. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడి ఏడాదికి రూ.58 వేల కోట్ల రుణం తీసుకునే వెసులుబాటు ఉన్న నేపథ్యంలో మిగిలిన 9 నెలల కాలానికి సంబంధించి రావాల్సిన రుణమొత్తం రూ.48 వేల కోట్లలో.. జూలై, ఆగస్టు నెలల్లో సాధ్యమైనంత ఎక్కువ తీసుకునే ఆలోచన. ఎఫ్ఆర్‌ఎంబీ రుణాలను ఫలానాదానికే ఉపయోగించాలనే షరతులేవీ ఉండవు. ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. జూలై, ఆగస్టు నెలల్లో ప్రత్యేక అవసరాలు ఉన్నాయని వివరించి తీసుకునే అవకాశాన్నీ ప్రభుత్వం పరిశీలిస్తోంది. అందుకు రిజర్వు బ్యాంకు అంగీకరిస్తుందనే ఆశాభావంతో ఉంది. గతంలో కూడా నిర్ణీత సమయం కంటే ముందే ఇలా అధికంగా నిధులు తీసుకున్న సందర్భాలున్నాయి. ఒకవేళ అనుకున్న సమయంలో అనుకున్న మొత్తానికి అనుమతులు రాకుంటే.. మూడో పద్ధతిని అనుసరించాలని సర్కారు భావిస్తోంది. అదేంటంటే.. ప్రభుత్వ భూములను తనఖా పెట్టి నిధులు సేకరించడం, లేదా ప్రభుత్వ భూములు వేలం వేసి అవసరమైన నిధులు సమీకరణ చేయడం. అయితే.. ఇది సమయంతో కూడుకున్న పని. రుణమాఫీకి తుదిగడువు ఇంకా రెండు నెలలే ఉన్నందున ఈ ప్రక్రియ ఎంతవరకూ ఆచరణ సాధ్యమనే అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ ఈ మూడు పద్ధతుల్లోనూ నిధుల సేకరణ చేయలేకపోతే.. జూలై నెలలో ప్రభుత్వానికి వచ్చే పన్నుల ఆదాయంలో అత్యవసర ఖర్చులు పోను మిగతా మొత్తాన్ని రుణమాఫీకి మళ్లించాలనే ఆలోచన కూడా చేస్తోంది. దాంతోపాటు ప్రభుత్వం సొంత వనరుల ద్వారా సమీకరించుకున్న నిధులను, ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో కనీసం రూ.10 వేల కోట్ల రుణాన్ని సేకరించి ఆ మొత్తాన్ని, అన్ని బిల్లుల

మిగతా 13వ పేజీలో...



## 531 సర్కారు వైద్యుల పోస్టులు

193 ల్యాబ్ టెక్నీషియన్, 31 స్టాఫ్ నర్సు పోస్టులు కూడా..

భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల

వారంలోగా ఏఎన్‌ఎమ్ రాత పరీక్ష!

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సంచాలకుల పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా డీహెచ్ పరిధిలోని 531 సివిల్ అసిస్టెంట్ సర్జన్లతోపాటు 193 ల్యాబ్ టెక్నీషియన్, 31 స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. త్వరలో ఈ పోస్టుల

మిగతా 13వ పేజీలో...

## మీ కమిషనే చట్ట విరుద్ధం



మీకు విచారణార్హత లేదు

నిష్పాక్షికత కనిపించట్లేదు.. బాధ్యతల నుంచి తప్పుకోండి

విచారణ పూర్తి కాకుండానే తీర్పు ఇచ్చినట్లు మీ మాటలున్నాయి

రాజకీయ కక్షతో మమ్మల్ని అప్రతిష్ఠ పాల్జేయడానికే కమిషన్ ఏర్పాటు

జస్టిస్ నర్సింహా రెడ్డికి మాజీ సీఎం కేసీఆర్ 12 పేజీల ఘాటు లేఖ

మీ ముందు హాజరై ఏం చెప్పినా ప్రయోజనం ఉండదని వ్యాఖ్య

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): "గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివేదిక ఇవ్వాలన్న అభిప్రాయంతోనే మీరు మాట్లాడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే తప్పు జరిగిపోయినట్లు.. ఇక ఆ తప్పు వల్ల జరిగిన ఆర్థిక నష్టాన్ని లెక్కించడం మాత్రమే మిగిలి ఉందన్నట్లు మీ మాటలు స్పష్టం చేస్తున్నాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసి పదవీ విరమణ చేసినప్పటికీ మీ తీరు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉంది" అంటూ విద్యుత్తు ఒప్పందాలపై విచారణ చేస్తున్న కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి తీరును మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర స్థాయిలో తప్పుబట్టారు. మీ ముందు హాజరై ఏం చెప్పినా ప్రయోజనం ఉండదని స్పష్టమవుతోందని దుయ్యబట్టారు. అసలు మీ కమిషన్ ఏర్పాటే చట్ట విరుద్ధమని, మీరు విచారణ చేయడం

మిగతా 14వ పేజీలో...

### చట్టబద్ధ కమిషన్‌నే తప్పుబడతారా?

చైర్మన్‌ను బెదిరించడం ముమ్మాటికీ ధిక్కారమే

కమిషన్ ఏర్పాటు తప్పైతే కోర్టుకు ఎందుకెళ్లలేదు?

కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్ 14



### అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్ 2

8 మంది నక్సల్స్, ఒక జవాన్ మృతి

బీజాపూర్‌లో మందుపాతరల గుర్తింపు

సుకుమాలో నక్సల్స్ స్నైపర్ జాకెట్ లభ్యం

ములుగులో మావోయిస్టుల కుట్ర భగ్నం

ఆరుగురు నక్సల్స్, మిలీషియా సభ్యుల అరెస్ట్

### రమేశ్ కార్తీక్ నాయక్‌కు సాహిత్య అకాడమీ యువ పురస్కారం

'ధావ్లో' కథా సంపుటికి దక్కిన గౌరవం



రమేశ్ కార్తీక్ నాయక్

లంబాడాల సంస్కృతి, జీవన చిత్రాన్ని కళ్లకు కట్టే కథలు

చంద్రశేఖర్ ఆజాద్‌కు బాల సాహిత్య పురస్కారం 14



## గతం మరిచి గగ్గోలు...



కొత్త పలుకు

ఏపీలో దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయి. ప్రజాస్వామ్యం, హక్కులు, విలువలు, విశ్వసనీయత వంటి పదాలు వల్లె వేస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడి పది రోజులే అయింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగు రోజులు మాత్రమే అయింది. ఇంతలోనే రాష్ట్రంలో శాంతి భద్రతలు కుప్పకూలిపోయినట్టుగా శోకాలు పెట్టడం ఆశ్చర్యంగా ఉంది. కొత్త ప్రభుత్వంపై విమర్శలు చేసేముందు అధికారంలో ఉన్న ఐదేళ్లలో తామేం చేశామో మరచిపోయారు.

రాజ్యం వీరభోజ్యం అన్నట్టుగా చెలరేగిపోయిన వాళ్లు ఇప్పుడు ప్రజాస్వామ్యం ఎక్కడ అంటూ రోదించడం రోతగా ఉంది. 2014 నుంచి 2019 వరకు శాసనసభ స్పీకర్ గా ఉన్న కోడెల శివప్రసాదరావు ఆత్మహత్య చేసుకోవడానికి జగన్ ప్రభుత్వ వేధింపులు కారణం కాదా? కరోనా సమయంలో మాస్కులు సరఫరా చేయడం లేదని ప్రశ్నించినందుకు ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ సుధాకర్‌ను వేధించి ఆయన చావుకు కారణం కాలేదా? ఆయనను పిచ్చివాడిగా చిత్రించి నడిరోడ్డుపై పోలీసులతో కొట్టించలేదా? సీనియర్ సిటిజన్ రంగనాయకమ్మ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదో పోస్ట్ పెట్టిందని చెప్పి పోలీసులతో వేధించడంతో.. అది తట్టుకోలేక ఆమె హైదరాబాద్‌కు రావడం నిజం కాదా?

ఏపీలో తన చానల్ ప్రసారాలు నిలిచిపోవడంపై జగన్ రెడ్డి ఇప్పుడు శోకాలు పెడుతున్నారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే ఏబీఎన్‌తో పాటు మరో చానల్ ప్రసారాలను అక్కడ ఐదేళ్లపాటు జగన్ అండ్ కో నిలిపివేయించలేదా? తప్పుడు విధానాలకు తెరతీసింది ఎవరు? తనకు గిట్టని మీడియా సంస్థలను శాసనసభ కార్యక్రమాలు ప్రసారం చేయకుండా నిషేధించలేదా? ఆంధ్రజ్యోతి పత్రికకు, ఏబీఎన్ చానల్‌కు ఐదేళ్లపాటు న్యాయంగా ఇవ్వాల్సిన ప్రకటనల్లో ఒక్కటైనా ఇవ్వకపోవడం... ఏ నీతి? 4

జగన్ రోత మీడియాతో పాటు కూలి మీడియా కూడా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి సాధించిన ఘన విజయాన్ని సాంకేతిక విజయం మాత్రమేనని, జగనే అసలైన నాయకుడని, ప్రజల మద్దతు ఆయనకే ఉంటుందని ప్రచారం చేస్తూ ఆత్మవంచన చేసుకుంటున్నాయి. ఈవీఎం ట్యాంపరింగ్ వల్లే జగన్ ఓడిపోయారని ప్రచారం చేస్తున్నారు. ఈవీఎంల ద్వారా ప్రజల తీర్పును తారుమారు చేయలేరని అనేక సందర్భాలలో ఈసీ రుజువు చేసింది. బాబు ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. జగన్ పాలనలో వ్యవస్థలన్నీ ఛిన్నాభిన్నం అయ్యాయి. అఖిల భారత సర్వీసు అధికారుల వెన్ను విరిచి బానిసలుగా మార్చుకున్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు.

సంకీర్ణ ప్రభుత్వం అన్నాక ఒడిదుడుకులు సహజం. పవన్ ఇప్పటి వరకు అసాధారణ పరిణితి ప్రదర్శించారు. సీట్ల సర్దుబాటు సమయంలోనూ, మంత్రి పదవుల విషయంలోగానీ ఆయన మంకు పట్టుకు పోలేదు. జగన్ రెడ్డి విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలుసుకున్నారు. *absolute power corrupts absolutely* అన్నట్టు కనీవినీ ఎరుగని మెజారిటీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వ పోకడలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. జగన్‌కు ఎన్నికల్లో ఇంత ఘోర పరాభవం ఎందుకు ఎదురైందో కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర నాయకులు గుర్తించి అందుకు తగ్గట్టుగా మెలగాలి.

## రూ. 30 లక్షలకు నీట్ పేపర్!




ఒక్కొక్క అభ్యర్థి నుంచి వసూలు చేసిన బిహార్ ముఠా

వారందరినీ రహస్య ప్రదేశాల్లో ఉంచి జవాబుల బట్టీ 2

నిందితుల వెల్లడి.. 13 మందికి ఒక రోజు ముందే ప్రశ్నపత్రం

వారిలో నలుగురి అరెస్టు.. మరో 9 మందికి నోటీసులు

మళ్లీ పరీక్షకు ఆదేశించండి.. సుప్రీంలో విద్యార్థుల పిటిషన్

నీట్ రద్దు చేసి.. రాష్ట్రాల సొంత పరీక్షలకు అనుమతించాలి

డీకే శివకుమార్ డిమాండ్

19, 20 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు.. ఏఐఎస్‌ఏ పిలుపు

## 18న పీఎం కిసాన్ నిధుల విడుదల

» 9.26 కోట్ల మంది రైతుల ఖాతాలకు నిధులు

న్యూఢిల్లీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రైతులకు అందించే పీఎం కిసాన్ నిధులను ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. 17వ విడత కింద రూ.20 వేల కోట్ల పీఎం కిసాన్ నిధులను వారాణసీలో నిర్వహించే ఒక కార్యక్రమంలో ప్రధాని మోదీ విడుదల చేస్తారని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ శనివారం వెల్లడించారు. 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో ఈ నిధులు జమకానున్నట్లు మంత్రి తెలిపారు. అంతేకాకుండా శిక్షణ పొందిన 30 వేలకు పైగా స్వయం సహాయక సంఘాలకు కృషి సఖీ గుర్తింపు పత్రాలను మోదీ ప్రదానం చేస్తారని తెలిపారు ఇప్పటివరకు 11 కోట్ల మంది రైతులకు పీఎం కిసాన్ కింద రూ.3 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. 17వ విడత నిధులతో కలిపి లబ్ధిదారులకు అందించిన మొత్తం రూ.3.24 లక్షల కోట్లు దాటుతుందని తెలిపారు.

## ఇందిర 'మదర్ ఆఫ్ ఇండియా': సురేశ్ గోపి



న్యూఢిల్లీ, జూన్ 15: కేంద్రమంత్రి సురేష్ గోపి మాజీ ప్రధాని ఇందిరా గాంధీని 'మదర్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించారు. అలాగే కేరళలో దివంగత కాంగ్రెస్ ముఖ్యమంత్రి కె. కరుణాకరన్(కాంగ్రెస్)ని ధైర్యంగల పరిపాలనాదక్షుడు అన్నారు. కరుణాకరన్, మార్క్సిస్ట్ వెటరన్ ఇ.కె. నయనార్‌లను తన రాజకీయ గురువులుగా పేర్కొన్నారు. కేరళలోని త్రిశ్శూర్‌లో కరుణాకరన్ స్మారక మురళి మందిరాన్ని శనివారం సందర్శించిన అనంతరం సురేష్ గోపి విలేకరులతో మాట్లాడుతూ... ఈ వ్యాఖ్యలు చేశారు. తాను కరుణాకరన్ స్మారక మందిరాన్ని సందర్శించడానికి ఎటువంటి రాజకీయ రంగు పులమవద్దని విలేకరులను సురేష్ గోపి కోరారు. తన గురువుకు నివాళులు అర్పించేందుకే తాను ఇక్కడికి వచ్చానని చెప్పారు. కరుణాకరన్‌ను కేరళలో కాంగ్రెస్ పార్టీకి తండ్రివంటివారని సురేశ్ గోపి పేర్కొన్నారు. 2019లోనే తాను మురళి మందిరాన్ని సందర్శించాలనుకొన్నా బీజేపీలో చేరిన కరుణాకరన్ కుమార్తె పద్మజా వేణుగోపాల్ రాజకీయ కారణాల వల్ల వద్దని చెప్పారని అన్నారు.

## ఉపసభాపతి పదవి ఇవ్వకుంటే స్పీకర్ పోస్టుకు పోటీ చేయాలని విపక్షాల నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 15: సంప్రదాయం ప్రకారం లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని తమకు ఇవ్వాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. లేకుంటే స్పీకర్ పదవికి తమ అభ్యర్థిని పోటీకి నిలబెట్టాలని భావిస్తున్నాయి. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో స్పీకర్ పదవికి ప్రాధాన్యం ఏర్పడింది. స్పీకర్ పదవిని అధికార పక్షానికి, డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షానికి ఇవ్వడం ఆచారంగా వస్తోంది. రాజ్యాంగం ప్రకారం డిప్యూటీ స్పీకర్ కూడా స్వతంత్రంగా వ్యవహరిస్తారు. స్పీకర్ ఆధీనంలో పనిచేసే పదవేమీ కాదు. అందువల్ల కీలకమైన ఈ పదవిని వదులుకోకూడదని విపక్షాలు భావిస్తున్నాయి. 17వ లోక్‌సభకు ఓం బిర్లా స్పీకర్‌గా వ్యవహరించారు. డిప్యూటీ స్పీకర్‌ను అసలు ఎన్నుకోలేదు. ఆ పదవి లేకుండానే సభ ముగిసింది. తాజా 18వ లోక్‌సభలో మాత్రం ఆ పదవిని దక్కించుకోవాలని విపక్షాలు భావిస్తున్నాయి. ఈ నెల 24 నుంచి జులై 3 వరకు తొమ్మిది రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ నెల 26న స్పీకర్ ఎన్నిక జరగనుంది.

## యూపీలో రూ.4,400 కోట్ల ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ, జూన్ 15: అక్రమ మైనింగ్ కేసులో పరారీలో ఉన్న ఉత్తరప్రదేశ్ బీఎస్పీ మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్‌పై ఈడీ కొరడా ఝుళిపించింది. ఇక్బాల్, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన రూ.4,400 కోట్ల విలువైన ఆస్తులను శుక్రవారం జప్తు చేసింది. వీటిలో సహరాన్‌పూర్‌లోని గ్లోకల్ యూనివర్సిటీ భవనంతో పాటు 121 ఎకరాల భూములున్నాయి. ఈ ఆస్తులు అబ్దుల్ వహీద్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ పేరిట రిజిస్టరై ఉన్నాయని.. దీని బాధ్యతలు ఇక్బాల్, ఆయన కుటుంబీకులే చూసుకుంటున్నారని ఈడీ తెలిపింది. ఇక్బాల్ దుబాయ్‌కి పారిపోయినట్లు సమాచారం. ఆయన నలుగురు కుమారులు వివిధ కేసుల్లో జైల్లో ఉన్నారు.

## కేజ్రీవాల్ విచారణ వీడియోలను తొలగించండి

» భార్య సునీతకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జూన్ 15: ఎక్సయిజ్ విధానం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను కోర్టులో విచారించిన వీడియోను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని శనివారం ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. కేజ్రీవాల్ సతీమణి సునీతతో పాటు యూట్యూబ్, మెటా సంస్థ, మొత్తం ఆరుగురికి ఈ ఆదేశాలు ఇచ్చింది. విచారణ నిమిత్తం మార్చి 28న కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రౌజ్ అవెన్యూలోని ట్రయల్ కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కోర్టును ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగాన్ని ఓ 'ఎక్స్' వినియోగదారుడు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. దీన్ని సునీత కేజ్రీవాల్‌తో పాటు మరికొందరు రీపోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్‌గా మారింది. దాంతో తగిన అనుమతులు లేకుండా కోర్టు కార్యకలాపాలను చిత్రీకరించకూడదని, అంతేకాకుండా ఇది వీడియో కాన్ఫరెన్స్ నిబంధనలకు కూడా విరుద్ధమని పేర్కొంటూ న్యాయవాది వైభవ్ సింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## రికార్డుల్లో ఉన్న సమాచారమే ఇవ్వగలం : సీఐసీ

న్యూఢిల్లీ, జూన్ 15: ప్రభుత్వ విభాగాలు తమ రికార్డుల్లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని మాత్రమే ఇవ్వగలవంటూ కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) స్పష్టం చేసింది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) దరఖాస్తుకు రాష్ట్రపతి భవన్ ఇచ్చిన సమాధానాన్ని సమర్థించింది. కేంద్ర మంత్రిమండలి తీసుకున్న ఏ నిర్ణయాన్నీ పునఃపరిశీలించాలంటూ రాష్ట్రపతి తిప్పిపంపలేదని, లేదా తిప్పి పంపినట్లు సమాచారం ఏదీ తమ రికార్డుల్లో అందుబాటులో లేదని రాష్ట్రపతి భవన్ స్పెషల్ డ్యూటీ అధికారి.. ఆర్టీఐ కార్యకర్తకు ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు. అయితే, తనకు సంతృప్తికరమైన సమాధానం రాలేదని, రాజ్యాంగపరంగా ఎన్నికైన రాష్ట్రపతి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆర్టీఐ కార్యకర్త సీఐసీకి రెండోసారి చేసిన అప్పీలులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఐసీ హీరాలాల్ సమారియా.. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న సమాచారాన్ని మాత్రమే ఇవ్వడం సాధ్యమన్నారు.

## రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ ఉండొద్దని రైల్వేశాఖ లక్ష్యం

న్యూఢిల్లీ, జూన్ 15: రైళ్లలో డిమాండుకు తగ్గట్టుగా సీట్లు, బెర్తులు లభ్యంకాక ప్రయాణికులకు ఎదురవుతున్న సమస్యలపై రైల్వే శాఖ దృష్టి పెట్టింది. రానున్న ఎనిమిదేళ్లలో ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని నిర్ణయించింది. కొత్త రైళ్లను నడపడం ద్వారా 2032 నాటికి వెయిటింగ్ లిస్టులు అన్నవే లేకుండా చేసి అందరికీ రిజర్వుడు సీట్లు లభించేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకొంది. రైల్వే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అశ్విని వైష్ణవ్ శుక్రవారం అధికారులతో సమావేశమయి రైళ్లలో భద్రత, సమయపాలన, స్టేషన్లలో సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్ష జరిపారు.

## జైషే హెచ్చరికలు.. అయోధ్యలో హైఅలెర్ట్ !

న్యూఢిల్లీ, జూన్ 15: రామ మందిరాన్ని పేల్చేస్తామంటూ ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అయోధ్యలో భద్రతను పెంచారు. జైషే హెచ్చరికలకు సంబంధించిన ఓ ఆడియో సందేశం వైరల్‌గా మారింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆలయానికి చేరుకునే మార్గాలు, పరిసరాల్లోని భారీ భవనాలు, మహర్షి వాల్మీకి విమానాశ్రయం తదితర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. భద్రతా సిబ్బందిని కూడా పెంచి నిరంతరాయంగా గస్తీ కాస్తున్నారు. 2005లో రామజన్మభూమి కాంప్లెక్స్‌పై దాడి చేసి వెలుగులోకి వచ్చిన జైషే సంస్థ అయోధ్య రామమందిరంపై నిత్యం విషం కక్కుతూనే ఉంది. శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠకు ముందు కూడా దాడులు చేస్తామంటూ హెచ్చరికలు చేసింది.

## కర్ణాటకలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

» పెట్రోల్‌పై రూ.3.02, డీజిల్‌పై రూ.3 వడ్డన

బెంగళూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే అమలులోకి వచ్చేలా నిర్ణయం తీసుకుంది. పెట్రోల్‌పై లీటరుకు రూ.3.02, డీజిల్‌పై రూ.3 పెంచింది. రవాణాకు అనుగుణంగా ప్రాంతాలవారీగా వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం పెట్రోల్ లీటరుకు రూ.99.83 కాగా కొత్త ధర రూ.102.85 కానుంది. డీజిల్ లీటరు రూ.85.93 ఉండగా కొత్త ధర రూ.88.93గా ఉంది. పవర్ పెట్రోల్ రూ. 106.66 కాగా కొత్త ధర 109.89 కానుంది. పెట్రోల్, డీజిల్ ధరలు ఏకంగా లీటరుకు రూ. 3 పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ₹30 లక్షలకు నీట్ పేపర్!

**ఒక్కొక్క అభ్యర్థి నుంచి వసూలు చేసిన బిహార్ ముఠా.. వారందరినీ రహస్య ప్రదేశాల్లో ఉంచి జవాబుల బట్టీ**

» అక్కడి నుంచి నేరుగా పరీక్షా కేంద్రాలకు

» మే 4వ తేదీనే ముఠా చేతికి ప్రశ్నపత్రం

» నిందితుల నేరాంగీకార వాంగ్మూలాల్లో సంచలన విషయాలు

పట్నా, న్యూఢిల్లీ, జూన్ 15: నీట్ ప్రశ్నపత్రాన్ని లీక్ చేసినందుకు ఒక్కో అభ్యర్థి వద్దా రూ.30 లక్షల నుంచి రూ.32 లక్షల దాకా వసూలు చేశారు. ఆ ప్రశ్నలకు జవాబులు బట్టీపట్టించేందుకు వారిని రహస్య ప్రదేశాలకు తరలించారు. పేపర్ లీకయిన విషయం బయటపడకుండా ఉండేందుకు వారిని పరీక్ష రోజు దాకా అక్కడే ఉంచి.. అక్కణ్నుంచీ నేరుగా పరీక్షా కేంద్రాలకు తరలించారు! నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి బిహార్‌లో జరుగుతున్న ప్రాథమిక దర్యాప్తులో తాజాగా వెల్లడైన వివరాలివి. ఈ కేసులో అక్కడ అరెస్టయిన 14 మంది నిందితులు.. ఈమేరకు బిహార్ పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగానికి (ఈవోయూ) వాంగ్మూలం ఇచ్చారు. వారు వెల్లడించిన వివరాల ఆధారంగా 13 మంది అభ్యర్థులను గుర్తించిన ఈవోయూ అధికారులు నలుగురిని ఇప్పటికే అరెస్టు చేశారు. శనివారం మరో 9 మంది నీట్ అభ్యర్థులకు నోటీసులు జారీ చేశారు. నీట్ పేపర్ లీక్ చేసిన సాల్వర్ గ్యాంగులతో వారికి ఉన్న సంబంధాల గురించి ప్రశ్నించేందుకు.. పట్నాలోని తమ కార్యాలయానికి సోమ, మంగళవారాల్లో రావాల్సిందిగా ఆదేశించారు. అరెస్టయిన నిందితులు ఈవోయుకు ఇచ్చిన నేరాంగీకార వాంగ్మూలాలను సంపాదించిన 'ఇండియాటుడే' వార్తాసంస్థ ఆ వివరాలను బయటపెట్టింది. వారిలో సికిందర్ కుమార్ యాదవేందు (56) అనే ప్రభుత్వ ఉద్యోగి కూడా ఉన్నారు. నితీశ్, అమిత్ ఆనంద్ అనే ఇద్దరు వ్యక్తులు ఒక ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీని నడుపుతున్నారని.. మే 5న పరీక్ష జరగ్గా, మే 4వ తేదీనే పేపర్ వారి చేతికి వచ్చిందని సికిందర్ వెల్లడించారు. వెంటనే వారు.. ఆ పేపర్ కోసం డబ్బు చెల్లించిన అభ్యర్థులను పట్నాలోని రామకృష్ణానగర్‌లో ఒక రహస్య గృహానికి రప్పించి, వారిని అక్కడే ఉంచారని వివరించారు. సికిందర్ ఇచ్చిన వాంగ్మూలాన్ని నితీశ్, అమిత్ ఇద్దరూ ధ్రువీకరించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడంలో తమ పాత్ర ఉందని ఒప్పుకొన్నారు. ఆ ప్రశ్నపత్రాలు ఇవ్వడానికి ఒక్కో అభ్యర్థి నుంచి రూ.30 లక్షల నుంచి రూ.32 లక్షల దాకా వసూలు చేసినట్టు చెప్పారు.



నీట్‌పై పట్నాలో నిరసన తెలుపుతున్న విద్యార్థిని చెదరగొడుతున్న పోలీసు

### ఏమిటీ సాల్వర్ గ్యాంగులు?

యూపీ, బిహార్, ఝార్ఖండ్ సహా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పోటీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ఈ సాల్వర్ గ్యాంగ్‌లు పనిచేస్తుంటాయి. వీరికి విస్తృతమైన నెట్‌వర్క్ ఉంటుంది. నీట్ పరీక్షనే ఉదాహరణగా తీసుకుంటే.. వీరు నీట్ పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లకు భారీగా డబ్బు ఆశచూపి వలలో వేసుకుంటారు. ఆయా సూపరింటెండెంట్లు.. ప్రశ్నపత్రాలు తమవద్దకు రాగానే వాటిని సాల్వర్ గ్యాంగ్‌లకు చేరవేస్తారు. ఆ గ్యాంగుల్లోని సబ్జెక్టు నిపుణులైన సభ్యులు వాటిని 15-20 నిమిషాల్లో పరిష్కరించి.. ఆ సమాధానాలను అభ్యర్థులతో బట్టీ కొట్టిస్తారు. తర్వాత వారు నేరుగా పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లి పరీక్ష రాస్తారు. ఇంకొన్ని పరీక్షలకైతే.. సాల్వర్ గ్యాంగ్ సభ్యులే పరీక్ష రాసి ర్యాంకు వచ్చేలా చేస్తారు. 'బిహార్ టీచర్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్'లో ఇలాగే మోసం చేస్తూ దొరికిపోయిన నితీశ్‌కుమార్ అనే వ్యక్తిని పట్టుకుని పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నిస్తే.. నీట్ గుట్టు బయటపడడం గమనార్హం.


### రద్దు చేయండి..

నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ కొత్తగా పరీక్ష నిర్వహించాలంటూ ఎన్‌టీఏకి ఆదేశాలు ఇవ్వాలని, ఈ అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ 20 మంది విద్యార్థులు సుప్రీంకోర్టునే ఆశ్రయించారు. అంతేకాదు.. ఈ పరీక్షల్లో 620కి మించి స్కోరు సాధించిన వారి విద్యా నేపథ్యాన్ని పరిశీలించేందుకు కోర్టు అప్పాయింటెడ్ కమిటీ లేదా స్వతంత్ర సంస్థతో 'పోస్ట్ ఎగ్జామ్ ఎనాలిసిస్' జరిపించాలని వారు అందులో విజ్ఞప్తి చేశారు. కాగా.. నీట్ అక్రమాలకు నిరసనగా జూన్ 19, 20 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) పిలుపునిచ్చింది. నీట్ పరీక్షను రద్దు చేయాలని, రాష్ట్రాలు తమ తమ సొంత ప్రవేశపరీక్షలను నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించాలని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ డిమాండ్ చేశారు.

## మోదీ సర్కార్ ఏ క్షణమైనా కూలొచ్చు!

» ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు

» మీరు మూర్ఖుల స్వర్గంలో ఉన్నారు: బీజేపీ




న్యూఢిల్లీ, జూన్ 15: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. మోదీ నేతృత్వంలోని సంకీర్ణ సర్కారు ఏక్షణంలో అయినా కూలిపోవచ్చనని అన్నారు. కూటమి ప్రభుత్వం పొరపాటున ఏర్పడిందని, ప్రజలు బీజేపీకి పూర్తిమెజారిటీ కట్టబెట్టలేదని వ్యాఖ్యానించారు. "ఎన్డీయే ప్రభుత్వం పొరపాటున ఏర్పడింది. మోదీకి సొంత బలం లేదు. ఇది మైనారిటీ ప్రభుత్వం. ఇది ఏ క్షణంలో అయినా కూలిపోవచ్చు" అని ఖర్గే అన్నారు. బెంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అయితే, ఎన్డీయే సర్కారు కూలిపోవాలని తాము కోరుకోవడం లేదని, దేశానికి మంచి చేయాలనే కోరుకుంటున్నామని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం కోసం తాము కూడా కలిసి పనిచేస్తామని చెప్పారు. కానీ, ప్రధాని మోదీకి మంచిని కొనసాగించే అలవాటు లేదని విమర్శించారు. అయితే.. తాము మాత్రం దేశాన్ని దృష్టిలో పెట్టుకుని సహకరిస్తామని చెప్పారు. కాగా, ఖర్గే వ్యాఖ్యలను ఇండియా కూటమి పార్టీ ఆర్జేడీ అధికార ప్రతినిధి ఇజాజ్ అహ్మద్ సమర్థించారు. "ఖర్గే చెప్పింది నిజమే. ప్రజా తీర్పు మోదీకి వ్యతిరేకంగా ఉంది. ప్రధానిగా మోదీని ఓటర్లు అంగీకరించలేదు. అందుకే బీజేపీ 240 సీట్లకే పరిమితం అయింది. అయినా కూడా మోదీ ప్రధాని పదవి చేపట్టారు" అని అహ్మద్ అన్నారు.

### గతాన్ని మరిచారా?: ఎన్డీయే

ఖర్గే వ్యాఖ్యలపై ఎన్డీయే పక్షాల నేతలు నిప్పులు చెరిగారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కూడా సంకీర్ణ సర్కారునే నడిపిందని జేడీయూ నేత నీరజ్ కుమార్ వ్యాఖ్యానించారు. 1991లో కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు వచ్చాయో.. ఏ పరిస్థితిని ఎదుర్కొందో గుర్తు చేసుకోవాలన్నారు. అప్పట్లో పీవీ నరసింహారావు మైనారిటీ ప్రభుత్వాన్ని నడిపించలేదా? చిన్న పార్టీలలో చీలిక తెచ్చి.. తమకు అనుకూలంగా మార్చుకోలేదా? అని ప్రశ్నించారు. "ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారోత్సవంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లింది. దీనిని చూసిన తర్వాత కూడా ఎన్డీయే సర్కారు కూలిపోతుందని వ్యాఖ్యానించారంటే ఖర్గే మూర్ఖుల స్వర్గంలో జీవిస్తున్నారనే భావిస్తున్నా" అని తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై వ్యాఖ్యానించారు.

## లోకం తీరు




## 14 ఏళ్ల తర్వాత కేసు పెట్టడమా?

» అరుంధతి రాయ్‌పై 'ఉపా'.. అణచివేతే

» ఫాసిస్టు ధోరణికి నిదర్శనం: విపక్షాలు

న్యూఢిల్లీ, జూన్ 15: ప్రఖ్యాత రచయిత్రి అరుంధతీ రాయ్‌పై కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద విచారణ జరిపేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతి ఇవ్వడాన్ని సీపీఎం ఖండించింది. "ఫాసిస్టు చర్య తప్పించి దీంట్లో ఎలాంటి హేతుబద్ధత లేదు. కోర్టులు, న్యాయవాదులు సెలవుల్లో ఉన్నప్పుడు ఈ నిర్ణయం తీసుకోవడం అనుమానాస్పదంగా ఉంది. సిగ్గుచేటు" అంటూ ట్వీట్ చేసింది. కాంగ్రెస్ నాయకుడు హరిప్రసాద్ బికె. ట్వీట్ చేస్తూ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ ప్రతి రోజూ ఇలాంటి వివాదాలను సృష్టిస్తోందని విమర్శించారు. ఇలాంటి ఫాసిజం ఉండకూడదనే బీజేపీ వ్యతిరేకంగా దేశ ప్రజలు ఓటు వేశారని, కానీ వారు మళ్లీ అదే పనిచేస్తున్నారని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా విమర్శించారు. జమ్మూ-కశ్మీర్‌కు చెందిన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), పీడీపీ కూడా లెఫ్టినెంట్ గవర్నర్ చర్యను నిరసించాయి. భిన్న స్వరాలను తొక్కివేసి, భావ ప్రకటన స్వేచ్ఛను క్రిమినల్ నేరంగా పరిగణించేందుకే 'ఉపా' చట్టాన్ని ప్రయోగించారని ఎన్‌సీ విమర్శించింది. "ప్రసంగించిన 14 ఏళ్ల తరువాత ఉపా కింద కేసు పెట్టారు. ఆ ఉపన్యాసాన్ని అందరూ మరిచిపోయారు. ఎన్నికల్లో ఎదురు దెబ్బలుతిన్నప్పటికీ తమ కరుడుగట్టిన వైఖరి మారలేదని చెప్పుకోవడానికే బీజేపీ ఈ కేసు పెట్టింది" అని వ్యాఖ్యానించింది. కాగా, అరుంధతీ రాయ్‌తో పాటు కశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ న్యాయ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌ను కూడా ఇదే చట్టం కింద విచారించేందుకు కూడా లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి ఇచ్చారు.

## లద్దాక్‌లో చైనా మోహరింపు

న్యూఢిల్లీ, జూన్ 15: లద్దాక్‌లోని చైనా ఆక్రమిత జోన్‌లో మిలటరీ మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నట్లు ఇంటెలిజెన్స్ నివేదికలు వెల్లడించాయి. 2020 మేలో ఇరుదేశాల మధ్య ప్రతిష్టంభన ఏర్పడినప్పటి నుంచి భారత సైన్యం కూడా లద్దాక్‌లోని పర్వతప్రాంతంలో సైనిక పోస్టులు పెంచిందని, భారీగా సైన్యాన్ని మోహరించిందని అధికారవర్గాలు తెలిపాయి. తూర్పు లద్దాక్‌లోని డెప్సాంగ్ మైదాన ప్రాంతంలో అనేక సమస్యాత్మక పాయింట్ల వద్ద చైనా సైనిక మోహరింపులను పెంచిందని కేంద్ర హోంశాఖలోని ఓ భద్రతాధికారి శుక్రవారం ఓ ఆంగ్ల దినపత్రికకు తెలిపారు. అది తమ భూభాగమని భారత్ వాదిస్తున్న ప్రదేశాల్లోనూ చైనా సైన్యం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్మిస్తోందని, ఇతర వివాదాస్పద ప్రాంతాల్లోనూ సైనిక మోహరింపులను పెంచిందని ఇటీవలి నివేదికలు తెలియజేస్తున్నాయన్నారు. డెప్సాంగ్‌లోని మైదాన ప్రాంతాల్లో అదనపు హైవేలు, రోడ్లను చైనా సైన్యం నిర్మిస్తోందని, పాంగాంగ్ సరస్సు ఉత్తర, దక్షిణ దిక్కుల్లో మిలటరీ మౌలిక సదుపాయాల నిర్మాణాలను వేగవంతం చేసిందన్నారు. గల్వాన్ లోయ, పాంగాంగ్ సరస్సు, హాట్ స్ప్రింగ్స్, గోగ్రా ప్రాంతాల్లో ఆక్రమిత ప్రాంతాల నుంచి పాక్షికంగా వైదొలిగేందుకు చైనా అంగీకరించినా డెప్సాంగ్‌లోని ఆక్రమిత ప్రాంతం నుంచి వైదొలిగేందుకు నిరాకరిస్తూనే ఉంది. బఫర్‌జోన్ సృష్టి ద్వారా ఇరుసైన్యాలు వెనక్కి జరగాలని ఒప్పందం చేసుకున్నా చైనా సైన్యం భారత భూభాగంలోనే తిష్టవేసిందని, భారత సైన్యం వెనక్కి జరగడంతో మరింత భూభాగాన్ని చైనాకు అప్పగించినట్లైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టెంపో

## అలకనంద నదిలోకి దూసుకెళ్లిన టెంపో

» 14 మంది యాత్రికుల మృతి

రుద్రప్రయాగ్, జూన్ 15: ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రిషికేశ్-బద్రీనాథ్ జాతీయ రహదారిపై యాత్రికులతో వెళ్తున్న టెంపో శనివారం ఉదయం అదుపుతప్పి దాదాపు 250 మీటర్ల లోతులో అలకనంద నదిలో పడింది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మరణించగా, 12 మంది గాయపడ్డారు. టెంపోలో మొత్తం 26 మంది ఉన్నారని, వారిలో అత్యధికులు ఢిల్లీకి చెందిన వారేనని, పర్యాటక ప్రాంతమైన చోప్తాకు వెళ్తుండగా రైటోలి వద్ద ప్రమాదం జరిగిందని రుద్రప్రయాగ్ ఎస్పీ అశోక్ భదానే తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఏడుగురిని సీఎం పుష్కర్‌సింగ్ ధామి ఆదేశాలతో హెలికాప్టర్ ద్వారా రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# చైనా.. తీరు మార్చుకో

» ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు సాయం తగదు

» తక్షణమే ఆపకుంటే.. మరిన్ని ఆంక్షలు తప్పవు

» ఉమ్మడి ప్రకటనలో జీ-7 కూటమి హెచ్చరిక

బారి(ఇటలీ), జూన్ 15: ఇప్పటివరకు రష్యాను ఉమ్మడి సంప్రదాయ శత్రువుగా పరిగణిస్తూ వస్తున్న జీ-7 కూటమి.. తాజాగా చైనాను కూడా దాని సరసన చేర్చింది. ఆయుధాలు, మందుగుండు సామగ్రి సరఫరా ద్వారా ఉక్రెయిన్‌పై మాస్కో సాగిస్తున్న యుద్ధాన్ని డ్రాగన్ ఎగదోస్తోందని, భద్రతాపరంగా అనేక సమస్యలకు కారణమవుతోందని మండిపడింది. దీనిని తక్షణమే ఆపకుంటే మరిన్ని ఆంక్షలను విధిస్తామని హెచ్చరించింది. ఇటలీలోని అపూలియాలో జరిగిన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, జపాన్, కెనడాలతో కూడిన జీ-7 దేశాల శిఖరాగ్ర సమావేశం ముగింపు సందర్భంగా ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేసింది. కూటమి భేటీలోనూ బీజింగ్ విషయమై వాడివేడిగా చర్చ జరిగింది. రష్యా యుద్ధోన్మాదానికి సామగ్రి అందజేస్తున్న దేశంగా చైనాను జీ-7 ప్రకటన పేర్కొంది. బీజింగ్‌తో పాటు ఇలాంటి సాయం అందిస్తున్న దేశాలు, సంస్థలపై చర్యలను కొనసాగిస్తామని స్పష్టం చేసింది. 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలు నుంచి రష్యాకు చైనా క్షిపణి విడి భాగాలు, సెమీ కండక్టర్లు, మందుగుండు తయారీ ముడిపదార్థాలను సరఫరా చేస్తోంది. ఆంక్షల కారణంగా ఇతర ప్రాంతాల నుంచి రవాణా పడిపోవడంతో డ్రాగన్ తయారీ వినియోగ వస్తువులకు రష్యా కేంద్రంగానూ మారింది. ప్రతిగా చైనా తక్కువ ధరకు మాస్కో నుంచి ఇంధనాన్ని పొందుతోంది. ఈ నేపథ్యంలోనే బీజింగ్‌ను తీవ్రంగా తప్పుబడుతూ జీ-7 కూటమి ప్రకటన వెలువరించింది. టిబెట్, జిన్జియాంగ్, హాంకాంగ్‌లో చైనా ప్రమేయం మితిమీరుతోందని ఆరోపించింది. గత ఏడాది వరకు పశ్చిమ దేశాలు.. ఉక్రెయిన్ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఒప్పించగల, నచ్చజెప్పగల శక్తిగా జిన్‌పింగ్‌ను చూశాయి. ఇప్పుడు వాటి ధోరణి పూర్తిగా మారిపోయి, ఏకంగా యుద్ధాన్ని ఎగదోస్తున్నట్లు చూస్తున్నాయి.

### ఉత్పత్తి పెంచుదాం..

వస్తువుల విక్రయంలో చైనా అనుసరిస్తున్న విధానాలను నీతిమాలినవి అంటూ జీ-7 నేతలు అభివర్ణించారు. విద్యుత్తు వాహనాలు, సౌర ఫలకాల వంటి పునరుత్పాదక ఉత్పత్తులను చౌకగా తయారు చేసి తమ మార్కెట్‌లోకి కుమ్మరిస్తోందని ధ్వజమెత్తారు. ఇది తమ దేశ సంస్థలు, ఉద్యోగాలను ప్రమాదంలోకి నెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రాగన్‌కు చెక్ పెట్టేలా దేశీయంగా వస్తు ఉత్పత్తిని పెంచుదామని, చైనా అనైతిక విధానాలను డబ్ల్యూటీవోలో ఉమ్మడిగా సవాల్ చేయాలని జీ-7 కూటమి నేతలు నిర్ణయించారు.



### మెలోడీ

"నమస్తే" అంటూ భారత ప్రధాని మోదీని జీ-7 సదస్సుకు ఆహ్వానించిన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ.. ఆయనతో సెల్ఫీ దిగారు. దీనిని "హాయ్ ఫ్రెండ్స్. ఫ్రమ్ మెలోడీ(మెలోనీ+మోడీ) శీర్షికతో ట్వీట్ చేశారు. ఇదిప్పుడు వైరల్‌గా మారింది. డిసెంబరులో యూఏఈలో జరిగిన 'కాప్28' సదస్సు సందర్భంగా మోదీతో దిగిన సెల్ఫీకి హ్యాష్‌ట్యాగ్‌ను జతచేసి మెలోడీ అంటూ మెలోనీ సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. భారత్, ఇటలీ ప్రధానులు శుక్రవారం ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతిపై సమీక్షించారు. కాగా, దౌత్యపరంగా విభేదాలు తలెత్తిన కెనడా ప్రధాని ట్రూడోతో మోదీ కొద్దిసేపు సంభాషించారు. బైడెన్‌తోనూ మోదీ సమావేశం అయ్యారు. కాగా, ఇటలీ నుంచి మోదీ శుక్రవారం భారత్‌కు తిరిగి చేరుకున్నారు.

# అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్

» 8 మంది నక్సల్స్, ఒక జవాన్ మృతి

చర్ల, జూన్ 15: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్‌లో శనివారం భద్రత బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో 8 మంది నక్సలైట్లు, ఓ జవాన్ మృతిచెందారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్‌కుమార్ కథనం ప్రకారం నారాయణపూర్ జిల్లా కుతుల్, ఫర్సాబేడ, కోటమెడ గ్రామాల పరిధిలోని అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీసులకు ఉప్పందింది. దాంతో నారాయణపూర్, కొండేగావ్, కాంకేర్, దంతేవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్‌కు చెందిన సుమారు 1,200 మంది పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. అబూజ్‌మడ్ అడవుల వైపు వస్తున్న బలగాలపైకి మావోయిస్టులు కాల్పులు జరపడంతో పోలీసులు ఎదురుకాల్పులకు దిగారు. కడపటి వార్తలందేసరికి ఇరువైపులా కాల్పులు కొనసాగుతున్నాయి. ప్రాథమిక సమాచారంమేరకు పోలీసులు 8మంది నక్సల్స్ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. నక్సల్స్‌కు చెందిన ఇన్సాస్ రైఫిల్, బీజీఎల్ లాంచర్లు, మందుపాతరలు, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కాగా కాంకేర్, బీజాపూర్, నారాయణపూర్, సుకుమా జిల్లాల్లో గత ఆర్నెల్లలో జరిగిన ఎన్‌కౌంటర్‌లలో 125మంది మావోయిస్టులు మృతి చెందారు. కాగా బీజాపూర్ జిల్లా గడమలి, కడేరు రోడ్‌పై భద్రత బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు మందుపాతరలు అమర్చారు. శనివారం రూట్‌వాచ్‌లో ఉన్న బాంబ్/డాగ్ స్క్వాడ్‌లు 10కిలోల మందుపాతరను గుర్తించి నిర్వీర్యం చేశాయి. కాగా, సుకుమా అడవుల్లో మావోయిస్టుల స్నైపర్ జాకెట్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

### ములుగులో ఆరుగురి అరెస్టు

ములుగు, జూన్ 15: మావోయిస్టుల భారీ కుట్రను ములుగు జిల్లా పోలీసులు భగ్నం చేశారు. వెంకటాపురం(నూగూరు) మండలం తడపల గ్రామ సమీపంలో మందుపాతరలను అమరుస్తున్న ఆరుగురిని గురువారం అరెస్టు చేశారు. శనివారం ములుగు ఎస్పీ శబరీశ్ వివరాలు వెల్లడించారు. కర్రెగుట్టలపై మావోయిస్టులు గెరిల్లా బేస్‌క్యాంపు ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. అడవుల్లో ఆ సమయంలో ఆరుగురు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారిలో వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ మావోయిస్టు డిప్యూటీ దళకమాండర్ కారం బుద్రి అలియాస్ రీతా, పామేడు ఏరియా కమిటీ సభ్యురాలు సోడి కోసి అలియాస్ మోతె, ఒకటో బెటాలియన్ సభ్యుడు సోడి విజయ్, ముగ్గురు మిలీషియా సభ్యులున్నారు.

## ప్లేటు భోజనం రూ.19 వేలు!

**ఈ-రిక్షాలు, పెట్రోల్ కార్లకూ డీజిల్ బిల్లులు**

**రాంచీ హాకీ టోర్నమెంట్‌లో భారీ కుంభకోణం?**



రాంచీ, జూన్ 15: 'ప్లేటు భోజనానికి రూ.19 వేలు చొప్పున చెల్లించారు. బ్యాటరీతో నడిచే ఈ-రిక్షాకు, పెట్రోలు కార్లకు డీజిల్ కొట్టించినట్లుగా బిల్లులు ఇచ్చేశారు..'అంటూ ఝార్ఖండ్ క్రీడా శాఖపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది అక్టోబరు, నవంబరు మధ్య రాంచీలో నిర్వహించిన మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ- 2023 కి సంబంధించి పలు బిల్లుల చెల్లింపులు అనుమానాస్పదంగా ఉన్నాయంటూ స్థానిక వార్తాపత్రిక ప్రచురించిన కథనం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపింది. 'ఈ-రిక్షాలు, పెట్రోలు కార్లలో డీజిల్ నింపినట్లుగా పెట్టిన బిల్లులకు స్పోర్ట్స్ డైరెక్టరేట్ డబ్బులు చెల్లించింది. టోర్నమెంట్ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టేట్ డిన్నర్‌లో ప్లేటుకు రూ.19వేల చొప్పున భారీమొత్తం చెల్లించారు' అని పేర్కొంటున్న ఓ నివేదిక ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆసియా మహిళల హాకీ చాంపియన్‌షిప్ నిర్వహణలో జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం భారీ కుంభకోణానికి పాల్పడిందని బీజేపీ ఆరోపించింది. దీనిపై సీఎం చంపయిసోరెన్ వెంటనే సీబీఐ, ఈడీ విచారణకు సిఫారసు చేయాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను స్పోర్ట్స్ డైరెక్టరేట్ ఖండించింది.

## పోలీసు అకాడమీని సందర్శించిన ప్రొబేషనరీ ఐఏఎస్‌లు

### కుమార్తెకు సెల్యూట్ చేసి ఆహ్వానించిన తండ్రి!

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ శిక్షణ కేంద్రం(టీజీపీఏ)ను ఏడుగురు ప్రొబేషనరీ ఐఏఎస్‌లు సందర్శించారు. ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో భాగంగా ప్రొబేషనరీ ఐఏఎస్‌లు శనివారం అకాడమీకి వచ్చారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఇతర అధికారులు వారికి స్వాగతం పలికారు. అకాడమీ పనితీరును డిప్యూటీ డైరెక్టర్ నర్మద వారికి వివరించారు. అకాడమీ మొత్తం సందర్శించిన ఐఏఎస్‌లు ఆయా విభాగాల పనితీరు తెలుసుకున్నారు. కాగా అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న వెంకటేశ్వర్లు కుమార్తె ఉమా హారతి (2023 బ్యాచ్ ఐఏఎస్) కూడా వచ్చిన వారిలో ఉన్నారు. కుమార్తె ఐఏఎస్ అధికారి హోదాలో రాగా తండ్రి సెల్యూట్ చేసి ఆహ్వానించడం ప్రత్యేకంగా నిలిచింది.



ఐఏఎస్‌గా వచ్చిన కుమార్తెకు సెల్యూట్ చేస్తున్న అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

## బీసీ స్కాలర్‌షిప్‌లకు 387 కోట్లు

### విదేశీ విద్యానిధి పథకానికి మరో 15 కోట్లు

### ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం



హైదరాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ పరిధిలోని పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లతో పాటు, మహాత్మ జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి పథకాలకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. బీసీ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.387 కోట్లు, విదేశీ విద్యానిధి పథకంలో ప్రస్తుతం నడుస్తున్న సెషన్‌లకు సంబంధించిన వాటి కోసం రూ.15 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులను జారీ చేసింది.

# అంతం చూసిన వివాహేతర బంధం!

### వేర్వేరు ఘటనల్లో పలువురి హత్య.. నిందితులు కట్టుకున్న భార్య, భర్త, తల్లి

- కొడుకును హత్యచేసిన తల్లి
- వివాహేతర బంధాన్ని నిలదీస్తున్నాడని ఘాతుకం



పటాన్‌చెరు, జూన్ 15: వివాహేతర సంబంధాన్ని నిలదీస్తున్నాడని కన్న కొడుకునే కడతేర్చింది ఓ తల్లి. కుమారుడిని గొంతు నులిమి చంపేసి.. ఆపై ప్రియుడితో కలిసి బాలుడి మృతదేహాన్ని పారేసింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఈ దారుణం జరిగింది. ఈ నెల 11న ముత్తంగి సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు పక్కన పొదల్లో పడేసి ఉన్న గుర్తు తెలియని బాలుడి మృతదేహానికి సంబంధించిన కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం పోల్కంపేట గ్రామానికి చెందిన కర్రె స్వాతి(30), ఆమె భర్త రాజు రామచంద్రాపురం పట్టణంలోని పాతబస్తీలో నివాసముంటున్నారు. వారికి కుమారుడు విష్ణువర్ధన్(9), కుమార్తె ఉన్నారు. కొంతకాలం క్రితం రాజు మృతిచెందాడు. అదే బస్తీలో ఉంటున్న ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం చీమకుర్తికి చెందిన దొంతు అనిల్(31)తో స్వాతి వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ క్రమంలో ఈ నెల 10న సాయంత్రం విష్ణువర్ధన్.. తల్లితో గొడవకు దిగాడు. వివాహేతర బంధంపై నిలదీశాడు. ఆమె ఆగ్రహంతో బాలుడి గొంతు నులిమేయడంతో అతడు చనిపోయాడు. దీంతో నేరం నుంచి తప్పించుకోవాలని భావించిన స్వాతి.. టవల్‌తో బాలుడి మెడకు ఉరేసి కిటికీకి వేలాడదీసింది. ఇంటికి వచ్చిన కుమార్తె, సహజీవనం చేస్తున్న అనిల్‌తో విష్ణువర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని నమ్మించింది. రాత్రి స్కూటీపై విష్ణువర్ధన్ మృతదేహాన్ని పెట్టుకుని స్వాతి, అనిల్.. ముత్తంగి ఔటర్ జంక్షన్‌కు చేరుకున్నారు. సర్వీస్ రోడ్డు పక్కన పొదల్లో మృతదేహాన్ని పడేశారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. నిందితులను పట్టుకున్నారు.

### ప్రియురాలిని కొట్టబోయిందని.. భార్యను చితకబాదిన భర్త

అంబర్‌పేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలిని కొట్టబోయిన భార్యను.. ఆమె భర్త చితకబాదాడు. వివాహేతర సంబంధాన్ని నిలదీసినందుకు దారుణంగా కొట్టాడు. అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని డీడీ కాలనీలో జరిగిందీ ఘటన. ముషీరాబాద్ రాంనగర్‌కు చెందిన కె. ప్రవీణ్‌కుమార్‌కు మెర్సీ ఏంజెల్‌తో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రవీణ్ వ్యాపారం చేస్తాడు. అతడి వద్ద ఉషశ్రీ అనే మహిళ పనిలో చేరింది. ఉషశ్రీకి భర్త ఫణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో ప్రవీణ్, ఉషశ్రీల మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో ప్రవీణ్ భార్య, పిల్లలను వదిలేశాడు. ఉషశ్రీ కూడా భర్త, పిల్లలను వదిలేసింది. వనస్థలిపురంలో ఉషశ్రీతో నాలుగు నెలల పాటు సహజీవనం చేసిన ప్రవీణ్.. రెండు నెలల క్రితం డీడీ కాలనీకి మకాం మార్చాడు. ఈ క్రమంలో శనివారం మెర్సీ ఏంజెల్ తన పిల్లలతో కలిసి డీడీ కాలనీలో ప్రవీణ్ ఉంటున్న నివాసానికి వెళ్లింది. అక్కడ ఉషశ్రీని కొట్టడానికి ప్రయత్నించగా.. ప్రవీణ్ అడ్డుకుని భార్య మెర్సీ ఏంజెల్‌ను చితకబాదాడు. ఈ విషయం అంబర్‌పేట పోలీసులకు తెలియడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వారిని ఠాణాకు తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న ఉషశ్రీ భర్త ఫణి కూడా స్టేషన్‌కు చేరుకుని తన భార్యను తనతో పంపించాలని పోలీసులను కోరాడు. అయితే తనపై మెర్సీ దాడి చేసిందని ఉషశ్రీ అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### భార్యను కొట్టి చంపిన భర్త

ఆదిలాబాద్ రూరల్, జూన్ 15 : భార్య ఇతరులతో వివాహేతర సంబంధం నెరుపుతోందని అనుమానించిన భర్త.. ఆమెను తీవ్రంగా కొట్టాడు. ఈ క్రమంలో దెబ్బలు గట్టిగా తగలడంతో ఆమె చనిపోయింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌లో రోడ్డు పక్కన గుర్తుపట్టని స్థితిలో ఉన్న మహిళ మృతదేహం కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. ఆదిలాబాద్‌లోని ఖుర్షీద్‌నగర్ కాలనీలో ఉండే ఆటో డ్రైవర్ ఖలీల్‌ఖాన్ ఈ నెల 12న అర్ధరాత్రి ఇంటికి వెళ్లాడు. అయితే, అతడిని చూసి.. ఇంట్లో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బయటకు పరిగెత్తారు. ఇది గమనించిన ఖలీల్‌ఖాన్ తన రెండో భార్య భారతి(35) అలియాస్ సల్మాతో వారికి వివాహేతర సంబంధం కొనసాగుతోందని అనుమానించి.. ఆమెను తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆమె చనిపోయింది. అనంతరం ఖలీల్ తన ఆటోలో మృతదేహాన్ని తీసుకెళ్లి ఓ జిన్నింగ్ ఫ్యాక్టరీ పక్కన పడేశాడు. 13న ఉదయం స్థానికుల ద్వారా పోలీసులు విషయం తెలుసుకున్నారు.

## భార్యే కడతేర్చింది!

- టీచర్ హత్య కేసులో వీడిన మిస్టరీ

ఉట్నూర్, జూన్ 15 : ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ నాగేందర్ శనివారం వివరించారు. నార్నూర్ మండలం నాగోల్‌కొండకు చెందిన గజేందర్ జైనథ్ మండలంలోని మేడిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు. ఆయనకు తొమ్మిదేళ్ల క్రితం నాగోల్‌కొండకే చెందిన విజయలక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నారు. ఆదిలాబాద్‌లోని రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. గజేందర్ భార్య విజయలక్ష్మికి ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం తాడిహత్నూర్‌కు చెందిన రాథోడ్ మహేశ్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయమై గజేందర్, అతని భార్యకు పలుమార్లు గొడవలు జరిగినా.. ఆ తర్వాత సద్దుమణిగాయి. తమ ఆనందానికి గజేందర్ అడ్డుగా ఉన్నాడని భావించిన విజయలక్ష్మి... అతడిని ఎలాగైనా చంపాలని ప్రియుడితో కలిసి ప్రణాళిక రచించింది. బేల పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న బోదే సుశీల్, ఉర్వేత కృష్ణకు రూ.3లక్షల చొప్పున సుపారీ ఇచ్చి.. ఒప్పందం కుదుర్చుకుంది. పాఠశాలలు పునః ప్రారంభమైన రోజు గజేందర్ బైక్‌పై మేడిగూడ పాఠశాలకు వెళ్తుండగా.. గాదిగూడ మండలం అర్జుని సమీపంలో రాథోడ్‌మహేశ్, బోదే సుశీల్, ఉర్వేత కృష్ణ అడ్డుకున్నారు. పంట పొలాల్లోకి లాక్కెళ్లి బండరాయితో కొట్టి దారుణంగా హత్య చేశారు. మృతుడి తండ్రి బిక్కు తన కోడలు విజయలక్ష్మిపై అనుమానం ఉందని చెప్పడంతో.. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడి భార్య విజయలక్ష్మితోపాటు ప్రియుడు రాథోడ్ మహేశ్, బేలకు చెందిన బోదె సుశీల్, కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ వివరించారు.

# పదహారేళ్ల బాలుడితో వివాహిత పరార్

- భర్త, పిల్లలను వదిలేసి చెన్నైకి పలాయనం
- అద్దె గదిలో శారీరక బంధం
- బాలుడి ఇంట్లోని నగలు, డబ్బు తీసుకెళ్లి జల్సాలు
- మహిళను అరెస్టు చేసిన సిద్దిపేట పోలీసులు



సిద్దిపేట క్రైం, జూన్ 15 : జల్సాలకు అలవాటు పడిన ఓ వివాహిత.. ఇంటి యజమాని వద్ద ఉన్న డబ్బు, నగలపై కన్నేసింది. యజమాని కుమారుడైన పదహారేళ్ల బాలుడిని ప్రేమలోకి దింపి వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఆపై అబ్బాయి ద్వారా వారి ఇంట్లోని డబ్బు, నగలను తెప్పించింది. వాటిని సర్దుకుని, భర్త పిల్లలను వదిలేసి.. ఆ బాలుడిని తీసుకుని చెన్నై వెళ్లిపోయింది. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన సిద్దిపేట టూ టౌన్ పోలీసులు.. ఆ మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోలంకి అలియాస్ గైక్వాడ్ రాధ భర్త పిల్లలతో కలిసి సిద్దిపేటలోని హనుమాన్‌నగర్‌లో మూడేళ్ల క్రితం ఓ ఇంట్లో అద్దెకు దిగింది. ఆ ఇంటి యజమాని కుమారుడైన 16 ఏళ్ల బాలుడిని మాయ మాటలతో లోబరుచుకుని అతడితో బలవంతంగా శృంగారంలో పాల్గొంది. కొన్ని రోజుల తర్వాత ఆ బాలుడితో ఎక్కడికైనా వెళ్లిపోవాలని నిర్ణయించుకున్న ఆమె.. అతడిని ఒప్పించింది. బాలుడి ఇంట్లో ఉన్న డబ్బులు, నగలను అతడి ద్వారానే తెప్పించుకుంది. ఆపై భర్త, పిల్లలను వదిలేసి జనవరి 24న బాలుడిని తీసుకొని చెన్నై వెళ్లిపోయింది. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సిద్దిపేట టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో ఆ మహిళ చెన్నైలో ఉన్నట్లు గుర్తించారు. ఎలాగైనా పోలీసులు పట్టుకుంటారని గ్రహించిన ఆమె.. ఈ నెల 11న బాలుడిని సిద్దిపేటలో వదిలేసింది. దీంతో అతడు ఇంటికి చేరుకున్నాడు. బాలుడి తల్లి అతడిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లింది. ఏం జరిగిందని పోలీసులు విచారించగా.. ఆ మహిళ చెన్నైలో ఒక రూమ్ కిరాయికి తీసుకొని తనను ఉంచిందని తెలిపాడు. అక్కడ తనను బలవంతపెట్టి తరచూ శారీరకంగా కలిసిందని చెప్పాడు. వెంట తీసుకెళ్లిన డబ్బులు ఖర్చయిన తర్వాత బంగారాన్ని చెన్నైలో గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మేసిందని తెలిపాడు. ఆ నగదు కూడా జల్సాలకు అయిపోయిందని చెప్పాడు. పోలీసులు పోక్సో కేసు పెట్టి ఆ మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

## ఎకరం భూమి కోసం.. భర్త హత్య

- కొట్టి చంపిన భార్య, కుమారుడు, మామ

ఎల్లారెడ్డి, జూన్ 15 : ఎకరం పొలం కోసం కుటుంబ సభ్యులే ఓ వ్యక్తిని దారుణంగా కర్రలతో కొట్టారు. దీంతో దెబ్బలు తాళలేక అతడు పొలంలోనే చనిపోయాడు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సాతెల్లి గ్రామానికి చెందిన కుర్మ దుర్గయ్య(35) రెండు ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన లక్ష్మిని 15 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి 13 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. కాపురంలో గొడవలు జరగడంతో దంపతులు పదేళ్లుగా వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో తనకు ఎకరం పొలం ఇవ్వాలని లక్ష్మి ఇటీవల భర్తను కోరగా.. అందుకు దుర్గయ్య ససేమిరా అన్నాడు. తనకు విడాకులు ఇచ్చాక ఆలోచిస్తానని చెప్పాడు. దీంతో లక్ష్మి కోపంతో రగిలిపోయింది. శనివారం దుర్గయ్య పొలం వద్ద ఉండగా.. గమనించిన లక్ష్మి, ఆమె కుమారుడు, తండ్రి.. భూమి విషయమై దుర్గయ్యతో గొడవకు దిగారు. అతడు ప్రతిఘటించడంతో.. ముగ్గురూ కర్రలతో కొట్టారు. స్థానికులు దుర్గయ్యను ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు చనిపోయాడు.

## బీబీనగర్ యువతి ఆవిష్కరణకు పేటెంట్ హక్కు



తాను తయారుచేసిన చేతి కర్రతో శ్రావణి

బీబీనగర్, జూన్ 15 : జాతీయస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో సత్తా చాటిన ఓ యువతి ప్రాజెక్టుకు పేటెంట్ హక్కులు లభించాయి. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పట్టణంలో నిరుపేద కుటుంబానికి చెంది న కుమ్మరి శ్రావణి ప్రస్తుతం బిహార్‌లోని పట్నా ఐఐటీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదివే సమయంలో వృద్ధులు, రైతుల ప్రాణాలు రక్షించే చేతి కర్ర పరికరాన్ని ఆవిష్కరించింది. ఇది 2019లో నిర్వహించిన జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ఆరో స్థానం దక్కించుకుంది. అంతేకాకుండా రాష్ట్రపతి భవన్‌లో, జపాన్‌లో నిర్వహించిన ప్రదర్శనలకు ఎంపికైంది. 10 రోజుల క్రితం దీనికి భారత ప్రభుత్వం పేటెంట్ హక్కులను కల్పించింది. శ్రావణి తండ్రి పరశురాములు ఓ ప్రైవేట్ కళాశాల బస్సుకు డ్రైవర్‌గా పనిచేస్తుండగా తల్లి కవిత గృహిణిగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వృద్ధులు రాత్రివేళల్లో నడిచేటప్పుడు, పంట పొలాల్లో తిరిగేటప్పుడు పాముకాటుకు గురై ప్రాణాలు పోగొట్టుకోవడం శ్రావణిని కదిలించి దీన్ని రూపొందించింది. దీని అడుగు భాగంలో ఒక వైబ్రేటర్, దానిపైన బజర్, టార్చ్‌లైట్‌ను, మధ్యలో బ్యాటరీని అమర్చుతారు. దీన్ని పట్టుకొని అడుగులు వేసినప్పుడు వైబ్రేటర్ ఆన్ అవుతుంది. కర్ర పెట్టిన స్థలం నుంచి రెండు మీటర్ల విస్తీర్ణంలో ప్రకంపనలు వస్తాయి. ఆ ప్రకంపనలకు పాములు, ఇతర విష పురుగులు దూరంగా వెళ్లిపోతాయి. దీనికి అమర్చిన బజర్ సౌండ్‌తో పంట పొలాల్లోకి వచ్చిన అడవి పందులు, పిట్టలు పారిపోతాయి. దీని తయారీకి రూ.2 నుంచి రూ.3 వేలకు వెంచి ఖర్చవదని శ్రావణి తెలిపింది.

### ఎస్సీ గురుకులంలో పదోన్నతులకు లైన్‌క్లియర్.!

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ గురుకులంలో ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్న సీనియారిటీ, పదోన్నతులకు లైన్ క్లియరయింది. ఇందుకు సంబంధించి త్వరలోనే అర్హులైన ఉద్యోగులకు ఆయా కేటగిరీలో పదోన్నతులు లభించనుండగా అదే సమయంలో బదిలీలు జరగనున్నాయి. పదోన్నతులు, బదిలీలకు అవసరమైన సీనియారిటీ జాబితా ఖరారుకు సంబంధించిన ప్రక్రియను ఎస్సీ గురుకులం ప్రారంభించింది. ఇందులో భాగంగానే టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాలకు సంబంధించిన 22 కేటగిరీల వారీగా ప్రొవిజినల్ సీనియారిటీ లిస్టును శనివారం వెబ్‌సైట్‌లో ఉంచింది. కాగా జూన్ 19 వరకు అభ్యంతరాల స్వీకరణకు అధికారులు అవకాశం కల్పించారు.

# మెదక్‌లో ఇరు వర్గాల ఘర్షణ.. ఉద్రిక్తత

### జంతువధపై మొదలైన వివాదం.. బీజేవైఎం నేతకు కత్తి గాయాలు

- లాఠీచార్జి.. పీఎస్ ముందు నిరసన
- నేడు పట్టణ బంద్‌కు బీజేపీ పిలుపు



మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న యువకులు

మెదక్ అర్బన్, జూన్ 15: మెదక్ జిల్లా కేంద్రంలో జంతువధకు సంబంధించి ఇరు వర్గాల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కోలిగడ్డకు చెందిన రాజ్‌అరుణ్ అనే యువకుడికి కడుపు, చేతిపై కత్తిపోట్లు పడ్డాయి. అతని వర్గీయులు వెళ్లి రాంనగర్‌లో కొందరిని పట్టుకోగా అక్కడా తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఈ క్రమంలో అతని వర్గీయులపై మరో వర్గం రాళ్లతో దాడి చేసింది. నార్సింగి అనే యువకుడికి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం గాయపడిన యువకుల వర్గానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో సంఖ్యలో చేరుకుని... రాళ్ల దాడి చేసిన వారు ఒక ప్రైవేటులో ఆస్పత్రిలో ఉన్నారని భావించి కర్రలతో ఆ ఆస్పత్రి అద్దాలను, ముందు నిలిపి ఉన్న కారును ధ్వంసం చేశారు. పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టారు. దీంతో వారు పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. రెండు గంటల పాటు నిరసన కొనసాగించారు. జిల్లా ఎస్పీ బాలస్వామి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. యువకులు తిరిగి వెళ్లే మార్గంలో ఓ హోటల్ అద్దాలను, పాత బస్టాండ్ వద్ద పలు పాన్ షాపులను ధ్వంసం చేశారు. మరోవైపు కోలిగడ్డలో ఓ ఇంటిపై ఒక వర్గం వారు రాళ్లు విసిరారు. ఇలా పరస్పర దాడులతో పట్టణం అట్టుడికింది. స్పెషల్ పార్టీ, ఏఆర్ పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. ప్రస్తుతం జిల్లా కేంద్రం పోలీసు వలయంలో ఉంది. ఇరు వర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం మెదక్ పట్టణ బంద్‌కు బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ పిలుపునిచ్చాయి.



దాడుల్లో గాయపడిన రాజ్ అరుణ్, నార్సింగ్

### ఘర్షణకు కారకులపై కఠిన చర్యలు: ఐజీ

మెదక్‌లో పరిస్థితి పూర్తి అదుపులో ఉందని ఐజీ రంగనాథ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి ఆయన మెదక్‌ను సందర్శించారు. ప్రజలందరూ సమన్వయం పాటించాలని కోరారు. ఘర్షణకు కారకులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని, వదంతులను నమ్మొద్దని సూచించారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

# గతం మరిచి గగ్గోలు...

ఆంధ్రప్రదేశ్‌లో దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయి. ప్రజాస్వామ్యం, హక్కులు, విలువలు, విశ్వసనీయత వంటి పదాలు వల్లె వేస్తున్నాయి. 'దేవుడా ఇదెక్కడి ప్రజాస్వామ్యం' అని సదరు గొంతులు వాపోతున్నాయి. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని, వైసీపీ కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆ పార్టీ ఎంపీలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి వంటి వాళ్లు ఏకంగా రాష్ట్రపతికి ఫిర్యాదు చేసే ప్రయత్నం చేయగా, పార్టీ అధినేత జగన్‌రెడ్డి మరో అడుగు ముందుకెళ్లి... చంద్రబాబు పాలనలో ఈ ఐదేళ్లు కష్టాలకు ఓర్చుకుంటే మళ్లీ మనదే అధికారం అని చెప్పుకొంటున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడి పది రోజులే అయింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగు రోజులు మాత్రమే అయింది. ఇంతలోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు కుప్పకూలిపోయినట్టుగా శోకాలు పెట్టడం ఆశ్చర్యంగా ఉంది. కొత్త ప్రభుత్వంపై విమర్శలు చేసేముందు అధికారంలో ఉన్న ఐదేళ్లలో తామేం చేశామో మరచిపోయారు. ఐదేళ్లపాటు కక్షపూరితంగా పాలన

> జగన్ పాలనలో కొంత మంది అధికారులు పూర్తిగా చెడిపోయారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు అటువంటి వారి పట్ల తన సహజ ధోరణికి భిన్నంగా వ్యవహరించారు. ఐఏఎస్, ఐపీఎస్ సర్వీసులకు కళంకంగా వ్యవహరించిన శ్రీలక్ష్మి, పీఎస్సార్ ఆంజనేయులు, పీవీ సునీల్ కుమార్, సంజయ్ వంటి అధికారుల పట్ల కఠినంగా వ్యవహరించారు. శ్రీలక్ష్మి పుష్పగుచ్ఛం ఇచ్చే ప్రయత్నం చేయగా దాన్ని తీసుకోవడానికి కూడా ఇష్టపడలేదు. చంద్రబాబు గత ప్రవర్తనకు ఇది పూర్తి భిన్నం. ఆర్థిక నేరాలలో నిందితుడుగా ఉన్న జగన్ వంటి వ్యక్తికి దాసోహం అవాల్సిన అవసరం ఏమిటో ఆయా అధికారులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. రూల్ ఆఫ్ లా అమలు చేయాల్సిన అధికారులు ఆటవిక పాలనకు తమవంతు సహకారం అందించడమే కాకుండా, అందులో భాగస్వాములయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని సంస్కరించడానికి చంద్రబాబు సహజంగానే ప్రయత్నిస్తారు.

సాగించిన జగన్మోహన్‌రెడ్డి... ఇప్పుడు తనను ఇబ్బందులపాలు చేయబోతున్నారని చెప్పుకోవడం దెయ్యాలు వేదాలు వల్లించడమే అవుతుంది. అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ ప్రత్యర్థులను ఎలా వేధించిందీ మరచిపోతే ఎలా? ప్రశ్నించిన వారిని, విమర్శించిన వారిని కేసులలో ఇరికించడం గుర్తులేదా? రాజ్యం వీరభోజ్యం అన్నట్టుగా చెలరేగిపోయిన వాళ్లు ఇప్పుడు ప్రజాస్వామ్యం ఎక్కడ అంటూ రోదించడం రోతగా ఉంది.

## వెంటాడి వేధించలేదా...

జగన్‌రెడ్డి పాలనలో కక్ష సాధింపు ఏ విధంగా ఉండిందో ఒక్కసారి గుర్తు చేసుకుందాం. 2014 నుంచి 2019 వరకు శాసనసభ స్పీకర్‌గా ఉన్న కోడెల శివప్రసాదరావు ఆత్మహత్య చేసుకోవడానికి జగన్ ప్రభుత్వ వేధింపులు కారణం కాదా? కోడెలతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కేసుల మీద కేసులు పెట్టి వేధించడం నిజం కాదా? పల్నాడు పులి అని పిలిపించుకున్న కోడెల ఈ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఈ పాపం జగన్ ప్రభుత్వానిది కాదా? ఆయన ఆత్మహత్య చేసుకున్నాక శాంతించిన ప్రభుత్వం సదరు కేసులను అటకెక్కించలేదా? స్పీకర్‌గా ఉన్నప్పుడు ప్రభుత్వం సరఫరా చేసిన ఫర్నిచర్ తిరిగి ఇవ్వలేదని కోడెలపై కేసు పెట్టిన విషయం మరిచారా? ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేయించిన ఫర్నిచర్ తిరిగి ఇచ్చారా? ఇప్పటికీ లేదే? కరోనా సమయంలో మాస్కులు సరఫరా చేయడం లేదని ప్రశ్నించినందుకు ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ సుధాకర్‌ను వేధించి ఆయన చావుకు కారణం కాలేదా? ఆయనను పిచ్చివాడిగా చిత్రించి నడిరోడ్డుపై పోలీసులతో కొట్టించలేదా? ఆయన అకాల మరణంతో జగన్ ప్రభుత్వం శాంతించింది. సీనియర్ సిటిజన్ రంగనాయకమ్మ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదో పోస్టు పెట్టిందని చెప్పి పోలీసులతో వేధించడంతో... అది తట్టుకోలేక ఆమె హైదరాబాద్‌కు వలస వెళ్లడం నిజం కాదా? పరువు ప్రతిష్ఠలతో బతికినవారిని, ఆత్మవిశ్వాసంతో ఎదురు నిలిచిన వారిని వేధించడమే పనిగా పెట్టుకోలేదా? రాష్ట్రంలో తన చానల్ ప్రసారాలు నిలిచిపోవడంపై జగన్‌రెడ్డి ఇప్పుడు శోకాలు పెడుతున్నారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే ఏబీఎన్‌తో పాటు మరో చానల్ ప్రసారాలను ఐదేళ్ల పాటు జగన్ అండ్ కో నిలిపివేయించలేదా? తప్పుడు విధానాలకు తెరతీసింది ఎవరు? ధర్మో రక్షతి రక్షితః అంటారు. మనం ధర్మబద్ధంగా వ్యవహరిస్తే, ఇతరులు కూడా మన పట్ల ధర్మబద్ధంగా వ్యవహరించాలని కోరవచ్చు. అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడిన వాళ్లు ఇప్పుడు అన్యాయం, అక్రమం అని శోకాలు పెట్టడమేమిటి? జగన్ నాయకత్వాన్ని ధిక్కరించి విమర్శలు చేసిన సొంత పార్టీ ఎంపీ రఘురామకృష్ణ రాజును పోలీసులు తీసుకెళ్లి అరికాళ్లపై అదేపనిగా కొట్టారు కదా? కస్టోడియల్ టార్చర్ నేరమని తెలిసి కూడా ఒక ఎంపీగా ఉన్న వ్యక్తిని చిత్రహింసలు పెట్టారంటే జగన్ పాలన ఎంత దారుణంగా ఉండిందో తెలియడం లేదా? రఘురాజును అరికాళ్లు పగిలేలా కొట్టడం తప్పని చెప్పకపోగా– 'అబ్బే ఆయనను ఎవరూ కొట్టలేదు. అరికాళ్లపై ఆయనకు సొరియాసిస్ ఉంది' అని జగన్ భజనపరులు దిక్కుమాలిన వాదన చేయడం నిజం కాదా? సీఐడీ విభాగాన్ని కిరాయి సైనిక మూకగా మార్చి తప్పుడు కేసులు పెట్టించడాన్ని జగన్‌రెడ్డి ఎలా సమర్థించుకుంటారు? తనకు వేధింపులు కొత్త కాదని, ఇకపై కూడా వేధింపులు, కష్టాలు ఎదురవుతాయని అంటూ ప్రజల సానుభూతి కోసం జగన్ ఇప్పుడు ప్రయత్నిస్తున్నారు. అయితే, ఇది నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా అన్న నానుడిని ఆయన మర్చిపోతున్నారు. నిండు శాసనసభలో ప్రతిపక్ష నేత చంద్రబాబు సతీమణిని అవమానించినప్పుడు... నాటి కౌరవ సభలో ద్రౌపదీ వస్త్రాపహరణం సందర్భంగా దుర్యోధనుడు వికటాట్టహాసం చేసినట్టుగా ఈనాటి సభలో జగన్ షికృటి చిరునవ్వులతో ఆనందించలేదా? విలువలు, విశ్వసనీయత అప్పుడు గుర్తుకు రాలేదా! కొంతమంది తన మంత్రులు, శాసనసభ్యులు ప్రతిపక్ష నేత చంద్రబాబు వయసుకు కూడా గౌరవం ఇవ్వకుండా బహిరంగంగా వాడూ వీడూ, చెత్త నా కొడుకు అని దూషించినప్పుడు ముఖ్యమంత్రిగా మౌనంగా ఉండిపోవడం ఏ నీతి? ఏ రీతి? వ్యక్తులను దారుణంగా కించపరచడమే కాకుండా ఇళ్లలోని ఆడవాళ్లను కూడా బజారుకీడ్చారు కదా? స్త్రీలను చెరబట్టడం మినహా మిగతా అన్ని రకాలుగా దురాగతాలకు పాల్పడ్డారు కదా? అయినా ఆ ఐదేళ్లలో హద్దుమీరిన అధికారులను, శాసన సభ్యులను, మంత్రులను జగన్‌రెడ్డి ఒక్కసారైనా మందలించడం చూశారా? లేదే? సదరు దుశ్చర్యలు ఆయనకు అమితానందాన్ని ఇచ్చాయి. జగన్ కళ్లలో ఆనందం చూడటం కోసం ఆయనకు గిట్టని వారిపై తన మనుషులు బూతులతో విరుచుకుపడిన విషయం మరిచారా? తనకు గిట్టని మీడియా సంస్థలను శాసనసభ కార్యక్రమాలు ప్రసారం చేయకుండా నిషేధించలేదా? ముఖ్యమంత్రి నివాసం పరిసరాలకు కూడా రానివ్వలేదే? ఆంధ్రజ్యోతి పత్రికకు, ఏబీఎన్ చానల్‌కు ఐదేళ్లపాటు న్యాయంగా ఇవ్వాల్సిన ప్రకటనల్లో ఒక్కటైనా ఇవ్వకపోవడం ఏ నీతి? ఇందుకే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయని అనాల్సి వస్తోంది. రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులను వెంటాడి వేధించడంలో ఏ విలువలు దాగి ఉన్నాయి? ఈ వర్గం ఆ వర్గం అన్న తేడా లేకుండా జగన్ పాలనలో ఇబ్బందికి గురికాని వర్గం అంటూ లేకుండా పోవడం నిజం కాదా? అందుకే కదా ప్రజలు కూడా కులం చూడబోము, మతం చూడబోమని జగన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు!

## ఇంకా ఆత్మవంచనే...

ఎన్నికల్లో ఓడిపోయిన సందర్భాలలో అధికారం కోల్పోయిన పార్టీలు ఆత్మ విమర్శ చేసుకోవడం సహజం. జగన్మోహన్‌రెడ్డి మాత్రం ఆత్మ విమర్శకు సిద్ధపడకపోగా పరనిందకు తెగబడుతున్నారు. ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ మళ్లీ ఎన్నికల నాటికి ప్రజాభిమానం చూరగొనడానికి ప్రయత్నిస్తుంది. జగన్ అండ్ కోలో ఈ ఛాయలు కూడా కనిపించడంలేదు. తప్పంతా ప్రజలదే అన్నట్టుగా ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. చెడు చేసి ఓడితే బాధపడాలి కానీ, మంచి చేసి ఓడితే బాధపడకూడదని వితండ వాదం చేస్తున్నారు. నిజంగా మంచి పాలనే ఇస్తే ప్రజలెందుకు ఓడిస్తారు? ఎమ్మెల్యేలు, ఎంపీలతో జరిపిన సమావేశాల్లో జగన్‌రెడ్డి ఉపన్యాసం విన్నాక ఆయన మారతారని భావించడం భ్రమే అవుతుంది. తన పాలనకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలూ ఎందుకు ఏకమయ్యారో గుర్తించి విరుగుడు చర్యలు చేపట్టకపోగా ఆత్మవంచన చేసుకుంటూ పొద్దుపుచ్చుతున్నారు. విచిత్రమేమిటంటే జగన్ రోత మీడియాతో పాటు కూలి మీడియా కూడా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి సాధించిన ఘన విజయాన్ని సాంకేతిక విజయం మాత్రమేనని, జగన్‌రెడ్డే అసలైన ప్రజా నాయకుడని, ప్రజల మద్దతు ఆయనకే ఉంటుందని ప్రచారం చేస్తూ ఆత్మవంచన చేసుకుంటున్నాయి. ఈవీఎం ట్యాంపరింగ్ వల్లే జగన్ ఓడిపోయారని గత పది రోజులుగా ప్రచారం చేస్తున్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యమని ఇదే జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల తర్వాత తేల్చి చెప్పడాన్ని వారు మరచిపోయారు. ఈవీఎంల ద్వారా ప్రజల తీర్పును తారుమారు చేయలేరని అనేక సందర్భాలలో ఎన్నికల కమిషన్ రుజువు చేసింది. చంద్రబాబు విజయానికి ప్రధాని నరేంద్ర మోదీ లేదా ఎన్నికల కమిషన్ పరోక్ష సహకారం ఉందని ప్రజలను నమ్మించే విఫలయత్నం చేస్తున్నారు. తాజా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 2019 మాదిరి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే మెజారిటీ లభించలేదు. ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యమయ్యే పక్షంలో చంద్రబాబు విజయానికి సహకరించిన మోదీ తన సొంత పార్టీకి మెజారిటీ సీట్లు సాధించుకోలేరా? కూలి మీడియా, రోత మీడియా ఈవీఎంలపై చేస్తున్న ప్రచారం చూస్తుంటే భర్తృహరి సుభాషితం గుర్తుకొస్తోంది. 'తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు. దవిలి మృగతృష్ణలో నీరు త్రాగవచ్చు. చేరి మూర్ఖుల మనసు రంజింప రాదు' అని భర్తృహరి చెప్పారు. ఎన్నికలకు ముందు కూడా కొంత మంది రాతగాళ్లు, కూతగాళ్లు ఇదే విధంగా జగన్‌రెడ్డిని తప్పు దారి పట్టించారు. ప్రభుత్వ పనితీరు అదరహో అని ప్రచారం చేస్తూ జగన్‌ను కూడా నమ్మించారు. ప్రజలంతా జగన్మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారని, 2019 కంటే ఎక్కువ శాతం ఓట్లు, సీట్లు వస్తాయని నమ్మబలికారు. సంక్షేమ పథకాల వల్ల పేదల జీవితాలు మారిపోయాయని, సామాజిక న్యాయం అద్భుతంగా జరిగిందని, దేశ చరిత్రలో ఏ నాయకుడు కూడా సాహసించని నిర్ణయాలను జగన్‌రెడ్డి తీసుకొన్నారని ఊదరగొట్టారు. పూర్వం రాజుల ఆస్థానంలో పొగడ్తల కోసం కొంత మంది ప్రత్యేకంగా ఉండేవారు. ఇప్పుడు జగన్‌రెడ్డి ఆస్థానంలో కూడా ఇలాంటి వారు చేరారు. వారి మాటలను నిజంగానే నమ్మిన జగన్‌రెడ్డి క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలుసుకొనే ప్రయత్నం చేయలేదు. భజనపరుల మాటలు నమ్మి నిండా మునిగిపోయారు. తన పాలనకు వ్యతిరేకంగా మెజారిటీ ప్రజలు కులమతాలకు అతీతంగా జట్టుకట్టిన విషయం గుర్తించలేకపోయారు. పేదలు, పెత్తందారులు అంటూ సమాజాన్ని విభజించే ప్రయత్నం చేసి బొక్కబోర్లా పడ్డారు. ప్రభువుల మనసు రంజింపజేసి లబ్ధిపొందడానికి ప్రయత్నించే వాళ్లు ఎప్పుడూ ఉంటారు. అయితే పాలకులు ఎవరైనాగానీ తమ హితం కోరేవారు ఎవరో, సమాజ హితం కోరేవారు ఎవరో గుర్తించి వారిని మాత్రమే చేరదీస్తే ఎన్నికల్లో ఘోర పరాభవం ఎదురవదు. అధికారంలో ఉన్నప్పుడు ఉన్మాద మూకను పెంచి పోషించినందుకు తగిన మూల్యం చెల్లించుకున్న జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకొని వాస్తవిక దృక్పథంతో ఆలోచించడం నేర్చుకోవాలి. విలువలు, విశ్వసనీయత వంటి పదాలు జగన్ నోటికి సరిపడవుగానీ, ప్రజలు నమ్మే మాటలు చెప్పడం మంచిది. తల్లినీ చెల్లిని కూడా విసిరికొట్టిన జగన్మోహన్‌రెడ్డిలో అనుబంధాలు, ఆత్మీయతలు ఉంటాయనుకోవడం భ్రమ అవుతుంది.

> ఈ ప్రభుత్వం మాది అని అన్ని వర్గాల ప్రజలూ భావించాలి. 2019లో తాము ఎందుకు ఓడిపోయిందీ, 2024 ఎన్నికల్లో జగన్ ఎందుకు ఓడిపోయిందీ లోతుగా విశ్లేషించుకొని అందుకు తగ్గట్టుగా కార్యాచరణ రూపొందించుకొని తదనుగుణంగా చంద్రబాబు పాలన సాగాలి.




> అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడిన వాళ్లు ఇప్పుడు అన్యాయం, అక్రమం అని శోకాలు పెట్టడమేమిటి? జగన్ నాయకత్వాన్ని ధిక్కరించి విమర్శలు చేసిన సొంత పార్టీ ఎంపీ రఘురామకృష్ణ రాజును పోలీసులు తీసుకెళ్లి అరికాళ్లపై అదేపనిగా కొట్టారు కదా? కస్టోడియల్ టార్చర్ నేరమని తెలిసి కూడా ఒక ఎంపీగా ఉన్న వ్యక్తిని చిత్రహింసలు పెట్టారంటే జగన్ పాలన ఎంత దారుణంగా ఉండిందో తెలియడం లేదా? నిండు శాసనసభలో ప్రతిపక్ష నేత చంద్రబాబు సతీమణిని అవమానించినప్పుడు... నాటి కౌరవ సభలో ద్రౌపదీ వస్త్రాపహరణం సందర్భంగా దుర్యోధనుడు వికటాట్టహాసం చేసినట్టుగా ఈనాటి సభలో జగన్ షిక్కటి చిరునవ్వులతో ఆనందించలేదా? విలువలు, విశ్వసనీయత అప్పుడు గుర్తుకు రాలేదా! కొంతమంది తన మంత్రులు, శాసనసభ్యులు ప్రతిపక్ష నేత చంద్రబాబు వయసుకు కూడా గౌరవం ఇవ్వకుండా బహిరంగంగా వాడూ వీడూ, చెత్త నా కొడుకు అని దూషించినప్పుడు ముఖ్యమంత్రిగా మౌనంగా ఉండిపోవడం ఏ నీతి? ఏ రీతి?

## బటన్లు నొక్కితే చాలదు...

గతంలో తన పాలనను రాజారెడ్డి రాజ్యాంగం అన్నారని, ఇప్పుడు కొత్త ప్రభుత్వాన్ని రెడ్ బుక్ రాజ్యాంగమని నిందించడం... తొందరపడి కోయిల ముందే కూసింది అన్నట్టుగా ఉంది. అయినా అధికారులను, రాజకీయ ప్రత్యర్థులను ఎన్ని విధాలుగా వేధించవచ్చో చేసి చూపించిన జగన్మోహన్‌రెడ్డిని మించిన దురాగతాలను మరెవరూ చేయలేరు. ఆత్మస్తుతి, పరనింద వల్ల ప్రయోజనం లేదు. ప్రజలకు తానేమీ చెడు చేయలేదని చెప్పుకోవడం ఆత్మవంచనే అవుతుంది. ముఖ్యమంత్రి పనేమిటి? మనం చేసిందేమిటి? అన్న విషయంలో ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. బటన్లు నొక్కడం మాత్రమే ముఖ్యమంత్రి పని కాదు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి గురించి కూడా ఆలోచించాలి. అభివృద్ధి – సంక్షేమం మధ్య సమతుల్యత ఉండాలని జగన్ గుర్తించాలి. ఈవీఎంలలో ఏదో జరిగిపోయిందని చెప్పే వాదనకు తెగబడేవారు జగన్ ఏయే విషయాలలో మారాలో సూచిస్తే ఆయనకు నిజమైన శ్రేయోభిలాషులుగా మిగులుతారు. విష ప్రచారం, దుష్ప్రచారం అన్ని వేళలా పని చేయవని కూడా జగన్ అండ్ కో తెలుసుకోవాలి. ఎన్నికల ఫలితాల అనంతరం జరిగిన స్వల్ప సంఘటనలను భూతద్దంలో చూపినంత మాత్రాన ప్రయోజనం ఉండదు. నిన్నటి వరకు మీ పాలనలో జరిగిన దురాగతాలను ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు. తనకంటే దరిద్రంగా చంద్రబాబు పాలన ఉంటే తప్ప జగన్మోహన్‌రెడ్డికి ఐదేళ్ల తర్వాత అధికారం వచ్చి ఒడిలో వాలదు.

## కొత్త సర్కారుకు సవాళ్లు

చంద్రబాబు నేతృత్వంలో కొలువుదీరిన ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. జగన్ పాలనలో వ్యవస్థలన్నీ ఛిన్నాభిన్నం అయ్యాయి. అఖిల భారత సర్వీసు అధికారుల వెన్ను విరిచి బానిసలుగా మార్చుకున్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల అమలు భారం అదనం కాబోతోంది. ఇచ్చిన మాట ప్రకారం వృద్ధుల పింఛన్‌ను మూడు వేల నుంచి నాలుగు వేలకు పెంచారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం ముందుగా ఆదాయం పెంచుకోవడంపై దృష్టి సారించాలి. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారం ఉండే అవకాశం ఉన్నందున పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలను ముమ్మరం చేయాలి. పెట్టుబడులు వచ్చినంత మాత్రాన ఇప్పటికిప్పుడు ఆదాయం పెరగదు. ఇచ్చిన హామీల అమలు కోసం మరిన్ని అప్పులు చేయవలసి రావొచ్చు. తాజా ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి సొంతంగానే కావాల్సినంత మెజారిటీ లభించినప్పటికీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. సంకీర్ణ ప్రభుత్వం అన్నాక ఒడిదుడుకులు, అప్పుడప్పుడూ అభిప్రాయ బేధాలు ఏర్పడటం సహజం. ఎన్నికల్లో ఓడిపోయిన జగన్మోహన్‌రెడ్డికి వంచనతో కూడిన కపట రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్య. చంద్రబాబుకు రాజకీయాల్లో అపార అనుభవం ఉండటమే కాకుండా భూమాతకు ఉన్నంత సహనం, ఓర్పు ఉంటుంది. అయినా... తెలుగుదేశం–జనసేన పార్టీల మధ్య విభేదాలు సృష్టించడానికి జగన్ అండ్ కో సహజంగానే ప్రయత్నిస్తుంది. జనసేనాని పవన్ కల్యాణ్ ఇప్పటి వరకు అసాధారణ పరిణతి ప్రదర్శించారు. సీట్ల సర్దుబాటు సమయంలోనూ, మంత్రి పదవుల విషయంలోగానీ ఆయన మంకు పట్టుకు పోలేదు. జగన్‌రెడ్డి విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీతో పొత్తు ఏర్పడకుండా చెడగొట్టడానికి ఎవరెంత ప్రయత్నించినా ఖాతరు చేయలేదు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికే కాకుండా, వ్యక్తిగతంగా తనకు జరిగే నష్టాన్ని గుర్తించి అందుకు తగ్గట్టుగానే మెలిగారు. ఉప ముఖ్యమంత్రిగా కూడా ఆయనపై ఇప్పుడు బాధ్యత పెరిగింది. తెలుగుదేశం – జనసేన మైత్రిని చెడగొట్టడానికి జరిగే ప్రయత్నాలు సఫలం కాకూడదంటే... విభేదాలు ఏర్పడితే వాటి



యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

పరిష్కారానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. చంద్రబాబుకు అపార పాలనానుభవం ఉంది. అంతేకాదు, ప్రతిపక్షానికి 11 సీట్లు మాత్రమే వచ్చినందున ప్రభుత్వ సుస్థిరతకు ఎలాంటి ఇబ్బందీ లేదు. జగన్ పాలనలో కొంత మంది అధికారులు పూర్తిగా చెడిపోయారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు అటువంటి వారి పట్ల తన సహజ ధోరణికి భిన్నంగా వ్యవహరించారు. ఐఏఎస్, ఐపీఎస్ సర్వీసులకు కళంకంగా వ్యవహరించిన శ్రీలక్ష్మి, పీఎస్సార్ ఆంజనేయులు, పీవీ సునీల్ కుమార్, సంజయ్ వంటి అధికారుల పట్ల కఠినంగా వ్యవహరించారు. శ్రీలక్ష్మి పుష్పగుచ్ఛం ఇచ్చే ప్రయత్నం చేయగా దాన్ని తీసుకోవడానికి కూడా ఇష్టపడలేదు. చంద్రబాబు గత ప్రవర్తనకు ఇది పూర్తి భిన్నం. తాము ఏ పరిస్థితుల్లో, ఎవరి ఒత్తిడి వల్ల గత ప్రభుత్వానికి ఊడిగం చేయవలసి వచ్చిందో వివరించడానికి ఆయా అధికారులు సిద్ధపడుతున్నారు. ఆర్థిక నేరాలలో నిందితుడుగా ఉన్న జగన్ వంటి వ్యక్తికి దాసోహం అవాల్సిన అవసరం ఏమిటో ఆయా అధికారులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. రూల్ ఆఫ్ లా అమలు చేయాల్సిన అధికారులు ఆటవిక పాలనకు తమవంతు సహకారం అందించడమే కాకుండా, అందులో భాగస్వాములయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని సంస్కరించడానికి చంద్రబాబు సహజంగానే ప్రయత్నిస్తారు. అయితే absolute power corrupts absolutely అన్నట్టు కనీవినీ ఎరుగని మెజారిటీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వ పోకడలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. జగన్మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో ఇంత ఘోర పరాభవం ఎందుకు ఎదురైందో ముందుగా కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర నాయకులు గుర్తించి అందుకు తగ్గట్టుగా మెలగాలి. అధికారం అందింది కదా అని గత ప్రభుత్వంలో మాదిరి చట్టవిరుద్ధంగా దోపిడీ దౌర్జన్యాలకు పాల్పడితే వాతలు పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారు. పాలన పట్ల సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసినప్పుడే అది గుడ్ గవర్నెన్స్ అవుతుంది. అంతే కానీ అధికారాలు లేని పదవులు ఆయా వర్గాలకు కేటాయించి సామాజిక సమతుల్యత పాటించామని గొప్పలు చెప్పుకొంటే జగన్‌కు ఏమి జరిగిందో చూశారుగా! ఈ ప్రభుత్వం మాది అని అన్ని వర్గాల ప్రజలూ భావించాలి. 2019లో తాము ఎందుకు ఓడిపోయిందీ, 2024 ఎన్నికల్లో జగన్ ఎందుకు ఓడిపోయిందీ లోతుగా విశ్లేషించుకొని అందుకు తగ్గట్టుగా కార్యాచరణ రూపొందించుకొని తదనుగుణంగా చంద్రబాబు పాలన సాగాలి. ప్రజలు గంపెడాశతో తమను అందలం ఎక్కించారని చంద్రబాబు అండ్ కో గుర్తించాలి. ఎన్నికల్లో జగన్‌కు ఎదురైన పరాభవం ఒక హెచ్చరికగా చంద్రబాబు ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలి. అధికార కూటమి నాయకులు ప్రతిరోజూ పొద్దున్నే లేవగానే జగన్ ఎలా, ఎందుకు ఓడిపోయారో గుర్తుకు తెచ్చుకోవాలి. రాజ్యసభలో మాకు బలం ఉందని జగన్ అండ్ కో గొప్పలు చెప్పుకొంటున్నారుగానీ తలపై బండెడు కేసుల భారం మోస్తున్న జగన్మోహన్‌రెడ్డి కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ధిక్కరించే సాహసం చేయడం అసంభవం. అన్నింటినీ మించిన జోక్ ఏమిటంటే... ఐదేళ్లుగా విభజన హామీలు, ప్రత్యేక హోదా గురించి మాట మాత్రంగానైనా కేంద్రం వద్ద ప్రస్తావించని జగన్‌రెడ్డి ఇప్పుడు చంద్రబాబు ప్రత్యేక హోదా కోరకపోవడం మహా పాపం అని నిందిస్తున్నారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లయ్యాక ఇప్పుడు ప్రత్యేక హోదా, విభజన హామీలకు ప్రాధాన్యత ఉంటుందా? రాజకీయం కోసం జగన్ అండ్ కో చేసే విమర్శలను ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోకుండా ముందుకు సాగి ప్రజలను సంతృప్తిపరచే విధంగా పాలిస్తారని ఆశిద్దాం!

> ప్రజలకు తానేమీ చెడు చేయలేదని జగన్ చెప్పుకోవడం ఆత్మవంచనే అవుతుంది. ముఖ్యమంత్రి పనేమిటి? మనం చేసిందేమిటి? అన్న విషయంలో ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. బటన్లు నొక్కడం మాత్రమే ముఖ్యమంత్రి పనికాదు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి గురించి కూడా ఆలోచించాలి. అభివృద్ధి – సంక్షేమం మధ్య సమతుల్యత ఉండాలని జగన్ గుర్తించాలి. ఈవీఎంలలో ఏదో జరిగిపోయిందని చెప్పే వాదనకు తెగబడేవారు జగన్ ఏయే విషయాలలో మారాలో సూచిస్తే ఆయనకు నిజమైన శ్రేయోభిలాషులుగా మిగులుతారు. విష ప్రచారం, దుష్ప్రచారం అన్ని వేళలా పని చేయవని కూడా జగన్ అండ్ కో తెలుసుకోవాలి. ఎన్నికల ఫలితాల అనంతరం జరిగిన స్వల్ప సంఘటనలను భూతద్దంలో చూపినంత మాత్రానా ప్రయోజనం ఉండదు. నిన్నటి వరకు మీ పాలనలో జరిగిన దురాగతాలను ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు. తనకంటే దరిద్రంగా చంద్రబాబు పాలన ఉంటే తప్ప జగన్మోహన్‌రెడ్డికి ఐదేళ్ల తర్వాత అధికారం వచ్చి ఒడిలో వాలదు.

---

# వంద వత్సరాల 'పరిణయ రహస్యము'


మహాకవి శ్రీశ్రీ ముద్రిత రచనల్లో లభిస్తున్న వాటిల్లో మొదటిది 'పరిణయ రహస్యము' అనే నవలిక. ఇది 1924లో ముద్రితమైంది. అంటే నూరు సంవత్సరాలు అవుతున్నది. 1910 ఏప్రిల్, 30న జన్మించిన శ్రీశ్రీకి ఈ రచన నాటికి కేవలం పద్నాలుగు సంవత్సరాలు మాత్రమే. సుమారు తొమ్మిదేళ్ళ ప్రాయానికే ఆయన కందం లాంటి పద్య రచన చేశాడు. ఆ తర్వాత 'దివ్య లోచనములు' శీర్షికతో రాసిన పద్యాలు పురిపండా అప్పలస్వామి సంపాదకత్వంలో వెలువడుతున్న 'స్వశక్తి' పత్రికలో ముద్రితమయ్యాయి. అచ్చులో ఇదే శ్రీశ్రీ తొలి రచన. కవిత్వంతో పాటు వచన రచనలూ విరివిగానే చదువుతున్న ("... ఎక్కువగా వచనం, ముఖ్యంగా డిటెక్టివ్ నవలలు చదువుతుండే నాకు..." పుట–35, అనంతం) వాటిలో నవలలు, అందునా డిటెక్టివ్ నవలలూ బాగా చదువుతున్న ప్రభావంతో 'గోకులాయి' డిటెక్టివ్ నవల, వీరసింహ విజయసింహులు అనే దేశభక్తి పూర్వక నవలా రాశాడు శ్రీశ్రీ. ఇవన్నీ ప్రస్తుతం అలభ్యం. సుమారు అదే సమయంలో 'పరిణయ రహస్యం' అనే డిటెక్టివ్ నవల రచించాడు. "పెళ్ళికి ఒకటి, రెండు నెలల క్రిందట నా మొదటి నవలిక పరిణయ రహస్యము అచ్చువేయించాను మా నాన్న డబ్బివ్వగా" (పుట–46, అనంతం) అని చెప్పుకున్నా దీన్ని 1924లో విశాఖపట్టణంలోని ఆంధ్ర సంజీవినీ గ్రంథమాల ప్రచురించింది.

ఈ పుస్తకం గురించి శ్రీశ్రీ తన జీవిత చరిత్రను 1975లో రాస్తూ "... నా పరిణయ రహస్యము (అపరాధ పరిశోధక నవలిక) ఇప్పుడెక్కడా దొరకదు. దీనికోసం ఎందరో మిత్రులు గాలిస్తున్నారు. దొరుకుతుందనే ఆశలేదు" (పుట–250, అనంతం) అని తెలిపారు. శ్రీశ్రీ మరణానంతరం 1991లో ఇది లభించింది. ఇందులోని మొదటి ప్రకరణం 'తూర్పుసీమ' అనే మాసపత్రిక జూలై 1991 సంచికలో ముద్రించారు. దీని గురించి "... అదృష్టవశాత్తు ఇటీవల శిథిలావస్థలో ఒకచోట బయటపడింది. ఆ పుస్తకంలోని కొన్ని పుటలు తూర్పుసీమ పత్రికా ముఖంగా తెలుగు పాఠకుల ముందుంచగల్గుతున్నాము" (పుట–5) అని దాని సంపాదకులు మండా సూర్యనారాయణ (మసూనా) వివరించారు. 1994 ఏప్రిల్ 10, 17, 24 తేదీల్లో ఈ నవలను ఆంధ్రజ్యోతి దినపత్రికలో ముద్రించారు. దీనిని డిసెంబర్, 2009లో 'శ్రీశ్రీ సాహిత్య నిధి' వారు సింగంపల్లి అశోక్‌కుమార్ కూర్పరిగా ప్రత్యేక పుస్తకంగా తీసుకొచ్చారు. శ్రీశ్రీ శతజయంతి సంవత్సరమైన 2010, ఏప్రిల్ 30న 'మనసు ఫౌండేషన్' వారు శ్రీశ్రీ లభ్య రచనలన్నింటినీ చలసాని ప్రసాద్, ఎం.వి. రాయుడు కూర్పరులుగా మూడు సంపుటాలుగా తెచ్చిన వాటిల్లో రెండవ సంపుటిలో ఈ 'పరిణయ రహస్యము' ముద్రితమైంది. ఈ నవలలో ఉన్న విషయం, భాష మొదలైనవి చూద్దాం.

ఈ నవలికలో పది ప్రకరణాలున్నాయి. వాటికి పరిణయ ప్రసంగము, పరిణయ నిశ్చయము, పరిణయ భంగము, రాజమహేంద్రవర ప్రయాణము, ఆలోచనము, కామేశ్వరరావు, రహస్య ప్రకాశనము, సంభాషణము, స్వర్ణాభరణము, నిరూపణము అనే పేర్లు క్రమంగా ఉన్నాయి. ఇవి ఆయా ప్రకరణాల ప్రధాన ఇతివృత్తాన్ని సూచించే విధంగా రచయిత పెట్టాడు. ఇందులో నారాయణ రావు, కృష్ణారావు, రాఘవయ్య, బంగారమ్మ (పద్మనాభరావు), రాఘవయ్య భార్య, పేద వాడు, రామమోహనరావు, కామేశ్వరరావు, కాంతమ్మ, పురోహితులు, పెళ్ళికి వచ్చిన బంధు, మిత్ర పరివారము, దత్తు, ఆనందరావు, పోలీసులు ఇత్యాది పాత్రలు ఉన్నాయి. ఈ కథ విశాఖపట్టణము, సింహాచల క్షేత్రం, రాజమహేంద్రవరము, నరసీ పట్టణము, కోర్టు, పోలీసు స్టేషన్, రైల్వే స్టేషన్, బస్‌స్టాండ్ మొదలైన చోట్ల సాగుతుంది.

> లోకంలో అమ్మాయిలకు వరుణ్ణి వెదకడం సర్వసాధారణం అనే విషయం ఈ నవలిక రచయిత శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) పద్నాలుగేళ్ళ ప్రాయానికే గుర్తించడం గమనిస్తాం. లోకంలో అమ్మాయి పక్షం వాళ్ళు వరుణ్ణి వెదకడం ఆచారం. కానీ దానికి భిన్నంగా అబ్బాయివాళ్ళే వధువును వెదకడం చూస్తాం. ఇందులోని కథను మలుపు తిప్పిన తీరును గమనిస్తే పద్నాలుగేళ్ళకే చేయితిరిగిన రచయితలా కనిపిస్తాడు శ్రీశ్రీ.






కథాపరంగా చూస్తే– నారాయణరావు అనే బ్రాహ్మణ న్యాయవాది విశాఖలో ఉంటాడు. ఇతని ఒక్కగానొక్క సంతానం కృష్ణారావు. ఈతని పెళ్ళికై అమ్మాయిలను వెదకడం మొదలెడతాడు తండ్రి. రాఘవయ్య అనే అతను తన ఏకైక కూతురు బంగారమ్మ చదువులోను, రూపంలోనూ మీకు సరిపోయే విధంగా ఉంటుందని చెప్పి వారికి ఫోటోను ఇచ్చి వెళతాడు. ఈ అమ్మాయి కృష్ణారావుకు నచ్చుతుంది. అమ్మాయి తండ్రి మంచి ముహూర్తాల గురించి చెబుతాడు. అబ్బాయి వాళ్ళు పెళ్ళి స్థలమైన సింహాచలంకు ఒక రోజు ముందే చేరుకుని విడిదిలో బసచేసి, పెళ్ళి రోజు తెల్లవారుఝామునే నిద్రలేచి చూస్తే అమ్మాయి వాళ్ళెవరూ కనిపించరు. పెళ్ళిలో అమ్మాయికి పెట్టాల్సిన నగల పెట్టె అగుపించక దుఃఖిస్తుంటే... బంధువులు ఓదార్చి, విశాఖపట్టణంలోని అపరాధ పరిశోధకుడు రామమోహనరావును కలిస్తే సమస్య పరిష్కారమవుతుందని చెబుతారు. దాంతో విశాఖకు వెళ్ళి జరిగినదంతా రామమోహనరావుకు చెప్పాక, నేర పరిశోధనకు అంగీకరించిన ఆయన, తాను రేపు రాజమండ్రిలో ఓ పెళ్ళికి వెళ్లొచ్చాక మొదలెడతానంటాడు. అక్కడే తనకు కోర్టు పని ఉన్నందున తాను కూడా వస్తానని నారాయణరావు అంటాడు. రాజమహేంద్రవరంలో కామేశ్వరరావు పరమ ధార్మికుడైన ధనిక బ్రాహ్మణుడు. ఇతనికి పద్మనాభరావు, కాంతమ్మ అనే ఇద్దరు పిల్లలు. కామేశ్వరరావు భార్య మరణించినందువల్ల ఒక వంటల వాడిని పెట్టుకుంటాడు. ఈ వంటలవాడు యజమాని కొడుకు పద్మనాభరావును అపహరిస్తాడు. కొడుకు జాడ ఎంత వెదికినా అతనికి దొరకదు. తన కూతురు కాంతమ్మ పెళ్ళికి పూనుకుంటాడు కామేశ్వరరావు. ఈ పెళ్ళికే రామమోహనరావు, నారాయణరావు వస్తున్నారు. అంతలో ఒక పేదవాడు వచ్చి కామేశ్వరరావును కలిసి దొరికిన అతని కొడుకు (పద్మనాభరావు) గురించి చెప్పి, తనకు వెయ్యి రూపాయలిస్తే అతన్ని అప్పచెబుతానంటాడు. అప్పుడే అక్కడికి వచ్చిన రామమోహనరావుకు, అపహరించబడిన కామేశ్వరరావు అబ్బాయి పద్మనాభరావే స్త్రీ వేషంలో ఉండి పారిపోయిన పెళ్ళికూతురు బంగారమ్మ అనే విషయం అర్థమై, పోలీసులకు అప్పజెప్పుతాడు. మోసం బయటపడుతుంది. ఈ మోసగాళ్ళు నరసీ పట్టణంలో ఉన్న తమ మిత్రుడు ఆనందరావు దగ్గర ఉన్న నగలను అమ్ముదామనుకున్న సంగతిని రామమోహనరావు, నారాయణరావులు పసిగడతారు. వారు ఆనందరావును పట్టుకోవడానికి నరసీపట్నం చేరుకొని మారువేషంలో తిరుగుతుండగా, నగలు అమ్ముతున్న ఓ వ్యక్తి (ఆనందరావు) తారసపడడంతో తాము కొంటామని చెప్పి... ఇంకా నగలను చూపించమంటారు. అతడు తన ఇంటికి తీసుకెళ్ళి నగలన్నీ చూపించగానే... అవన్నీ తమవే అని నారాయణరావు చెప్పడంతో, ఆనందరావును బంధించి పోలీసులకు అప్పచెబుతాడు రామమోహనరావు. ఆ తర్వాత దొరికిన రాఘవయ్యను కూడా పోలీసులు విశాఖకు తరలిస్తారు. మోసం చేసిన వారికి శిక్ష పడుతుంది. పోయిన నగలు, డబ్బు దొరుకుతాయి. అనంతరం కృష్ణారావు పెళ్ళి జరిగి కథ సుఖాంతమవుతుంది. ఇదీ ఇందులోని ఇతివృత్తం.

లోకంలో అమ్మాయిలకు వరుణ్ణి వెదకడం సర్వసాధారణం అనే విషయం ఈ నవలిక రచయిత శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) పద్నాలుగేళ్ళ ప్రాయానికే గుర్తించడం గమనిస్తాం. లోకంలో అమ్మాయి పక్షం వాళ్ళు వరుణ్ణి వెదకడం ఆచారం. కానీ దానికి భిన్నంగా అబ్బాయివాళ్ళే వధువును వెదకడం చూస్తాం. ఇందులోని కథను మలుపు తిప్పిన తీరును గమనిస్తే పద్నాలుగేళ్ళకే చేయితిరిగిన రచయితలా కనిపిస్తాడు శ్రీశ్రీ.

ఈ పుస్తకంలో లేఖనానికి సంబంధించి వలపల గిలక ప్రయోగింపబడింది. 'వో' అనే అక్షరాన్ని మరో రకంగా ముద్రించారు. ఇలా నేటి ముద్రణకు, లేఖనానికి భిన్నమైన పూర్వరూపాలు గమనిస్తాం. ఇందులో **"అంతట నప్పురుషుడు తన పేరు రాఘవయ్య యనియు, దానాతని దూరపు బంధువుడననియు, వరుసకు బావ నగుదుననియు దన్నెఱింగించుకొని తన నివాస స్థలము చీపురుపల్లి యని వచించెను"** (పుటలు–2, 3, ఆంధ్ర సంజీవనీ గ్రంథమాల ప్రచురించిన పరిణయ రహస్యము) అనే రీతిగా గ్రాంథిక ప్రయోగమే ఎక్కువగా ఉంటుంది. పద్నాలుగేళ్ళ ప్రాయానికే 'పరిణయ రహస్యము' నవలికను ఎంతో పరిణతితో రచించాడు శ్రీశ్రీ.

■ డా. రాపోలు సుదర్శన్
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అరసం

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.4 కనిష్ఠం 25.1





ఆనందంలో కేడెట్లు



ఎయిర్‌క్రాఫ్ట్ విన్యాసాలు

## ఘనంగా వాయుసేన గ్రాడ్యుయేషన్ డే

దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శనివారం నిర్వహించిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ ఘనంగా జరిగింది. 6 నెలల కఠోర శిక్షణ పూర్తిచేసుకున్న ఫ్లయింగ్, గ్రౌండ్‌డ్యూటీ, అడ్మినిస్ట్రేషన్ విభాగాలలోని 235 మంది ఫ్లైట్ కేడెట్స్ ప్రెసిడెంట్స్ కమిషన్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాయుసేన విన్యాసాలు, ఎయిర్ వారియల్ డ్రిల్ ఆకట్టుకున్నాయి.

దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్



చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ స్వోర్డ్‌ను అందుకుంటున్న ఫ్లయింగ్ ఆఫీసర్ హ్యాపిసింగ్



కెడెట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న భారతవాయుసేనాధిపతి వివేక్‌రామ్ చౌదరి

# ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

- భారత వాయుసేనాధిపతి వివేక్‌రామ్ చౌదరి
- గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో కేడెట్స్‌కు ప్రెసిడెంట్స్ కమిషన్ ప్రదానం

అల్వాల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని దేశానికి సమర్థవంతంగా సేవలందించాలని భారత వాయు సేనాధిపతి వివేక్‌రామ్ చౌదరి కోరారు. సంక్లిష్టమైన రాడార్ నెట్‌వర్క్‌లు, అధునాతన సైబర్ టెక్నాలజీ పెరుగుతున్న కారణంగా ఇకపై యుద్ధాలు భౌతిక రూపంలో ఉండబోవని పేర్కొన్నారు. శనివారం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లోని ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మొత్తం 235 మంది ఫ్లైట్ కేడెట్స్ శిక్షణ ముగించారు. గ్రాడ్యుయేషన్ పొందిన అధికారుల్లో 22 మంది మహిళా అధికారులను భారత వాయుసేనలోని వివిధ శాఖల్లో నియమించారు. వీరితోపాటు ఇండియన్ నేవీ నుంచి 9 మంది అధికారులు, ఇండియన్ కోస్ట్‌గార్డ్ నుంచి 9మంది అధికారులు, వియత్నాం పీపుల్స్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన అధికారి ఫ్లయింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. పరేడ్ సమీక్ష అధికారిగా భారతవాయుసేనాధిపతి వివేక్‌రామ్ చౌదరి కేడెట్స్‌కు ప్రెసిడెంట్స్ కమిషన్‌ను ప్రదానం చేశారు. ఫ్లయింగ్ బ్రాంచ్‌కు చెందిన అధికారి హ్యాపీసింగ్ పైలట్ కోర్సులో అన్నివిభాగాల్లో మెరిట్ సాధించి ప్రసిడెంట్ ఫ్లాగ్‌ను, చీఫ్ ఆఫ్ ఎయిర్‌స్టాఫ్ స్వోర్డ్(కరవాలం) అందుకున్నారు. గ్రౌండ్ డ్యూటీ బ్రాంచ్‌లో మొదటి స్థానంలో నిలిచిన ఫ్లయింగ్ అధికారి తౌఫిక్‌రాజాను ప్రెసిడెంట్స్ కమిషన్‌తో

మిగతా 8వ పేజీలో..

# 20 నిమిషాల ప్రయాణానికి.. 1:10 గంటలు

- నగరంలో ట్రాఫిక్ నరకం
- వాహనదారుల ఆక్రోశం



మాసబ్‌ట్యాంక్‌లో ట్రాఫిక్‌జామ్

హైదరాబాద్ సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం పలుప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు రోడ్డుపై నరకయాతన అనుభవించారు. ముఖ్యంగా వెస్టుజోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. రాత్రి 7 నుంచి తొమ్మిది గంటల వరకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కేవలం 20 నిమిషాల ప్రయాణానికి గంట పదినిమిషాలు పట్టిందంటే రోడ్లపై ట్రాఫిక్ జామ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. బక్రీద్ పండుగ ఏర్పాట్ల నేపథ్యంలో ముస్లింల షాపింగ్, పాతబస్తీలోని పలుప్రాంతాలతో పాటు.. మలక్‌పేట, చాదర్‌ఘాట్, ఎంజే మార్కెట్, నాంపల్లి, ఖైరతాబాద్, పంజాగుట్టతో పాటు.. సికింద్రాబాద్, బేగంపేట తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. అంతే కాకుండా వెస్టుజోన్, నార్త్ జోన్‌లలో సైతం భారీ ట్రాఫిక్‌జామ్ ఏర్పడటంతో వాహనదారులు నరకం చూశారు. ట్రాఫిక్ పోలీసుల ప్లానింగ్ లోపం, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యమే అందుకు కారణమని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

### సీఎం రాక సందర్భంగా..

బంజారాహిల్స్ రోడ్‌నంబర్-12లో ఉన్న తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఇతర మంత్రులు, సీఎస్ శాంతికుమారి తదితరులు సందర్శించారు. వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు.. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ నేపథ్యంలో ప్రొటోకాల్‌లో భాగంగా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను నిలిపివేయడం కూడా ట్రాఫిక్ జామ్‌కు కారణమని తెలుస్తోంది.

### బీఎండబ్ల్యూ కారులో మంటలు

#### తీవ్ర ట్రాఫిక్‌జామ్

బంజారాహిల్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో శనివారం సాయంత్రం బీఎండబ్ల్యూ కారులో మంటలు చెలరేగాయి. దీంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఫిలింనగర్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు45 వైపు వెళుతున్న బీఎండబ్ల్యూ (టీఎస్09ఎఫ్ఎఫ్1880) కారులో నుంచి అకస్మాత్తుగా పొగలు వ్యాపించాయి. కారులో ఉన్న వారు వాహనం దిగే లోపు మంటలు వ్యాపించాయి. మిగతా వాహనాల చోదకులు భయంతో పరుగులు తీశారు. ఫిలింనగర్ అగ్నిమాపక శకటం మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. కారు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనతో జూబ్లీహిల్స్‌లో తీవ్ర ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది.



## ప్రాణాలు తీసిన అతివేగం

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



సోను



ఉదయ్‌కుమార్

కూకట్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న డీసీఎంను అతివేగంగా వచ్చిన స్కూటీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన కూకట్‌పల్లిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ సురారం సమీపంలోని భవానీనగర్‌కు చెందిన ఉదయ్‌కుమార్(18), సాయిబాబానగర్‌కు చెందిన సోను(20), మల్లారెడ్డి నగర్‌కు చెందిన షఫీ(17) ముగ్గురు స్నేహితులు. వీరు శుక్రవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో స్కూటీపై కూకట్‌పల్లికి వచ్చారు. కేపీహెచ్‌బీకాలనీ వైపు అతివేగంగా వెళ్తుండగా కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోకి రాగానే స్కూటీ అదుపుతప్పి రహదారి పక్కన ఆగి ఉన్న డీసీఎం(హెచ్‌ఆర్38ఏఎఫ్6203)ను వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న ఉదయ్‌కుమార్‌తోపాటు సోను, షఫీ కింద పడిపోయారు. తీవ్రగాయాలైన ఉదయ్‌కుమార్, సోను అక్కడికక్కడే మృతి చెందగా.. షఫీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ర్యాష్ డ్రైవింగ్ చేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



'డయల్ యువర్ ఎండీ'లో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

## కలుషిత నీళ్లొస్తున్నాయ్..

### 'డయల్ యువర్ ఎండీ'లో ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, జూన్15 (ఆంధ్రజ్యోతి): 'హలో.. నమస్కారం సార్.. మాకు నీళ్లు మంచిగా వస్తలేవు. అంతా మురుగుతో వస్తున్నాయి. నీళ్లు పట్టుకోలేకపోతున్నాం. చాలా ఇబ్బంది ఉన్నది.' అని ఓ వినియోగదారుడు వాటర్‌బోర్డు 'డయల్ యువర్ ఎండీ'లో ఫిర్యాదు చేశారు. కలుషిత నీళ్లొస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో నాలుగేళ్ల తర్వాత డయల్ యువర్ ఎండీ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 4గంటలకు సుదర్శన్‌రెడ్డి పునఃప్రారంభించారు. వినియోగదారుల నుంచి నేరుగా ఫోన్ కాల్స్ స్వీకరించి వారి సమస్యల్ని తెలుసుకున్నారు. సమస్యల్లో ఎక్కువగా తాగునీటి సరఫరా, కలుషిత నీరు, లోప్రెజర్, సివరేజీ ఓవర్ ఫ్లో, పైపులైన్ల నుంచి లీకేజీలు, డ్రైనేజీ సమస్యలున్నాయి. దాదాపు గంటన్నర సమయంలో 36 మంది వినియోగదారులు ఫోన్ చేసి తమ సమస్యల్ని ఎండీకి నివేదించారు. మరికొందరు కొత్త కనెక్షన్ల కోసం ఫోన్ చేశారు. డిస్ట్రిబ్యూషన్ లైన్ల నిర్మాణం పూర్తవ్వగానే కనెక్షన్లు మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులకు ప్రాధాన్యమివ్వాలని, సమస్యల్ని అత్యవసరంగా పరిష్కరించాలని ఎండి సుదర్శన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

# 7 లక్షలు..

## గృహజ్యోతి లబ్ధిదారులు

- హబ్సిగూడ సర్కిల్‌లో అత్యధికంగా 1.15 లక్షలు
- బంజారాహిల్స్‌లో అత్యల్పంగా 31 వేలు
- అర్హత ఉన్నా కొంతమందికి వర్తించని పథకం




హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య గ్రేటర్‌జోన్‌లో 7 లక్షలకు చేరింది. తెల్లరేషన్‌కార్డు కలిగి, గృహజ్యోతికి పథకానికి దరఖాస్తు చేసుకొని 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే ప్రతి ఒక్కరికీ గృహజ్యోతిలో భాగంగా జీరో బిల్లులు విద్యుత్‌శాఖ జారీచేస్తున్నది. మార్చి నెలలో ఈ పథకాన్ని గ్రేటర్‌లో ప్రారంభించినా విద్యుత్‌శాఖ రంగారెడ్డి జోన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా అమలుకాలేదు. ఈనెల 5న ఎన్నికల కోడ్ ముగియడంతో అర్హత కల్గిన వారికి గృహజ్యోతి పథకం అమలు చేస్తూ అధికారులు జీరో బిల్లులు జారీచేశారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో అర్హత ఉన్నా పథకం రాలేదంటూ పలువురు విద్యుత్‌కార్యాలయాలకు వస్తున్నారు. గృహజ్యోతి లబ్ధిదారుల ఎంపిక, వివరాల అప్‌డేట్ ప్రక్రియ జీహెచ్‌ఎంసీకి అప్పగించారని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. గృహజ్యోతి పథకం ప్రారంభంలో

మిగతా 8వ పేజీలో..

నేడు ఫాదర్స్ డే

8 రేపు ఖైరతాబాద్ గణేశ్ కర్రపూజ

## విమానాల్లో నగల చోరీలు

- వృద్ధ, మధ్య వయస్కులైన మహిళలే టార్గెట్
- 110 రోజుల్లో 200 విమాన ప్రయాణాలు
- ఘరానా నిందితుడి అరెస్టు.. కిలో బంగారం సీజ్

శంషాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దర్జాగా విమానాల్లో తిరుగుతాడు.. దృష్టంతా లగేజీల్లో నగలను తీసుకెళ్లే మధ్య వయస్కులు, వృద్ధులైన మహిళలపైనా..! మాటల్లో పెడతాడు.. ఫ్లైట్‌లో లగేజీ సర్దడంలో సహకరిస్తాడు.. అదను చూసి, నగలను తస్కరిస్తాడు. ఇలా 110 రోజుల్లో 200 విమాన ప్రయాణాలు చేసి, చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగ ఆటను శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు కట్టించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ నారాయణరెడ్డి వివరాలను వెల్లడించారు. న్యూఢిల్లీలోని పహాడ్‌గంజ్‌కు చెందిన రాజేశ్‌కపూర్ మధ్య వయస్కులు, వయసు పైబడ్డ మహిళలను టార్గెట్‌గా చేసుకుంటూ విమానాల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. అంతర్జాతీయ విమానాశ్రయాలతో కనెక్టివిటీ విమానాలున్న నగరాల మధ్య 110 రోజుల్లో 200 ప్రయాణాలు చేసిన రాజేశ్.. ఆయా విమానాశ్రయాల్లో టార్గెట్లను ఎంచుకునేవాడు. వారిని మాటల్లోకి దింపి.. విమానంలోకి వెళ్లాక.. లగేజీని సర్దడం వంటి పనుల్లో సహాయం చేస్తున్నట్లు నటించేవాడు. బాధితులు వాష్‌రూం వెళ్లినప్పుడో.. అదమరిచి ఉన్నప్పుడో.. ఆ లగేజీల్లో ఉన్న ఆభరణాలను తస్కరించేవాడు. ముఖ్యంగా అంతర్జాతీయ విమానాల్లో వచ్చి, ఇతర నగరాలకు వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకునేవాడని డీసీపీ వివరించారు. ఈ తరహా చోరీలపై శంషాబాద్‌లో ఐదు, వనస్థలిపురంలో ఒకటి, ఢిల్లీలో 20 దాకా కేసులున్నట్లు తెలిపారు. ఢిల్లీకి చెందిన దినేశ్‌గుప్తా అనే వ్యక్తి రాజేశ్‌కు ఫేక్ ఐడీల ద్వారా, విమాన టిక్కెట్లు ఇప్పించేవాడని పేర్కొన్నారు. చోరీ చేసిన నగలను రాజేశ్ ఢిల్లీలోని పాన్‌బ్రోకర్లు, లేదా దినేశ్‌కు విక్రయించేవాడని గుర్తించామన్నారు. రాజేశ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని, అతని వద్ద కిలో బంగారు ఆభరణాలను సీజ్ చేశామని వెల్లడించారు. దినేశ్, ఇతర పాన్‌బ్రోకర్ల అరెస్టుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## యూపీఎస్సీ పరీక్షలకు ప్రత్యేక బస్సులు

హైదరాబాద్‌సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌జోన్‌లో యూపీఎస్సీ పరీక్ష రాస్తున్న అభ్యర్థులకోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నదని గ్రేటర్ ఆర్టీసీ జోన్ ఈడీ వేంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం పరీక్ష రాసే అభ్యర్థులు సమయానికి పరీక్ష సెంటర్లకు వెళ్లేందుకు పూర్తిస్థాయిలో బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. బస్సుల సమాచారం, ఇతర వివరాల కోసం కోఠి- 9959226160, రేతిఫైల్ బస్‌స్టేషన్ - 9959226154 కమ్యూనికేషన్ సెంటర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

### రేపు 'ప్రజావాణి' లేదు..

ప్రతి సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ఈనెల 17న నిర్వహించడం లేదని జీహెచ్‌ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం బక్రీద్ పండుగ సెలవు ఉన్నందున ప్రజావాణి ఉండదని, ఈ విషయం గమనించి ప్రజలు సహకరించాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దాలి



చిన్నారికి పుస్తకాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ అనుదీప్

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్ది విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా మాసబ్‌ట్యాంక్‌లోని మురదాబాద్, చాచా నెహ్రూనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను శనివారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో మౌలిక వసతులు, రిపేర్ పనులను పరిశీలించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలతో ముచ్చటించారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి యాదయ్య, డిప్యూటీ ఈఈ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సాజిద్, వసుధ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ సందర్భంగా..

## మీరాలం దర్గా పరిసరాల్లో రేపు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బక్రీద్ ప్రార్థనల సందర్భంగా ఈనెల 17న మాసబ్‌ట్యాంక్ సమీపంలోని మీరాలం దర్గా, హాకీ గ్రౌండ్, లంగర్‌హౌజ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని ఇన్‌చార్జి ట్రాఫిక్ జాయింట్ సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. ఉదయం 8:00 నుంచి 11:30గంటల వరకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. మాసబ్‌ట్యాంక్, మీరాలం దర్గా వైపు వచ్చే వాహనదారులు ట్రాఫిక్ మళ్లింపులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈద్గాల సమీపంలో పోలీసులు ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు పార్క్ చేసుకోవాలని తెలిపారు.

### రేపు, ఎల్లుండి పశువుల కబేళాలు మూసివేత

బక్రీద్ పండుగ సందర్భంగా గ్రేటర్ పరిధిలోని పశువుల కబేళాలు, రిటైల్ బీఫ్ షాపులు 17, 18 తేదీల్లో మూసివేయాలని జీహెచ్ఎంసీ అధికారులు శనివారం ఆదేశాలు జారీచేసింది.

### బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి: డీసీపీ స్నేహామెహ్రా

బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని సౌత్‌జోన్ డీసీపీ స్నేహామెహ్రా సూచించారు. ఈమేరకు పురానీహవేలీలోని డీసీపీ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, శానిటరీ, వెటర్నరీ, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులతో ఆమె శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. జంతు వ్యర్థాలను ఎత్తిపెట్టడానికి అవసరమైన కవర్లను, వాటిని పారవేయడానికి అవసరమైన టిప్పర్లు, జేసీబీ వాహనాలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చూడాలని డీసీపీ సూచించారు.

కలుషిత నీరు సరఫరా కాకుండా

## చర్యలు తీసుకోవాలి: బీజేపీ

**చార్మినార్ జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ కృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. చార్మినార్ నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్‌షాహీ, హరిబౌలి, మీర్ ఆలం మండి, పురాణాపుల్, నూర్‌ఖాన్ బజార్‌లలో కలుషిత నీరు సరఫరా అవుతుందని జీఎంకు వివరించారు. అదే విధంగా ధ్వంసం అయిన మ్యాన్ హోళ్లకు మరమ్మతులు చేయాలని కోరారు. బోనాల పండుగ ప్రారంభంకు ముందు అన్ని పనులు పూర్తి చేయాలనీ కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు చార్మినార్ అసెంబ్లీ కన్వీనర్ ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరసత్ అలీ బాకరి, శ్రీధర్ యాదవ్, సంతోష్, తదితరులున్నారు.

## 30 శాతం పారితోషికం ఇప్పించాలి

- ఉమ్మడి ఆలయాల వృత్తిదారుల సంఘం

**చాంద్రాయణగుట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** బోనాల పండుగలో కీలకంగా సేవలందించే వృత్తిదారులకు దేవాదాయ శాఖ నుంచి తగిన పారితోషికం ఇప్పించాలని మహంకాళి ఉమ్మడి ఆలయాల వృత్తిదారుల సంఘం ప్రతినిధులు కోరారు. భాగ్యనగర్ ఉమ్మడి బోనాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యను కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఆయా ఆలయాలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల్లో కనీసం 30 శాతం వృత్తిదారులకు పారితోషికంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. తరతరాల నుంచి వంశపారంపర్యంగా ఆలయాల్లో పనిచేస్తున్న వృత్తిదారులను గౌరవించాలని కోరారు. బోనాల వేడుకలు నిర్వహించే ఆలయాల్లో వృత్తిదారులకు పారితోషికంతోపాటు యూనిఫాం, గుర్తింపు ఇచ్చేలా చొరవ తీసుకుంటానని అంజయ్య వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, కోశాధికారి గట్టు సుదర్శన్, సలహాదారు వీవై గిరి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## లాల్‌దర్వాజ ఆదాయ వ్యయాలపై విచారణ జరిపించాలి

### డిప్యూటీ సీఎంకు ఆలయ ఫోర్‌మన్ కమిటీ ప్రతినిధుల వినతి

**చాంద్రాయణగుట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** లాల్‌దర్వాజ ఆలయం ఆదాయ, వ్యయాల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరిపించాలని ఆలయ ఫోర్‌మన్ కమిటీ ప్రతినిధులు కోరారు. శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలసి లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీమహంకాళి ఆలయంలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. ఆలయ ఆదాయం కేవలం రూ.2లక్షలు మాత్రమే అని అఫిడవిట్ సమర్పించిన వివరాలపై సమగ్ర విచారణ జరిపి ప్రత్యేకఅ ధికారి హయాంలో బోనాల జాతరను జరిపించాలని వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసినవారిలో ఆలయ ఫోర్‌మన్ కమిటీ చైర్‌పర్సన్‌లు శివకుమార్ యాదవ్, బద్రీనాథ్‌గౌడ్, పి.సురేందర్ ముదిరాజ్, పోసాని సదానంద్, ప్రభు, సుధాకర్, శ్రీకాంత్‌గౌడ్, బద్రీనాథ్ తదితరులున్నారు.

బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులకు

## పాత పాలసీని అమలు చేయాలి: అసోసియేషన్

**గోషామహల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులకు పాత పాలసీని అమలు చేయాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.దామోదర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.జైపాల్ రెడ్డి కోరారు. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారని మంత్రికి వివరించారు. దామోదర్‌రావు, జైపాల్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్ మాట్లాడుతూ కరోనా సమయంలో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు వ్యాపారాలు జరగక తీవ్రంగా నష్టపోయామని, 2019 నుంచి ప్రభుత్వం ఎలాంటి కొత్త పాలసీ తీసుకురాలేదన్నారు.

సెప్టెంబర్ నెలలో రావాల్సిన పాలసీ 2022-23 కొత్త పాలసీని ప్రభుత్వం విడుదల చేసిందని, పెనాల్టీలు కట్టలేని పరిస్థితుల్లో నిర్వాహకులు ఉన్నారని.. పాత పాలసీ ప్రకారం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జి.విజయ్‌కుమార్ గౌడ్, ఇ.రామకృష్ణ, పి.రాజుగౌడ్, పి.శ్రీనివాస్‌గుప్తా, సుధాకర్‌గౌడ్, కె.బాల్‌రాజ్‌గౌడ్, ఎన్.శ్రీధర్‌రెడ్డి, ఎన్.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్, తదితరులు

**నార్సింగ్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ లతాప్రేమ్ గౌడ్ అభివృద్ధి పనులకు శంకస్థాపన చేశారు. దాదాపు రూ. 2.12 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

### విద్యార్థులకు అక్షరాభ్యాసం

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ పాఠశాల్లో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ హాజరై విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం లతాప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుపై శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీమేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్‌లు చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, భూపాల్‌గౌడ్, సీనియర్ నాయకులు ప్రేమ్‌గౌడ్, రాజిరెడ్డి, టింకురెడ్డి, సంగారెడ్డి, ఖాజా, సందీప్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీ పోలీస్, ఆకార్ ఆశా ఆస్పత్రి ఆధ్వర్యంలో..

## ఉచిత వైద్య శిబిరం

**హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్ సిటీపోలీస్, ఆకార్ ఆశా ఆస్పత్రి కూకట్‌పల్లి వారి సంయుక్త ఆధ్వర్యంలో.. హాకా భవన్‌లోని భరోసా సెంటర్‌లో శనివారం నిర్వహించిన శారీరక వైకల్యం ఉన్నవారికి ఉచిత పరీక్షలు, శస్త్రచికిత్స శిబిరాన్ని క్రైమ్స్ డీసీపీ శ్వేత, ఉమెన్ సేఫ్టీ డీసీపీ కవితతో కలిసి సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. పుట్టుకతోనే అంగవైకల్యం ఉన్నవారు, ప్రమాదాల బారినపడి వైకల్యం సంభవించిన వారు, అగ్నిప్రమాద బాధితులు, శరీరంపై కణతులు ఉన్నవారికి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా సర్జరీలు చేయడానికి ముందుకొచ్చిన డాక్టర్ బర్టెండ్ స్టైన్, డాక్టర్ షాలినిసంప్రీతి, డాక్టర్ తేజస్వీదాస్‌లను సీపీ అభినందించారు. వైద్య శిబిరానికి సుమారు 150 బాధితులు హాజరయ్యారు. వారందరికీ వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలతోపాటు.. రక్తనమూనాల సేకరణ, ఇతర అవసరమైన పరీక్షలను నిర్వహించారు. వారికి అవసరమైన శస్త్రచికిత్సలతోపాటు, వారు పూర్తిగా కోలుకునేంత వరకూ సహకారం అందిస్తామని వైద్యులు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ... పేషంట్స్‌తో, వారి తల్లిదండ్రులు, సహాయకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శారీరక దివ్యాంగుల కోసం ఇలాంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఆకార్ ఆశా యాజమాన్యంతోపాటు, షీటీమ్స్, భరోసా సెంటర్ పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు.

## హత్యకేసులో నిందితుల అరెస్ట్

**పహాడీషరీఫ్ జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** యువకుడిని కిడ్నాప్‌చేసి హత్య చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట హఫీజ్‌బాబానగర్‌కు చెందిన సమీర్(19)కు అతడి స్నేహితుడు సోహెల్‌కు మధ్య 2 నెలల క్రితం గొడవ జరిగింది. అప్పటి నుంచి సమీర్‌ను చంపాలని నిర్ణయించుకున్న సోహెల్.. అతడి స్నేహితులైన మొహమ్మద్ అబ్దుల్‌గౌస్, అలియాస్ ఖాలీద్, మొహమ్మద్ అర్బజ్, మరో మైనర్‌తో కలిసి పథకం వేశాడు. ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి మాట్లాడాలని సమీర్‌ను పిలిచి, గుర్రం చెరువు సమీపంలో తీసుకెళ్లి కత్తులతో పొడిచి హత్యచేశారు. మృతుడి తండ్రి సయ్యద్ మునీర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురి నిందితులతోపాటు మైనర్‌ను అదుపులోకి తీసుకుని విచారంచగా నేరం అంగీకరించారు. ముగ్గురిని అరెస్టు చేసి బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రధాన రహదారులు, ఖాళీ స్థలాల్లో..

# జంతు కళేబరాల వ్యర్థాలు వేయొద్దు



రాజకీయ నాయకులు, పోలీసులతో సమావేశమైన డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్

**రాజేంద్రనగర్, జూన్15(ఆంధ్రజ్యోతి):** రోడ్లు, ప్రధాన రహదారులు, ఖాళీ స్థలాల్లో జంతు కళేబరాల వ్యర్థాలు వేయొద్దని, ఇందుకు ప్రజాప్రతినిధుల, కాలనీ పెద్దలు సహకరించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ కోరారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, పోలీసులు, వివిధ పార్టీల నాయకులు, జీహెచ్ఎంసీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ నెల 17న బక్రీద్ పండుగ నేపథ్యంలో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరించారు. సర్కిల్ పరిధిలో 10 టన్నుల వ్యర్థాలను తీసుకువెళ్లే 8 టిప్పర్లు, ఆరు టన్నుల వ్యర్థాలను తీసుకువెళ్లే 10 టిప్పర్‌లతో పాటు ఐదు ఎక్స్‌కవేటర్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఈ వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. వాటి ద్వారా చెత్తను డంపింగ్ యార్డులలోకి తరలిస్తామని డీసీ తెలిపారు. జంతు కళేబరాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా మసీదు కమిటీ పెద్దల ద్వారా బ్లాక్ కవర్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. వాహనాలు, సిబ్బంది మూడు రోజులపాటు 24 గంటలు అందుబాటులో ఉండి పారిశుధ్య నిర్వాహణ పనులను పర్యవేక్షిస్తారన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, సర్కిల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగం డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ విభాగం అబ్దుల్ ఖాదర్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మజ్లిస్ నాయకుడు నవాజుద్దీన్, మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరీఫ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### జంతు వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు

- జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ వాణిరెడ్డి

**పహాడీషరీఫ్,జూన్15(ఆంధ్రజ్యోతి):** బక్రీద్ పండుగ సందర్భంగా మూడు రోజులపాటు వ్యర్థాలను తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ ఏ. వాణిరెడ్డి చెప్పారు. పహాడీషరీఫ్, జల్‌పల్లి, షాహీన్‌నగర్, ఎర్రకుంట తదితర బస్తీలలో జంతువుల వ్యర్థాల పాయింట్లు ఏర్పాటు చేశామని అన్నారు. అక్కడి నుంచి ఎప్పటికప్పుడు టిప్పర్‌ల ద్వారా వ్యర్థాలను తరలిస్తారని తెలిపారు. ఇప్పటికే జవాన్‌ల ద్వారా వేస్టేజ్ కవర్‌లు పంపిణీ చేశామని, కౌన్సిలర్‌ల వద్ద కూడా తీసుకోవచ్చన్నారు.

# డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట డబ్బు అడిగితే ఫిర్యాదు చేయండి

- బహదూర్‌పురా తహసీల్దార్ కె.చంద్రశేఖర్



**మదీన, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట ఎవరైనా డబ్బు అడిగితే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని బహదూర్‌పురా మండల తహసీల్దార్ కె.చంద్రశేఖర్ సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలకంటే ముందు బహదూర్‌పురా మండలానికి చెందిన ప్రజలకు లక్కీ డ్రా ద్వారా మొదటి విడతలో ఫారూఖ్‌నగర్‌లో 500 ఇళ్లు, రెండో విడతలో కొల్లూరులో 1,845 ఇళ్లు కేటాయించి వారికి ఇంటి పత్రాలు, తాళాలు అందజేశామన్నారు. ప్రస్తుతం కొంత మంది తాము జీహెచ్‌ఎంసీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం, మీకు కేటాయించిన ఇంటిలో కరెంటు మీటర్ కనెక్షన్ తీసుకోవాలని, అందుకోసం కొంత డబ్బు కట్టాల్సి ఉంటుందని నమ్మబలుకుతున్నారు. ఫేక్ ఐడీ కార్డును కూడా వాట్సప్‌లో పంపి నిజమైన ఉద్యోగులమని నమ్మబలుకుతున్నారు. వారి మాటలు నమ్మిన లబ్ధిదారులు డబ్బును ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఇలా మోసపోయిన లబ్ధిదారులు రోజూ కార్యాలయానికి వస్తున్నారని తహసీల్దార్ చెప్పారు.

ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిని లబ్ధిదారులకు ఉచితంగానే అందజేస్తుందని, అందులో విద్యుత్ కనెక్షన్, శానిటేషన్, ఇతరత్రా పనుల కోసం లబ్ధిదారులనుంచి డబ్బులు వసూలు చేయబోమని తెలిపారు. ఎవరూ డబ్బులు ఇవ్వవద్దని, మండల కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ద్వానాశాస్త్రి సేవలు వెలకట్టలేనివి



రచయిత వల్లీశ్వర్ దంపతులను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

**రవీంద్రభారతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** మహనీయులను స్మరించుకుంటూ వారి పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమని రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ.రమణాచారి అన్నారు. శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్‌లో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, ద్వానా సాహితీ కుటీరం సంయుక్త ఆధ్వర్యంలో సాహిత్య సవ్యసాచి డా.ద్వానా శాస్త్రి 77వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, సంపాదకులు జి.వల్లీశ్వర్‌కు కిన్నెర-ద్వానాశాస్త్రి స్మారక పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి పురస్కారగ్రహీత వల్లీశ్వర్ దంపతులను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ద్వానాశాస్త్రిని మళ్లీ స్మరించుకునే అవకాశం కల్పించడం సంతోషకరమని అన్నారు. మనిషి బతికున్నప్పుడు పొగడ్తలతో ముంచెత్తడం కాదు... మన మధ్య లేకపోయినా స్మరించుకోవడం గొప్ప విషయమని అన్నారు. ద్వానాశాస్త్రి పురస్కారాన్ని వల్లీశ్వర్‌కు ప్రదానం చేయడం సముచితమైనదని అన్నారు. ప్రముఖ కవి డా.ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ సాహిత్య రంగంలో ద్వానాశాస్త్రి చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు, రచయిత శంకర నారాయణ, ద్వాదశి శశికాంత్, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

### ఈఎన్‌టీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

**మంగళ్‌హట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు శనివారం కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ పండ్లు పంపిణీ చేశారు. కేంద్ర మంత్రిగా జి. కిషన్‌రెడ్డి రెండోసారి బాధ్యతలు చేపట్టినందుకు ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టామని కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ తెలిపారు.



పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/R9tPGrM లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

### నేడు దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

**అఫ్జల్‌గంజ్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రవ్యాప్తంగా 684 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్నారు. ఆదివారం ఉదయం కింగ్ కోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో పంపిణీ చేస్తున్నట్లు నారాయణ సేవా సంస్థాన్ తెలిపింది. శనివారం మంత్రి కార్యాలయంలో కృత్రిమ అవయవాలకు సంబంధించిన పోస్టరును పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థాన్ కన్వీనర్ ఆర్.కె.జైన్, పౌరసంబంధాల అధికారి రితేష్ జాగీర్‌దార్, ట్రస్టీ దేవేందర్ చౌబిసర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆశా వర్కర్లకు 1వ తేదీనే జీతాలు ఇవ్వాలి

**మంగళ్‌హట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** ఆశావర్కర్లకు వేతనం రూ.18 వేలు ప్రతి నెలా 1వ తారీఖున చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబుయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం కోఠిలోని డీఎంహెచ్ఎస్ ఆవరణలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలు (ఆశావర్కర్ల) సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంబాబు యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ఆశావర్కర్లకు రూ.18 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రతతోపాటు అర్హత కలిగిన ఆశా వర్కర్లకు ఏఎన్ఎం, జీఎన్ఎం ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలన్నారు. అనంతరం వైద్యారోగ్యశాఖ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కనీస వేతనాల మాజీ చైర్మన్ నారాయణ, డీఆర్‌టీయూ కార్యదర్శి మారయ్య, కరుణా, లక్ష్మీ, రేణుక పాల్గొన్నారు.



బొడ్రాయి వద్ద స్థానిక పెద్దలు, భక్తులు

### ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవాలు

**రాజేంద్రనగర్, జూన్15 (ఆంధ్రజ్యోతి):** బుద్వేల్ బొడ్రాయి వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. శనివారం బొడ్రాయి కమిటీ, బుద్వేల్ బస్తీ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుద్వేల్ పరిసర కాలనీలు, బస్తీలను చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఏడేళ్ల క్రితం బుద్వేల్‌లో బొడ్రాయిని పునఃప్రతిష్ఠించుకుని, అప్పటి నుంచి ప్రతి యేటా బొడ్రాయి పండుగ నిర్వహిస్తూ వస్తున్నామని కమిటీ ప్రతినిధులు వెల్లడించారు.

స్టాన్ స్వామి మరణానికి కారణం

## యూఏపీఏ చట్టం: అసదుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** యూఏపీఏ చట్టం క్రూరమైనదని, దీంతో వేలాదిమంది ముస్లిం, దళిత, గిరిజన యువకులు జైళ్లలో బందీలయ్యారని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఈ చట్టం 85 ఏళ్ల స్టాన్ స్వామి మరణానికి కారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. 2008, 2012లో కాంగ్రెస్ ప్రభుత్వం యూఏపీఏ చట్టాన్ని కఠినతరం చేయగా, తాను వ్యతిరేకించినట్టు పేర్కొన్నారు. 2019లో బీజేపీ దీనిపై మళ్లీ కఠినమైన నిబంధనలు తీసుకు రాగా కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందన్నారు. దీంతో మళ్లీ ఈచట్టాన్ని వ్యతిరేకించినట్టు పేర్కొన్నారు. ప్రధానిగా మోదీ 3.0 ఎన్నికల ఫలితాల తర్వాత ఏదో నేర్చుకుంటారని ఆశించా, కాని ఫలితం కన్పించడం లేదన్నారు. ఈ దౌర్జన్యాల పరంపర కొనసాగుతుందని ఒవైసీ శనివారం ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.



స్టాల్‌లోని వస్తువులను పరిశీలిస్తున్న మహిళలు

## హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్

**నార్సింగ్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** మణికొండ పైపులైన్ రోడ్డులోని సుందర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్, భాగల్‌పూర్ శారీస్, డిజైనర్ శారీస్, కాంతా వర్క్ శారీస్, హ్యాండ్‌బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారీ శారీస్, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్, లక్నో చికెన, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి టాయ్స్, గృహోపకరణాలు ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లలో అందుబాటులో ఉంచారు.



రోడ్డు రోలర్‌తో మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

## రూ. 1.83 కోట్ల మద్యం ధ్వంసం

● ఇతర రాష్ట్రాల నుంచి సుంకం చెల్లించకుండా నగరానికి..

**రాజేంద్రనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** గోవా, హరియాణా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి సుంకం చెల్లించకుండా ప్రయాణికులు తీసుకువస్తున్న 10,222 లీటర్ల మద్యం బాటిళ్లను శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు శనివారం రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వీటి విలువ రూ. 1,83,42,763 ఉంటుందని అధికారులు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని శంషాబాద్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్‌స్టేషన్‌లో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ పి.దశరథ వివరాలను వెల్లడించారు. 2023 మే నుంచి గత డిసెంబర్ వరకు నమోదైన 686 కేసుల్లో సుంకం చెల్లించకుండా వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువస్తున్న మద్యాన్ని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన కేసులు నడుస్తున్నాయని తెలిపారు. సమావేశంలో శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ గంద్ర దేవేందర్‌రావు పాల్గొన్నారు.



విద్యార్థినులతో భోజనం చేస్తున్న భట్టివిక్రమార్క

## ఘనంగా ఉప ముఖ్యమంత్రి బర్త్ డే

**రాయదుర్గం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలను శనివారం గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మి, సహ కార్యదర్శి సక్రునాయక్, రీజినల్ కో-ఆర్డినేటర్ శారదవెంకటేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.




కార్యక్రమంలో పాల్గొన్న చెఫ్‌లు

## శిల్పావ్యాలీలో మీట్ అండ్ గ్రీట్ మాస్టర్ చెఫ్

**గచ్చిబౌలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి శిల్పావ్యాలీలోని ఎస్‌ఓహెచ్‌ఓ కేఫ్‌లో మీట్ అండ్ గ్రీట్ మాస్టర్ చెఫ్ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ చెఫ్ ఇండియా తెలుగు సీజన్‌లో పాల్గొన్న తెలుగు రాష్ట్రాలకు చెందిన మాస్టర్‌చెఫ్‌ల పాక నైపుణ్యంపై సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్‌చెఫ్ ఇండియా తెలుగు పోటీదారులు శాయం, అశ్విని, రోహిత్, నీతూ, అమ్జద్‌లాలా, అఖిల్, రాగాలతో పాటు పోటీలో విజేతగా నిలిచిన అనంతపురానికి చెందిన మహబూబ్ విన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జీవిత ప్రయాణాలు, ఎదుర్కొన్న సవాళ్లు, ఆహార తయారీలో ప్రేరణల గురించి అభిమానులతో పంచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా యాంకర్ ఉజ్వల వంట పద్ధతులు, పదార్థాలు, మాస్టర్‌చెఫ్ ఇండియా తెలుగు పోటీ నుంచి చిరస్మరణీయమైన క్విజన్ సెషన్‌ను నిర్వహించారు. మాస్టర్ చెఫ్ ఇండియా తెలుగు విజేతగా మహబూబ్ విన్‌బాషాను జూన్ 7, 2024 ప్రకటించారు. శనివారం రూ.7లక్షల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు.

## మియాపూర్‌లో నటీమణుల సందడి



**హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** మియాపూర్‌లో అమ్జద్ హబీబ్ ప్రీమియం సెలూన్‌ను నటీమణులు డింపుల్ హయతి, నందితా శ్వేతలు శనివారం ప్రారంభించారు. ఆత్మవిశ్వాసమే అందం పెంచుతుందని నందితా శ్వేత అంటే, సంతోషంగా ఉంటే అందంగా ఉంటామని డింపుల్ హయతి అన్నారు. చంచల్‌గూడ జైలు ఖైదీలకు హెయిర్ స్టైలింగ్‌లో శిక్షణ ఇస్తున్నామని అమ్జద్ హబీబ్ తెలిపారు.

## హజ్‌యాత్రలో గుండెపోటుతో నగరవాసి మృతి



మహ్మద్ తాజుద్దీన్

**చాదర్‌ఘాట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** హజ్‌యాత్రకు వెళ్లిన నగరవాసి గుండెపోటుతో మరణించారు. శాస్త్రీపురం నివాసి మహ్మద్ తాజుద్దీన్(69) భార్య హుస్నేనీబేగంతో కలిసి మే 19న హజ్‌యాత్రకు వెళ్లారు. మక్కా నుంచి మినాకు బస్సులో వెళ్తుండగా శుక్రవారం సాయంత్రం ఊపిరి పీల్చుకోవడం కష్టమైంది. ఇంతలో గుండెపోటు రావడంతో అక్కడున్న అత్యవసర వైద్య బృందం పరిశీలిస్తుండగా మరణించినట్లు హజ్ కమిటీ వలంటీర్ ద్వారా సమాచారం అందింది. తాజుద్దీన్‌కు నెల రోజుల క్రితమే ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. ఆరు నెలల వరకు ఎలాంటి యాత్రలు చేయరాదని వైద్యులు సూచించినా పట్టించుకోలేదు. హజ్‌యాత్ర వెళ్లేందుకు దరఖాస్తు చేసుకోగా డ్రాలో ఎంపికయ్యారు. మృతుడు పోలీసు శాఖలో పనిచేసి పదవీ విరమణ చేసినట్లు సమాచారం. తాజుద్దీన్ పార్థివదేహాన్ని సౌదీలోనే ఖననం చేసేందుకు హుస్నేనీబేగం అక్కడి ప్రభుత్వానికి విన్నవించగా, అంగీకారం లభించినట్లు సమాచారం.

## తార్నాకలో ఓయూ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**తార్నాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** తార్నాకలోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ పరిధి ఇంటర్నేషనల్ హాస్టల్ బిల్డింగ్ పై నుంచి దూకి ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం ఓయూ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం కుదుర్మల్ల గ్రామానికి చెందిన ముల్కగల్ల రవి నిజాం కళాశాలలో ఎంఏ తెలుగు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తార్నాకలోని ఓయూ ఇంటర్నేషనల్ హాస్టల్‌లో ఉంటున్నాడు. శనివారం సాయంత్రం హాస్టల్ బిల్డింగ్ పై నుంచి రవి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు గమనించి అతడిని హుటాహుటిన ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని శ్రీకర్ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి ప్రేమ వ్యవహారమే కారణమా? ఏమైనా వ్యక్తిగత సమస్యలు ఉన్నాయా? అనే కోణంలో ఓయూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పబ్‌ల్లో పోలీసుల తనిఖీ


**రాయదుర్గం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** పబ్ నిర్వాహకులపై కేసులు, ఆరోపణల నేపథ్యంలో గచ్చిబౌలి పోలీసులు తమ పరిధిలోని పబ్‌లను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పబ్ నిర్వాహకులు వ్యాపారాలను పెంచుకునేందుకు అక్రమమార్గాలను ఎంచుకుంటున్న నేపథ్యంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు పబ్‌లో నిర్వహించకుండా, కస్టమర్లపై దౌర్జన్యాలకు పాల్పడకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తనిఖీలకు ప్రాధాన్యం సంతరించుకుంది. కార్యక్రమంలో గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తండ్రి-పిల్లల బంధం శక్తివంతం

● మరింత బలోపేతానికి

సైకాలజిస్టులు, నిపుణుల సూచనలు

# hi నాన్న




### నాన్న ఓ విశ్వం

ఆకాశమంత ఎత్తులో ఉంటూ..
చినుకులా జారిపోతాడు.
బలంగా కనిపిస్తున్నా
తన వారి కోసం
ఆకులా రాలిపోతాడు..
అందుకే ఆయనో విశ్వం

**హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** ఫాదర్స్ డే వచ్చేసింది. పిల్లలతో మనసారా మాట్లాడే అవకాశమే లేని ఎంతో మంది తండ్రులున్న ఈ కాలంలో ఆ పిల్లలతో బంధం ఎలా బలోపేతం చేసుకోవాలంటే సైకాలజిస్టుల నుంచి పేరెంటింగ్ నిపుణుల వరకూ ముక్తకంఠంతో చెప్పేది పిల్లలతో ఎక్కువ సమయం గడపాలని! తండ్రి-పిల్లల బంధం చాలా శక్తివంతమైనదని, పిల్లలు శారీరకంగానూ, మానసికంగానూ ఎదగడంలో తండ్రి పాత్ర కీలకమని పలు అధ్యయనాలూ వెల్లడిస్తున్నాయి. తండ్రి-పిల్లల బంధం బలోపేతానికి నిపుణుల సూచనలు..

### ప్రాజెక్టులలో భాగమవ్వండి..

చిన్నారుల ప్రాజెక్టులలో భాగం కావడానికి ప్రయత్నించండి. దీంతో వారి అభిప్రాయాలను పంచుకునే అవకాశమూ కలుగుతుంది. ప్రాజెక్ట్ గురించి వారి మాటలను వినండి. అది బంధం బలపడేందుకూ తోడ్పడుతుంది.

### చిన్న చిన్న కార్యక్రమాల్లో..

తండ్రి-పిల్లల బంధం బలోపేతం కావాలంటే, వారి జీవితంలో చోటు చేసుకునే చిన్న, చిన్న కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి. ఎంతగా ఇన్‌వాల్వ్ అయితే అంతగా బంధం బలోపేతమవుతుంది.

### ఒకే తరహా అభిరుచులను పంచుకోండి

పిల్లలతో బంధం బలోపేతం చేసుకోవాలనుకుంటే ఆసక్తులను పంచుకోండి. మరీ ముఖ్యంగా మీతో పాటుగా పిల్లలు ఆస్వాదించే అంశాలను కలిసి చేసేందుకు ప్రయత్నించండి. అది స్పోర్ట్స్, మ్యూజిక్ లేదంటే మరేదైనా కావచ్చు.

### స్నేహితులుగా ఉండాలి

పిల్లలకు స్నేహితులుగా ఉండాలనుకోవడం తప్పు లేదు కానీ, హద్దుల్లో ఉండాలి. లేదంటే నేటి తెలుగు సినిమాల్లో కార్టూన్ క్యారెక్టర్‌లా మారిపోయే అవకాశాలున్నాయి.

### ప్రేమ చూపండి..

పిల్లల పట్ల ప్రేమను చిన్న,చిన్న అంశాల్లోనే పెద్దగా చూపేందుకు ప్రయత్నించండి. అది హై ఫైవ్స్ కావచ్చు. మాటలతోనే ప్రేమను చూపడం కావచ్చు. అలాగే వారు సాధించిన విజయాలను పొగడడం ద్వారా కూడా ప్రేమను చాటవచ్చు.

### ఓపిక ఉండాలి..

పిల్లలతో మాట్లాడేటప్పుడు ఓపిక ఉండాలి. అన్ని విషయాలు తండ్రి దగ్గర వారు ఓపెన్ కారు. అందుకే వారు చెప్పేది ఓపికగా వినండి.

### ఆత్మవిశ్వాసంతో ఉండాలి..

విద్య, పిల్లల అలవాట్లు లేదంటే సంబంధాల గురించి మాట్లాడడం కాస్త కష్టమే కావచ్చు కానీ తప్పదు. ఈ తరహా అంశాలపై చర్చించేటప్పుడు ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో ఉండడం అవసరం.

### శారీరక వ్యాయామాలు..

యోగా లాంటివి కాకపోతే ఇతర వ్యాయామాలను పిల్లలతో కలిసి చేసేందుకు ప్రయత్నించండి. ఈ వ్యాయామాలు వినోదాత్మకంగా ఉండడం మాత్రమే కాదు, మనసు విప్పేందుకు, బంధం బలోపేతానికి తోడ్పడతాయి

### ఆదర్శంగా నిలవాలి..

పిల్లలకు ఎప్పుడూ తండ్రి ఆదర్శంగా నిలవాలి. తండ్రి ప్రవర్తన పిల్లలపై పెను ప్రభావమే చూపుతుంది. కుటుంబంతో ఉన్నప్పుడు నిజాయితీగా వ్యవహరించాలి.

## ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

● అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్

**హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ హెచ్చరించారు. టోలీచౌకి సమీపంలోని సెవెన్ టూంబ్స్ రోడ్ సర్వే నంబర్.179లో ప్రభుత్వం నిర్మించిన ప్రహరీని కూల్చి అక్రమంగా కొందరు గోడను కట్టినట్లు ఇటీవల తనిఖీల్లో రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చింది. అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సదరు నిర్మాణాన్ని కూల్చివేసి ప్రభుత్వ ప్రహరీని పునరుద్ధరించే పనులు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూల్చివేసిన వ్యక్తి సొంత డబ్బులతో ప్రహరీని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు లేఖ రాశారు. షేక్‌పేట్ తహసీల్దార్ అనితారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ల్యాండ్ పార్సిల్ ప్రకారం ఇక్కడ 1120 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉందని, కొత్త టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని ప్రతిపాదించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్, సర్వేయర్ సాయికాంత్, రెవెన్యూ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

## భారత రాజ్యాంగ పీఠిక పుస్తకావిష్కరణ


**రాంనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** భారత రాజ్యాంగాన్ని కాపాడుతున్నది, భవిష్యత్‌లో కాపాడబోయేది సామాన్యులేనని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సాహితీమిత్రుల ఆధ్వర్యంలో కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్, నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ రచించిన భారత రాజ్యాంగ పీఠిక పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులు, సంపద ఎవరి చేతుల్లోకి వెళ్లకుండా ఉండే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ రచించారని, ఆయన రాజ్యాంగ నిర్మాతలో ముందు వరుసలో ఉంటారని అన్నారు. భారత సమాజం బ్రీతింగ్ ఆగిపోయే స్థితిలో ఉందని ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటుందన్నారు. నేటికీ సమాజం ఏమీ మారలేదనే భయం వేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలని గత పదేళ్లుగా పాలకులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో కొంత మేరకు అడ్డుకట్ట పడిందన్నారు. పుస్తక రచయిత మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ రాజ్యాంగం, పౌర హక్కులు, పౌర సత్వం ఏదైనా బతికి ఉండాలంటే ప్రశ్నించడం కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. వాక్ స్వాతంత్ర్యం, భావ స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాశత్రువులను ఓడించేది రాజ్యాంగాన్ని కాపాడుకునేది ప్రజలేనని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాం, ఎంఎస్‌కో పబ్లిషర్స్ విజయ్‌కుమార్, శ్రీశ్రీ ప్రింటర్స్ ప్రతినిధి విశ్వేశ్వర్ రావు, డాని తదితరులు పాల్గొన్నారు.



భారత రాజ్యాంగ పీఠిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి తదితరులు

## యువ న్యాయవాదులతో నూతన ఒరవడి

● తెలంగాణ హైకోర్టు జడ్జి విజయ్‌సేన్‌రెడ్డి




మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు జడ్జి విజయ్‌సేన్‌రెడ్డి

**వనస్థలిపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** సొసైటీ బైలాస్‌ను సవరించి రాబోయే రోజుల్లో యువ న్యాయవాదులను తమ సొసైటీలో భాగస్వాములను చేసుకుని నూతన ఒరవడిని తీసుకువస్తామని తెలంగాణ హైకోర్టు జడ్జి బి.విజయ్‌సేన్‌రెడ్డి అన్నారు. ది అడ్వకేట్స్ మ్యూచ్‌వల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని 13వ కల్చరల్ మీట్-2024 కార్యక్రమం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో శనివారం రాత్రి ఘనంగా జరిగింది. జడ్జి విజయ్‌సేన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యక్తి నుంచి మొదలైన తమ సొసైటీ వ్యవస్థగా మారిందన్నారు. తమ సొసైటీ ద్వారా ఆరువేల మంది సభ్యులకు మెడిక్లెయిమ్స్, డెత్ యాక్సిడెంట్ క్లెయిమ్స్‌ను అందజేస్తున్నామని తెలిపారు. తమ సొసైటీ రూ.1తో మొదలై రూ.800 కోట్ల టర్నోవర్‌కు చేరుకుందన్నారు. అనంతరం పలు రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి కె.శ్రీనివాస్‌రెడ్డి, జడ్జిలు టి.మాధవిదేవి, కె.సురేందర్, నగేష్ భీమపాక, రేణుకా యార, నందికొండ నర్సింగ్‌రావు, బి.సురేష్, ఎస్.శశిధర్‌రెడ్డి, వి.బాలభాస్కర్‌రావు, డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనిల్ కుమార్ ఎలగందుల, కార్యదర్శి పొలిశెట్టి రవి, కన్వీనర్ బుచ్చిబాబు, బార్ కౌన్సిల్ సభ్యులు ఫణీంద్ర భార్గవ్, అనంతసేన్‌రెడ్డి, హన్మంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భుజంగరావు, కొండారెడ్డి, ఎం.రాజేందర్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



ఎయిర్‌వారియర్ డ్రిల్ నిర్వహిస్తున్న కెడెట్స్

(5వ పేజీ తరువాయి)

సత్కరించారు. అకాడమీ కమాండెంట్ ఎయిర్ మార్షల్ సీతపల్లి శ్రీనివాస్ గ్రాడ్యుయేటింగ్ అధికారులతో ప్రమాణం చేయించారు. కొత్తగా నియమితులైన అధికారులు రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన ఆనందలోకే సంబంధించిన సంప్రదాయిక స్వరానికి స్లో మార్చ్‌ను నిర్వహించారు.

● అబ్బురపరిచిన విన్యాసాలు

పరేడ్ అనంతరం ఎయిర్‌ఫోర్సు అకాడమీలో ప్రదర్శించిన స్కైడైవింగ్ బృందం, ఆకాష్, సూర్యకిరణ్, ఫిలాటస్ పీసీ-7 ఎయిర్ క్రాఫ్ట్ విన్యాసాలు, సుఖోయ్-30, సూర్యకిరణ్ ఎయిర్‌క్రాఫ్ట్ విన్యాసాలు గంటకు వెయ్యి కిలోమీటర్ల వేగంతో ఎదురెదురుగా వచ్చి సెకన్ల వ్యవధిలోనే తప్పుకోవడం అబ్బురపరిచాయి. సారంగ్, ఎయిరోబాటిక్ బృందం ప్రేక్షకులను అబ్బురపరిచారు.

● ఆకట్టుకున్న ఎయిర్ వారియల్ డ్రిల్

వాయుసేనకు చెందిన ఎయిర్ వారియల్ డ్రిల్ టీమ్ నిర్వహించిన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకున్నది. కేడెట్స్ చేతిలో తుపాకీని పట్టుకుని వాటిని ఏకధాటిగా గాలిలో తిప్పుతూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. డబుల్‌లైన్, ప్లస్ తదితర అంశాలలో విన్యాసాలు చేశారు. వెనుకకు చూడకుండా తమ చేతిలోని తుపాకీని వెనుక మరో సైనికుడికి గాలిలో అందించడం, నడుస్తూ ఆకస్మాత్తుగా భూమిపై తుపాకీని నిలబెట్టి వదిలేయడం, అది కిందపడిపోకుండా వెనుక ఉన్న మరో సైనికుడు పట్టుకోవడం వంటి కార్యక్రమాలు హైలెట్‌గా నిలిచాయి.

## 7లక్షలు.. గృహజ్యోతి లబ్ధిదారులు

(5వ పేజీ తరువాయి)

లబ్ధిదారుల వివరాలు అప్‌డేట్ అంశం విద్యుత్‌శాఖకు అప్పగించినా ఆ తర్వాత ఆ ఆప్షన్ తొలగించడంతో సమస్యలు తలెత్తాయి. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అర్హత కల్గినవారు ఎప్పుడైనా ఈ పథకానికి దరఖాస్తుచేసుకునే అవకాశం కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు.

### హబ్సిగూడలో అత్యధికం..

గృహజ్యోతి పథకంలో అత్యధిక లబ్ధిదారులు హబ్సిగూడ సర్కిల్‌లో ఉన్నారు. 1,15,910 గృహజ్యోతి లబ్ధిదారులకు ఈ పథకం వర్తిస్తున్నది. మేడ్చల్ సర్కిల్‌లో 1,08,145 మందికి, రాజేంద్రనగర్ సర్కిల్‌లో 1,01,849, సరూర్‌నగర్ సర్కిల్‌లో 93,678, హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో 64,594, సైబర్‌సిటీ సర్కిల్‌లో 63,963, సికింద్రాబాద్ సర్కిల్‌లో 63,128, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లో 54,010 మంది ఈ పథకం కింద లబ్ధిదారులుగా ఉన్నారు. బంజారాహిల్స్ సర్కిల్‌లో అతి తక్కువగా 31,974 మంది గృహజ్యోతి లబ్ధిదారులు జీరో బిల్లులు తీసుకుంటున్నారు.

**గ్రేటర్‌జోన్ 9 సర్కిళ్లలో గృహవిద్యుత్‌కనెక్షన్లు, గృహజ్యోతి లబ్ధిదారులు**

| సర్కిల్ | డొమస్టిక్ విద్యుత్‌కనెక్షన్లు | గృహజ్యోతి లబ్ధిదారులు |
|---|---|---|
| బంజారాహిల్స్ | 3,26,831 | 31,974 |
| సైబర్‌సిటీ | 5,56,387 | 63,963 |
| హబ్సిగూడ | 7,75,489 | 1,15,910 |
| హైదరాబాద్ సెంట్రల్ | 5,18,739 | 54,010 |
| హైదరాబాద్ సౌత్ | 5,68,910 | 64,594 |
| మేడ్చల్ | 7,32,176 | 1,08,145 |
| రాజేంద్రనగర్ | 4,94,838 | 1,01,849 |
| సరూర్‌నగర్ | 6,12,889 | 93,678 |
| సికింద్రాబాద్ | 4,36,719 | 63,128 |

## బోనాలకు ఘనంగా ఏర్పాట్లు : పొన్నం

**హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** బోనాల పండుగకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీలో ఆషాడ మాసం జంటనగరాల బోనాల జాతర ఏర్పాట్లపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన అధికారులతో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. బోనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి వసతి, మొబైల్ టాయిలెట్లు, దేవాలయాల వద్ద ప్రత్యేక అంబులెన్స్‌లతో హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని దేవాలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించాలన్నారు. రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయా దేవాలయాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. బక్రీద్‌కు కూడా అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశామని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

## రేపు ఖైరతాబాద్ గణేశ్ కర్రపూజ

**ఖైరతాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ గణపతి తయారీ పనులను నిర్జల ఏకాదశి రోజు సోమవారం సాయంత్రం ఐదు గంటలకు కర్రపూజతో ప్రారంభిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శనివారం గణపతి ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటైన ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.మహేందర్‌బాబు విలేకరులతో మాట్లాడారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ సింగరి సుదర్శన్ పరమపదించిన అనంతరం ఉత్సవ నిర్వాహక కుటుంబసభ్యులతో కలిసి ఖైరతాబాద్ పుర ప్రముఖులతో కొత్త కమిటీని వేశామని తెలిపారు. ఇందులో నిర్వాహక కుటుంబం నుంచి సింగరి రాజ్‌కుమార్ ఛైర్మన్‌గా, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారని తెలిపారు. కర్రపూజ కార్యక్రమానికి భక్తులు హాజరు కావాలని కోరారు.

## కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ బదిలీ



అభిలాషఅభినవ్


**కూకట్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాషఅభినవ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమెను నిర్మల్ కలెక్టర్‌గా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు నెలలుగా కూకట్‌పల్లి జెడ్సీగా విధులు నిర్వహిస్తున్న అభిలాషఅభినవ్ పాలనపై తనదైన ముద్ర వేశారు. పారిశుధ్యం, నాలాలు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించి కూకట్‌పల్లి జోన్‌ను నంబర్.1 స్థానంలో నిలిపారు.

## హైదరాబాద్ అభివృద్ధికి కారణం చంద్రబాబు

● ఏపీ రాజధాని కూడా అలా రూపొందాలి: సినీ నటుడు సుమన్

**తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** ముఖ్యంగా గచ్చిబౌలి వంటి ప్రాంతానికి వెళ్తే హైదరాబాద్‌లో ఉన్నామా లేక న్యూయార్క్‌లో ఉన్నామా అనే భావన కలుగుతోందని, ఇంతటి అభివృద్ధికి కారణం చంద్రబాబే అని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీ రాజధాని కూడా అంత అందంగా తయారుకావాలంటే నిర్మాణ పనులు వేగంగా జరగాలన్నారు. అందుకు అందరూ సహకరించాలన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు మంచి తీర్పు ఇచ్చారని.. చంద్రబాబు, పవన్, బీజేపీ కూటమి గెలవడం రాజకీయాల్లోనే కొత్త ట్విస్ట్ అన్నారు. ఐదేళ్లు వెనక్కి వెళ్లిన ఏపీని ప్రజలు మళ్లీ ముందుకు తీసుకువచ్చారన్నారు. ఏపీలో కూడా పలు ప్రాంతాల్లో చిన్నపాటి సినిమా స్టూడియోలు వస్తే రెవెన్యూ పెరగడంతో పాటు అనేకమంది కళాకారులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ దిశగా నూతన ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు అధిక సంఖ్యలో నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని, అది కష్టమే అయినప్పటికీ సీఎం చంద్రబాబు చేస్తారన్న ఆశాభావాన్ని సుమన్ వ్యక్తం చేశారు.

## దేవుడు జన్మనిస్తే అవయవదానంతో పునర్జన్మ



అవయవదానం చేస్తామని క్యాట్ వాక్ చేస్తున్న డోనర్లు

**అమీర్‌పేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** దేవుడు జన్మనిస్తే, అవయవ దానం పునర్జన్మనిస్తుందని తెలుగు నేపథ్య గాయని సమీరా భరద్వాజ్ అన్నారు. మోహన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని మెట్రోస్టేషన్‌లో శనివారం సాయంత్రం అవయవదానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా అవయవదానానికి అంగీకరించిన వారితో నిర్వహించిన ర్యాంపు వాక్ ఆకట్టుకుంది. సమీరా భరద్వాజ్ మాట్లాడుతూ మరణానంతరం ఒకరు చేసే అవయవదానం మరో నలుగురైదురికి జీవితాన్నిస్తుందన్నారు. అవయవదానంపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, మానవత్వంతో ముందుకు వచ్చి ప్రతి ఒక్కరూ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌గార్గ్, డాక్టర్ లక్ష్మి, మనీల, నటి గాయత్రి భార్గవి, సినీదర్శకులు శైలేష్, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ కమల్ కిరణ్, మీరా షన్భాయ్, వైజయంతి పాల్గొన్నారు.

## సికింద్రాబాద్-దర్భంగా-సికింద్రాబాద్ రైళ్ల రద్దు

**హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** బిలాస్‌పూర్ డివిజన్ పరిధిలోని తలాయిపల్లి ఎన్‌టీపీసీ షైన్స్ లైన్స్ నుంచి కోట్లర్లియా స్టేషన్ వరకు నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా జూన్ 25, 29 తేదీల్లో సికింద్రాబాద్-దర్భంగా రైలు(17007), జూన్ 28, జూలై 2న దర్భంగా-సికింద్రాబాద్ రైలు (17008)ను రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.


## ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు

**హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణపై తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ(టీజీఎస్పీడీసీఎల్) దృష్టి సారించింది. బస్తీలు, కాలనీల్లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాల్లో చెత్త వేయకుండా ఆంక్షలు విధించడంతో పాటు తీగలు కిందకు వేలాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సిద్ధం చేయాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ ప్రమాదాలు జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సండే సెలబ్రిటీ

దక్షిణాది రాష్ట్రాల సినీ పరిశ్రమలపై తనదైన ముద్ర వేసిన వారిలో కన్నడ నటుడు **ఉపేంద్ర** ఒకరు. విలక్షణమైన శైలితో ప్రేక్షకులను ఆకట్టుకొనే ఉపేంద్ర 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.





**నేను భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించను. అసిస్టెంట్ డైరెక్టర్‌గా నా వృత్తి జీవితాన్ని ప్రారంభించినప్పుడు- సమాజానికి ఏదో ఒకటి చేయాలనుకొనేవాణ్ణి. అదొక కోణం. కానీ నేను ఎప్పుడూ రియాలిటీలోనే బతుకుతూ ఉంటా. అయితే ఏదో చేయాలనే తపన మాత్రం నన్ను వెంటాడుతూ ఉంటుంది. "రాజకీయాలు కలుషితం కాకూడదు.. దానిలో డబ్బు ప్రభావం ఎక్కువ ఉండకూడదు. అవినీతి ఉండకూడదు సమస్యలే ప్రధాన అంశాలుగా ఎన్నికలు జరగాలి. 'రైట్ టూ రీకాల్' అమలు చేయాలి" ఇలా అనేక ఆలోచనలు ఉంటాయి. పవన్ కళ్యాణ్ గారు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత- నన్ను రాజకీయాల్లోకి రమ్మని మా దగ్గర అనేకమంది అడిగారు. ఆయనకు నాకు తేడా ఉంది. ఆయనకు ఒకటే లక్ష్యం, ఆదర్శం. కానీ నా పరిస్థితి వేరు.**

# నాకు నేనంటేనే ఇష్టం

**మీరు నటుడు, దర్శకుడు. ఈ రెండింటిలో మీకు ఏది ఎక్కువ ఇష్టం?**

రెండూ ఇష్టమే! అంత కన్నా సినిమా నిర్మాణమంటేనే ఇష్టం. డైరక్షన్ అంటే.. ఒక సినిమాను మన ఆలోచనల నుంచి పుట్టించటం. దాని థ్రిల్లే వేరు. కానీ నటన మరో సముద్రం. డైరక్టర్ చెప్పినట్లు చేయాలి. నా ఉద్దేశంలో నటన కన్నా డైరక్షన్ ఎక్కువ థ్రిల్ ఇస్తుంది. అందుకే నేను రెండింటిలోనూ కొనసాగుతున్నా! ఐదేళ్లకు ఒకసారి డైరక్షన్ చేస్తూ ఉంటా!

**మీరు నటించేటప్పుడు డైరెక్టర్‌లా ఆలోచిస్తారా?**

నా ఉద్దేశంలో డైరక్టర్ చెప్పినట్లు నటుడు చేయాలి. నేను 'హెచ్‌టూఓ' అనే సినిమా చేసే సమయంలో ఏఎన్నాఆర్‌గారిని - 'ప్రకృతి' అనే ఒక పాత్ర చేయమని అడగటానికి వెళ్లా.. కథ చెప్పా. ఆయనకు బాగా నచ్చింది. ఆ క్యారెక్టర్ ఎలా ఉండాలో నాకు చెబుతూ ఆయన ఊహల్లోకి వెళ్లిపోయారు. తెల్ల గెడ్డం, తెల్లటి దుస్తులు, వెనుక కాంతి,అందమైన ప్రకృతి... ఇలా ఆ

**నా కెరీర్‌లో అత్యంత కష్టమైన సినిమా 'రక్తకన్నీరు'. దాన్ని ఎం.ఆర్. రాజాగారు తమిళంలో చేశారు. కొద్దిగా మార్చి నేను కన్నడంలో చేశా. ఆ మేకప్, నటించే పద్ధతి అన్నీ భిన్నంగా ఉంటాయి.**

పాత్ర ఎలా ఉండాలో చాలాసేపు చెప్పారు. అయితే ఆయనకు అవుట్‌డోర్ షూటింగ్ చేసే ఓపిక లేదు. అందువల్ల ఆ పాత్ర చేయలేనన్నారు. ఆ సందర్భంలో- ఆయన కొన్ని గొప్ప మాటలు చెప్పారు. " నటుడిగా నాకు ఒక ప్రిన్సిపల్ ఉంది. నేను ఫిల్మ్ ఒప్పుకొనే ముందు కింగ్‌లా ప్రవర్తిస్తా. నాకు కావాల్సినవన్నీ అడుగుతా. ఎక్కడా రాజీ పడను. పూర్తిగా తృప్తి చెందితేనే సినిమా ఒప్పుకుంటా. అయితే ఒక్కసారి ఒప్పుకున్న తర్వాత నేను బానిసలా పనిచేస్తా..." అని అన్నారు.



పరిశ్రమలో వారందరూ నేర్చుకోవాల్సిన విషయమది. ఆ మాటల్లోనే- ఆయన ఇంకో విషయం కూడా చెప్పారు. "గతంలో నా దగ్గరకు ఏదైనా మంచి స్క్రిప్ట్ వస్తే- అది నాకన్నా ఎన్టీఆర్‌కు బావుంటుందని అనిపిస్తే- దాన్ని ఆయన దగ్గరకు పంపేవాణ్ణి.. నేనే ఫోన్ చేసి స్వయంగా చెప్పేవాణ్ణి. ఆయన కూడా అలా చేసేవారు" అని అన్నారు. అందరూ వాళ్లిద్దరి మాదిరిగా ఉంటే చాలా బావుంటుందనిపిస్తుంది.

**మీకు నటన అనేది సహజంగా వచ్చిందా? ఎక్కడైనా నేర్చుకున్నారా?**

ఎక్కడా నేర్చుకోలేదు. ఎక్కడినుంచి వచ్చిందో నాకు తెలియదు. ఇక్కడ ఒక్క విషయం మీకు చెప్పాలి. నేను వేరే చిత్రాలను లేదా నటులను చూసి స్ఫూర్తి

**ప్రతి రోజూ మనం ఏదో ఒక విషయాన్ని నేర్చుకుంటేనే ఉండాలి. నా ఉద్దేశంలో ఇండస్ట్రీలో అందరికన్నా ప్రేక్షకులు చాలా తెలివైనవాళ్లు. ఒక్కసారి చూసి 'సినిమా బావుందా? లేదా?' అనే విషయాన్ని తేల్చేయగలుగుతారు. ఆ జడ్జిమెంట్ మనకు ఎప్పుడూ రాదు.**

పొందను. ఇతరులు ఎవరూ చెప్పని సబ్జెక్ట్‌ను చెప్పాలని ప్రయత్నిస్తాను.

**కొవిడ్ తర్వాత... ఓటీటీ ప్లాట్‌ఫాంల ప్రవేశం తర్వాత సినిమా లాంగ్వేజ్‌లో మార్పు వచ్చిందా?**

వచ్చింది. అయితే ఇది సహజమే! నేను సినీ రంగంలోకి ప్రవేశించిన కొత్తలో బడ్జెట్‌లు చాలా తక్కువ ఉండేవి. ఆ బడ్జెట్‌లోనే అందరినీ ఆకర్షించే సినిమాలు

**కొన్ని పాత్రలకు ముందు హోంవర్క్ చేసుకుంటా. అయితే కెమెరా ముందుకు రాగానే హోంవర్క్ అంతా మర్చిపోతా.**

చేయాలని ప్రయత్నించేవాళ్లం. ఇప్పుడు కూడా అంతే! కొత్త దర్శకులు తమ సత్తా చూపించాలని ప్రయత్నిస్తూ ఉంటారు. ఈ మధ్య కాలంలో పోటీ పెరిగింది. మార్కెట్ పెరిగింది. సమస్యలు పెరిగాయి. అన్నీ పెరుగుతూ వచ్చాయి. ఇవన్నీ కూడా సహజమైనవే!

**మీరు ట్రెండ్ సెట్టరా? ట్రెండ్‌ను ఫాలో అవుతారా?**

నా వరకూ ఒక ట్రెండ్‌ను మొదలుపెట్టాలనుకుంటా. నేను నిజాయితీగా నాకు నచ్చినట్లు సినిమా తీస్తా. ఒక సినిమా హిట్ అయింది కాబట్టి ఆ తరహాలో తీయాలని ప్రయత్నించను. నా ఉద్దేశంలో సినిమాల విజయానికి ఒక ఫార్ములా లేదు. నిజాయితీగా... మనకు నచ్చిన సినిమా తీయటమే అసలైన ఫార్ములా!

**మీ ఉద్దేశంలో విజయవంతమైన సినిమాల వెనకున్న ఫార్ములాలు ఏమిటి?**

'వయస్సు అయిపోయింది కాబట్టి ఫిలాసఫీ చెబుతున్నాడు' అని మీరు అనుకోవచ్చు కానీ సినిమాలన్నీ కాలమాన పరిస్థితుల మీద ఆధారపడి ఉంటాయనిపిస్తుంది. ఒక్కసారి నా సినిమాలనే తిరిగి చూసుకుంటే- 'ఏ', 'ఉపేంద్ర', 'సూపర్' లాంటి సినిమాలు ఎలా చేశాను? అనిపిస్తుంది. స్టుపిడిటీ అనిపిస్తుంది. కానీ ఆ పరిస్థితుల్లో చేశానంతే! మీకో ఉదాహరణ చెబుతాను. ప్రస్తుతం మొబైల్ ఫోన్లు అందరి దగ్గరా ఉన్నాయి. మొబైల్‌ను నేనే ఆవిష్కరించానని ఒక శాస్త్రవేత్త చెప్పుకున్నాడనుకుందాం. నా ఉద్దేశంలో అది సత్యం కాదు. జనాభా పెరిగిపోయింది. ప్రజల మధ్య కమ్యూనికేషన్‌కు ఒక సమర్థమైన సాధనం కావాలి. దీని కోసం ప్రకృతే మొబైల్ ఫోన్ అనే సాధనాన్ని కనుగొనేలా చేసింది. మనం కేవలం టూల్స్ మాత్రమే!

**ప్రస్తుత కన్నడ సినిమా పరిశ్రమ మీద మీ అభిప్రాయమేమిటి?**

బాగా ఎదుగుతోంది. అయితే ఇక్కడ ఒక విషయం చెప్పాలి. పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఇండస్ట్రీ మారుతూ ఉంటుంది. ఒక భాషకు చెందిన సినిమా



దేశవ్యాప్తంగా పెద్ద హిట్ అయిన వెంటనే- మిగిలిన వారందరూ - ఆ సినిమా వైపు చూస్తారు. కొద్ది కాలం తర్వాత మరో భాష సినిమా హిట్ అవుతుంది. ఇదంతా ఒక చక్రం.

**మీకు ఇష్టమైన నటులు ఎవరు?**

వాస్తవం చెప్పమంటారా... నాకు నేనంటేనే ఇష్టం. నేను కాకుండా- చిరంజీవిగారు, విష్ణువర్ధన్‌గారు, రజనీగారు... వాళ్లన్నా ఇష్టమే! ఎందుకంటే ప్రజలు వారిని అంతగా ఆదరించారంటే - వాళ్లలో ఏదో ఉన్నట్లే కదా!

● సీవీఎల్ఎన్ ప్రసాద్




అలనాటి కథ

## పవన్... శేషేంద్ర కవిత్వం



"నేను అంతా కలిపి పిడికిలి మట్టే కావచ్చు... కానీ గొంతు ఎత్తితే ఒక దేశపు జెండాకు ఉన్నంత పొగరు ఉంది". శేషేంద్ర రాసిన ఈ కవితా పంక్తులను తన ప్రసంగాలలో ఉటంకించారు జనసేన అధినేత పవన్ కళ్యాణ్. ఈ మధ్య కాలంలో నాకు నచ్చిన రాజకీయ నాయకుల్లో పవన్ ఒకరు. సాధారణంగా సాహిత్యాన్ని బాగా చదువుకొన్న రాజకీయ నాయకులు ఇటీవల చాలా అరుదుగా కనిపిస్తున్నారు. వీరిలో పవన్ కళ్యాణ్ ఒకరు కావటం... తను అధికారంలోకి రావటం చాలా ఆనందంగా అనిపించింది. ఆయనతో నేను ఎప్పుడూ నేరుగా మాట్లాడలేదు. కానీ ఉత్తరప్రత్యుత్తరాలు మాత్రం నడిచాయి.

ఒకప్పుడు రాజకీయ నాయకులు కేవలం చదువు మాత్రమే కాదు... సాహిత్యాన్ని కూడా చదువుకొనేవారు. ఇప్పటి తరం వారిలో చాలామందికి సాహిత్యంవల్ల కలిగే వికాసం తెలియకపోవచ్చు. కానీ మన సమాజ ఒరవడిని.. దానిలో వస్తున్న మార్పులను పసిగట్టేది సాహిత్యమే. కవిత్వం, కథలు, నవలలు, సాహితీ వ్యాసాలు... కేవలం కవి ప్రతిభను మాత్రమే కాదు.. అతను ఈ సమాజానికి ఏం చేయాలనుకున్నడానే విషయాన్ని కూడా తెలియజేస్తాయి. అందుకే గత కాలపు ఉద్యమాలకు సాహిత్యం ఒక ప్రధానమైన ఇరుసుగా ఉండేది. యువత కవితలను చదివి అర్థం చేసుకొనేవారు. స్ఫూర్తి పొందేవారు. రాజకీయ నాయకులకు కూడా సాహిత్యంపై అవగాహన ఉండేది. హైదరాబాద్ సంస్థానంలో ఎంతోమంది ప్రధానులు పేరుమోసిన కవులే. మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాలలో నాయకులకు కూడా సాహిత్యం పట్ల అవగాహన ఉండేది. అందుకే ముఖ్యమంత్రులు, మంత్రులు... ద్యాన్‌బాగ్ ప్యాలెస్‌కు వచ్చిపోతూ ఉండేవారు. పి.వి.నరసింహరావు దగ్గర నుంచి అంజయ్య వరకు అనేక మంది నాయకులకు సాహిత్యం పట్ల అవగాహన ఉండేది. నేను అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో హిందీ అకాడమీ అధ్యక్షురాలిగా పనిచేశాను. ఆ సమయంలో మంత్రులను, ముఖ్యమంత్రులను కలవాల్సి వచ్చేది. వారు సాహిత్యానికి సముచిత ప్రాధాన్యం ఇచ్చేవారు. నిధులు విడుదల చేసేవారు. మంచి సాహిత్యాన్ని ప్రోత్సహించమని చెప్పేవారు. ఎన్టీఆర్ ప్రభుత్వంలో కళలకు మంచి ప్రాధాన్యం లభించింది. శేషేంద్రకు ఎన్టీఆర్ మిత్రుడు కావటంవల్ల సాహితీ విషయాలను చెప్పగలిగే సాన్నిహిత్యం ఉండేది. నాకు గుర్తున్నంత వరకు రాజకీయ నాయకులు తమ ప్రసంగాలలో కవితలను కోట్ చేసేవారు. కమ్యూనిస్టు పార్టీల నినాదాలన్నీ కవితాత్మకంగానే ఉండేవి. ఆ తర్వాత పరిస్థితులు మారాయి.



కొన్నేళ్ల క్రితం 'పవన్ కల్యాణ్ అనే యువ నాయకుడు శేషేంద్ర కవిత్వాన్ని తన ఉపన్యాసంలో ఉటంకించార'ని 'ది హిందూ'లో చదివా. అతను ఉటంకించిన వాక్యాలివి...

"నా అవయవాలకు నీచంగా వంగే భంగిమలు తెలియవు... నేను సత్యాగ్రహిని"

"సత్యం నా గుండెల్లో బద్దలవుతున్న అగ్నిపర్వతం... సత్యం నా గుండెల్లో గర్జిస్తున్న జలపాతం"

"నేను అంతా కలిపి పిడికిలి మట్టే కావచ్చు... కానీ గొంతు ఎత్తితే ఒక దేశపు జెండాకు ఉన్నంత పొగరు ఉంది"

"సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చుని మొరగదు... తుఫాన్ ఒకడికి చిత్తం అనడం ఎరగదు... పర్వతం ఎవ్వడికీ సలాం చేయదు"..

**ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరిగిన తర్వాత నేను, ప్రిన్సెస్ ఇస్రా వంటి అనేక రాజ కుటుంబాల వారసులతో మాట్లాడాను. అందరూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ విజయాల పట్ల ఎంతో సంతోషంగా ఉన్నారు. పవన్ తన స్వప్నాలకు సాకారం చేసుకుంటారని ఆశిస్తున్నా. త్వరలోనే ఆయనను జ్ఞాన్‌భాగ్‌లో కలుసుకొనే అవకాశం వస్తుందని ఆకాంక్షిస్తున్నా.**

ఆధునిక కవితా ప్రపంచంలో శేషేంద్రది ఒక అత్యుతన్నత స్థానమని అందరికీ తెలుసు. ఆ కవిత్వాన్ని పవన్ ఆకళింపు చేసుకొని.. దానిని ప్రజల వద్దకు సమయోచితంగా చేర్చటం నాకు ఆనందం కలిగించింది. వెంటనే ఆయన అడ్రస్సు తీసుకొని... శేషేంద్ర కవిత్వాన్ని ఉటంకించినందుకు అభినందిస్తూ ఒక ఉత్తరం రాశాను. శేషంద్ర రాసిన కొన్ని పుస్తకాలు పంపాను. ఆ తర్వాతి కాలంలో అనుకుంటా... శేషేంద్ర కవితా పుస్తకాన్ని ఆయన పునఃముద్రించారు. దీనికి అవసరమైన ధన సాయం ఆయనే చేశారని కొందరు చెప్పారు. శేషేంద్రపై ఎంతో అభిమానం లేకపోతే పుస్తకాన్ని పునఃముద్రించటానికి అవసరమైన ధనాన్ని పవన్ కల్యాణ్ ఎందుకు ఇస్తారు? ఈ విషయం నాకు ఆనందం కలిగించింది.

ఇక్కడ ఇంకో విషయం చెబుతాను. సాధారణంగా రాజకీయ నాయకులు చాలా విషయాలు పట్టించుకోరు. వాటిలో ప్రజల నుంచి వచ్చే ఉత్తరాలు ప్రధానమైనవని నా నమ్మకం. కానీ పవన్ నాకు కృతజ్ఞతలు చెబుతూ ఒక ఉత్తరం రాశారు. 'ఇజం' అనే పుస్తకాన్ని కూడా పంపించారు. ఈ తరహా సంస్కారం ఉన్న వ్యక్తులు ఈ మధ్య కాలంలో అరుదుగా కనిపిస్తున్నారు. నేను పవన్‌తో ఎప్పుడూ మాట్లాడలేదు. కలవలేదు. కానీ మొన్న జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగాలను చాలా జాగ్రత్తగా విన్నాను. వాటిలో ఒక స్వాప్నికత ఉంది. ఆదర్శం ఉంది. భవిష్యత్తు కోసం ఒక ఆరాటం ఉంది. ప్రజల ఆశయాల పట్ల అవగాహన.. ఆర్ద్రత ఉన్నాయి. ఒక మంచి రాజకీయ నాయకుడికి ఇంత కన్నా గొప్ప లక్షణాలు ఏంకావాలి?

● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



## ఎనర్జీ డ్రింక్స్‌తో హార్ట్ ఎటాక్?

ఈ మధ్యకాలంలో కొద్దిగా అలసటగా ఉన్నా ఎనర్జీ డ్రింక్స్‌ను తాగేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఎనర్జీ డ్రింక్స్ వల్ల కలిగే లాభాల గురించి వచ్చే ప్రకటనలు కూడా చాలా ఆకర్షణీయంగా ఉండటంతో యువత వీటి వైపు ఆకర్షితులవుతున్నారు. అయితే తాజాగా అమెరికన్ హార్ట్ అసోసియేషన్ చేసిన కొన్ని అధ్యయనాలలో ఎనర్జీ డ్రింక్స్ తాగటం వల్ల హార్ట్ ఎటాక్‌లు వచ్చే అవకాశం ఉందని తేలింది.

సాధారణంగా ఒక క్యాన్ ఎనర్జీ డ్రింక్‌లో 80 నుంచి 500 ఎంజీల కెఫైన్ ఉంటుంది. కెఫైన్‌ను ఎక్కువగా సేవించటం వల్ల అలసట తొలగిపోయినట్లు అనిపిస్తుంది. దీనితో ఎక్కువ మంది యువత ఈ మధ్యకాలంలో ఎనర్జీ డ్రింక్స్‌ను తాగుతున్నారు. అయితే మన శరీరంలోకి ఒకే సారి ఇంత కెఫైన్ ప్రవేశిస్తే- ఆ ప్రభావం మన గుండె కొట్టుకోవటంపై పడుతుందని అధ్యయనంలో తేలింది. ఎనర్జీ డ్రింక్స్ వల్ల కేవలం గుండెకు మాత్రమే కాకుండా.. ఇతర అవయవాలకు కూడా ప్రమాదం ఉంటుంది నిపుణులు పేర్కొంటున్నారు.

**ప్రమాదాలివే..**

- ఎనర్జీ డ్రింక్స్‌లో ఎక్కువ సుగర్ ఉండటం వల్ల బరువు పెరుగుతారు. టైప్ 2 మధుమేహం వచ్చే అవకాశం కూడా ఉంది.
- ఇవి ఎక్కువ తాగితే ఆ ప్రభావం కిడ్నీలపై పడుతుంది.

**ప్రత్యామ్నాయాలివే!**

- కొన్ని సార్లు శరీరంలో ఆక్సిజన్ శాతం తగ్గటం వల్ల కూడా అలసటగా అనిపిస్తుంది. నీళ్లు తాగితే ఆ అలసట తొలగిపోతుంది.
- గ్రీన్‌టీ వల్ల శరీరానికి కొద్దిగా కెఫైన్ లభిస్తుంది. దీని వల్ల కొంత చురుకుగా పనిచేయగలుగుతారు.
- పళ్లు, డ్రైఫ్రూట్స్, పాలు, తేనెలతో చేసిన షేక్‌లను తాగటం వల్ల శక్తి లభిస్తుంది. దీనిలో ఉండే ప్రొటీన్ వల్ల ఈ శక్తి ఎక్కువ సేపు కూడా ఉంటుంది.

# అవే గొప్ప పాఠాలు

**రితికా సింగ్ అంటూనే 'గురు' సినిమా గుర్తొస్తుంది. ఆమె హీరోయిన్ కాకముందు.. కరాటేలో బ్లాక్‌బెల్ట్. కిక్ బాక్సర్‌గా రాణించింది. ఈ అమ్మడి గురించి కొన్ని విశేషాలు..**





కర్లీ హెయిర్ కథానాయిక.. జిమ్ ఫొటోలతో, వీడియోలతో అలరిస్తుంటోంది. రితికా సింగ్ పూర్తి పేరు రితికా మోహన్ సింగ్. తన ఇన్‌స్టా పేజీకి 44 లక్షల మంది ఫాలోవర్లున్నారు. తన సినిమా విశేషాలతో పాటు వ్యక్తిగత విషయాలను ఇన్‌స్టాలో షేర్ చేస్తుంది రితికా. డ్యాన్సు వీడియోలు, మాస్కుతో పబ్లిక్‌లోకి వెళ్లి రైల్లో ప్రయాణం చేయటం.. లాంటివి చేస్తుంటుంది. ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా ఉండటం.. చిన్నప్పటి నుంచే అలవడిందట.

**అందుకే బాధపడేదాన్ని..**

'మేము ముంబైలోని అవుట్‌కట్స్‌లో ఉండేవాళ్లం. కాలేజీకి వెళ్లటానికి రెండు గంటల సమయం పట్టేది మెట్రోలో. ఎక్కువగా కాలేజీ క్లాసులో కూర్చోలేకపోయేదాన్ని. ఎందుకంటే కరాటేనే నా ప్రపంచం. మూడేళ్ల వయసులో కరాటే నేర్చుకోవటం ప్రారంభించా. మా నాన్న, తాతయ్యలు కరాటే, బాక్సింగ్ ఫీల్డ్‌నుంచి వచ్చారు. కాబట్టి నాకు అబ్బింది. మా అన్న కూడా మార్షల్ ఆర్ట్స్‌లో ఉన్నారు. ఉదయాన్నే లేవటం.. వ్యాయామం చేయటం చేసేదాన్ని. మా నాన్నే నాకు స్ఫూర్తి. ఇకపోతే కాలేజీ రోజుల్లో స్పోర్ట్స్ నా మొదటి ప్రయారిటీ. నాకెవరూ స్నేహితులు కూడా ఉండేవాళ్లు కాదు. స్నేహితులు లేకపోవటం వల్ల బాధపడేదాన్ని. నేను చదువలను నెగ్లెట్ చేయలేదు. డిగ్రీ చదివా. చేసే పనిలో వందశాతం ఇవ్వాలి' అని అనుకుండేదాన్ని. రితికా సింగ్ నెగటివ్‌గా ఆలోచించే వాళ్లకు దూరంగా ఉండేదట. ఎవరూ మనకు ఏమీ చెప్పరు. తప్పులనుంచే తెలుసుకోవాలి. జీవితానుభవాలకు మించిన పాఠాలు ఉండవంటూ చెబుతుంది. అప్పుడప్పుడూ.. మోటివేషన్ స్పీకర్‌గా తన జీవిత విశేషాలను విద్యార్థులకు చెబుతుంటుందీమె.

**అలా సినిమాల్లో అవకాశం..**

'బాక్సింగ్ చేస్తుంటే నటుడు మాధవన్ గారు చూశారు. ఆయన రిఫరెన్స్‌తో 'ఇరుద చుట్రు' అనే బాక్సింగ్ నేపథ్యం కథలో నటించా. అనుకోకుండా సినిమాల్లోకి వచ్చాను' అంటుంది రితికా సింగ్. ఈ తమిళ సినిమా తెలుగులో 'గురు' పేరుతో రీమేక్ అయింది. విజయ్ సేతుపతితో ఓ సినిమాలో నటించింది. ఆ తర్వాత లారెన్స్ 'శివలింగ, 'నీవెవరు', 'ఓ మై కాదవులే' చిత్రాల తర్వాత 'ఇన్‌కార్' అనే హిందీ చిత్రంలో నటించింది. ముంబైలో పుట్టి పెరిగిన రితికా దక్షిణాది సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం తమిళ స్టార్ రజనీకాంత్ 'వెట్టయాన్' షూటింగ్‌లో ఉంది. 'స్టోరీ ఆఫ్ థింగ్స్' వెబ్ సిరీస్‌లో గతేడాది నటించింది. మిక్స్‌డు కిక్ బాక్సింగ్‌లో పతకాలే కాకుండా.. తొలి చిత్రంతోనే ఉత్తమ నటిగా జాతీయ అవార్డు అందుకుంది. 'సినిమాల్లో ఎంత బిజీగా ఉన్నా. నిద్ర, వేళకు తినటం మర్చిపోను. ఎందుకంటే ఫిట్‌గా ఉండాలంటే ప్రణాళిక ఉండాలి. ఎంత బిజీగా ఉన్నా కనీసం పదిహేను నిముషాలు వర్కవుట్స్ చేయందే కుదరదు' అంటుంది రితికా సింగ్.

# విలక్షణ కెరీర్‌కు వీలుకల్పించే లెదర్ టెక్నాలజీ

మనం పెట్టుకునే బెల్ట్, ఉపయోగించే బ్యాగ్, వేసుకునే చెప్పులు చాలావరకు తోలు ఉత్పత్తులు. జాగ్రత్తగా వినియోగించుకుంటే చాలా కాలం మన్నిక కలిగి ఉంటాయి. నిజానికి ఒక జంతువుకు సంబంధించిన తోలు లేదంటే చర్మం మూడు రోజులకే కుళ్ళిపోయి నాశనమవుతుంది, వాసన వస్తుంది. దాన్ని అలా కానివ్వకుండా రసాయనాలు/ వెజిటబుల్ మెటీరియల్‌తో సంరక్షించి, ఉత్పత్తికి అనువైనదిగా మార్చడం మొదలుకుని తుది ఉత్పత్తి వరకు యావత్తు వ్యవహారాలపై అవగాహన కలిగించేదే లెదర్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత కోర్సులు ఉన్నాయి.




తెలంగాణ - హైదరాబాద్‌లో మాత్రమే గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ఉంది. మెహదీపట్నం నుంచి గచ్చిబౌలి వెళ్లే దారిలోని రాయదర్గ వద్ద దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ఏఐసీటీఈ ఆమోదంతో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌కు అనుబంధంగా ఆరంభమైంది. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తోంది.

- లెదర్ గూడ్స్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా మూడు యూనివర్సిటీల కోటా అమలవుతుంది. ఎస్ఎస్‌సీ(టెన్త్) ఉత్తీర్ణులు ఇందులో చేసేందుకు అర్హులు. ఈ కోర్సులో చేరేందుకు గరిష్ఠ వయోపరిమితి అంటూ ఏమీ లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది. ఈ రెండు కోర్సుల బోధనకు అవసరమైన సదుపాయాలన్నీ ఉన్నాయి. ఫుట్‌వేర్ ఫ్యాషన్ స్టూడియో, స్మార్ట్ తరగతి గదులు, అర్హతలకు తోడు అనుభవం ఉన్న ఫ్యాకల్టీ, డిజిటల్ లైబ్రరీ, ఈ బుక్స్, ఈ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఆధునిక ల్యాబ్స్ - మెషినరీ, బాలురకు హాస్టల్ సదుపాయం కూడా ఉంది.

కోర్సు కాలవ్యవధి ఆరు సెమిస్టర్లు/మూడేళ్ళు. మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ కోర్సులో లెదర్‌కు సంబంధించి డిజైన్, ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ కొత్తగా మెటీరియల్ టెక్నిక్‌ను బోధిస్తారు. ముడిపదార్థంగా తోలుతో మొదలు పెట్టి ఫినిషింగ్ ప్రొడక్ట్ వరకు ప్రతి అంశాన్నీ థియరీలో భాగంగా చెబుతారు. చర్మం లేదా తోలుకు రంగు, మందం అలాగే విలువ పెంచడానికి అవసరమైన అన్ని వ్యవహారాలను ఈ కోర్సులో చేరిన విద్యార్థులు చదువుకోవాలి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలోనే ప్రాక్టికల్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అలవడతాయి. ఇండస్ట్రీ రెడీగా విద్యార్థులు తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలనుబట్టి నెలకు స్టయిపెండ్‌గా లభిస్తుంది.

దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిదాస్, రీబాక్, నైక్, హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి. ఫుట్‌వేర్ డిజైనింగ్, లెదర్ గూడ్స్ డిజైనింగ్, ప్రొడక్షన్ ఆఫ్ ఫుట్‌వేర్, ప్రొడక్షన్ ఆఫ్ లెదర్ గూడ్స్, ప్రొడక్షన్/టానింగ్ ఆఫ్ లెదర్, టెస్టింగ్ అండ్ క్వాలిటీ కంట్రోల్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. మూడు నుంచి అయిదేళ్ళ అనుభవంతో ఆంత్రప్రెన్యూర్లుగానూ మారవచ్చు. సొంతంగా యూనిట్ పెట్టుకోవచ్చు. డిప్లొమాతోనే కొందరు విద్యార్థులు విదేశాల్లోని బహుళ జాతి సంస్థల్లో చేరుతున్నారు. ముఖ్యంగా చైనా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఉపాధి పొందుతున్నారు.

డిమాండ్ అధికంగా ఉండటంతో కొందరు డిప్లొమా పూర్తి చేయకున్నప్పటికీ, కేవలం వ్యక్తిగత సంబంధాలతో కొద్దిపాటి జ్ఞానంతోనే జాబ్స్ పొందుతుండటం విశేషం.

**ఉన్నత చదువులు:** లెదర్ టెక్నాలజీలో డిప్లొమాతోనే చదువు ఆపేయనవసరం లేదు. ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.

## దిక్సూచి DIKSUCHI

### సింగరేణిలో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

ఖాళీలు 272

జాబ్ కార్నర్

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టులు

1. మేనేజ్‌మెంట్ ట్రయినీ(మైనింగ్), ఈ2 గ్రేడ్: **139**
2. మేనేజ్‌మెంట్ ట్రయినీ(ఎఫ్ అండ్ ఎ), ఈ2 గ్రేడ్: **22**
3. మేనేజ్‌మెంట్ ట్రయినీ(పర్సనల్), ఈ2 గ్రేడ్: **22**
4. మేనేజ్‌మెంట్ ట్రయినీ(ఐఈ), ఈ2 గ్రేడ్: **10**
5. జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **10**
6. మేనేజ్‌మెంట్ ట్రయినీ(హైడ్రో- జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్: **2**
7. మేనేజ్‌మెంట్ ట్రయినీ(సివిల్), ఈ2 గ్రేడ్: **18**
8. జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **3**
9. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్: **30**

- నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు

10. సబ్-ఓవర్సీస్ ట్రయినీ(సివిల్), టిఅండ్ ఎస్ గ్రేడ్-సి: 16

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్), సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎంఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంబీబీఎస్, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

**వయసు:** గరిష్ఠంగా 30 ఏళ్లు మించకూడదు. జీడీఎంవో పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయో సడలింపు ఉంటుంది.

**ఎంపిక ప్రక్రియ:** రిక్రూట్‌మెంట్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 19

**వెబ్‌సైట్:** scclmines.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/wdmtJDHలో చదవండి.

## వర్కింగ్ స్టిల్‌తో ఉస్తాద్



పవన్‌కల్యాణ్; డైరెక్టర్ హరీశ్ శంకర్ కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. శ్రీలీల ఇందులో కథానాయికగా నటిస్తున్నారు. శనివారం డైరెక్టర్ హరీశ్ శంకర్ ఈ సినిమా వర్కింగ్ స్టిల్‌ను విడుదల చేశారు.

**మొక్కు తీర్చుకున్న సాయితేజ్**

తన మేనమామ పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన సందర్భంగా హీరో సాయిదుర్గాతేజ్ తిరుమల వెళ్లి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. సాయిదుర్గాతేజ్, అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేసిన విషయం తనకు తెలియదని ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో నిహారిక కొణిదెల అన్నారు



## పవన్‌కు బహుమతి

పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచి.. ఇటీవలే ఉప ముఖ్యమంత్రి హోదానూ దక్కించుకున్నారు పవన్‌కల్యాణ్. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక ఆయన తన అన్నయ్య చిరంజీవి ఇంటికి వెళ్లారు. అక్కడ చిరంజీవి సతీమణి సురేఖ పవన్‌కు విలువైన మాంట్‌బ్లాంక్ పెన్నును బహుమతిగా ఇచ్చారు. "తెలుగు ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తావని ఆశిస్తూ.. ఆశీర్వదిస్తున్నాం" అని చిరంజీవి, సురేఖ అన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి, సురేఖ, అన్నా లెజినోవా, పవన్ కలసి ఫొటో దిగారు.

## 'గరం గరం'




నాని సరికొత్త పాత్రలో నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డివివి దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29న సినిమా విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'గరం గరం' అంటూ సాగే ఈ పాటను విశాల్ దద్లానీ ఆలపించారు. సహపతి భరద్వాజ్ లిరిక్స్ అందించగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు.

## 'భైరవ యాంథమ్'



ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 ఏ.డీ' నుంచి ఓ ప్రోమో సాంగ్ విడుదలైంది. 'భైరవ యాంథమ్' అని సాగే ఈ పాటను భారతదేశపు అతిపెద్ద పాటగా మేకర్స్ తెలిపారు. 21 సెకండ్స్ పాటూ సాగిన ఈ ప్రోమో సాంగ్‌ను పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే ఆలపించారు. పూర్తి పాటను నేడు విడుదల చేయనున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈనెల 27న విడుదలవుతోంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే, దిశాపటాని కథానాయికలు.

## ఆగస్టులో ఇస్మార్ట్



రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఇది 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ.

## ప్రేక్షకులు షాక్ అవుతారు



'నా జీవితంలో మరిచిపోలేని సినిమా 'ఏ'. 26 ఏళ్ల క్రితం ఈ సినిమా విడుదలవుతున్నప్పుడు ఎంత ఉత్సాహంగా ఉన్నానో, ఇప్పుడూ అదే ఉత్సాహంతో ఉన్నాను. ఈ నెల 21న ఈ చిత్రాన్ని తెలుగులో రీ రిలీజ్ చేస్తున్నాం. థియేటర్లలో 'ఏ' సినిమాను చూసి ఇప్పటి ప్రేక్షకులు షాక్ అవుతారు' అని కన్నడ హీరో ఉపేంద్ర అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఏ' చిత్రాన్ని నిర్మాత లింగం యాదవ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ శనివారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో ఉపేంద్ర పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి చేతుల మీదుగా...



సదన్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వం వహిస్తున్నారు, పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ "ఇటువంటి ఫీల్ గుడ్ చిత్రాలు తీస్తున్నందుకు చిత్రబృందాన్ని అభినందిస్తున్నాను. ఈ మూవీ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అని చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీ: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ.

## ఇక రాజకీయాల జోలికి వెళ్లను



ఇక నుంచి తాను రాజకీయ ప్రేరేపిత కథాంశాలతో సినిమాలు చేయనని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల చుట్టూ అల్లుకున్న వివాదాస్పద అంశాలతో పలు సినిమాలు చేస్తూ వార్తల్లో నిలిచారు వర్మ. ఇప్పుడు ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఆయన తోక ముడిచినట్లు కనిపిస్తోంది. తన సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాజకీయాలపై సినిమాలు చేయడం మానుకుంటున్నాను. ఇక నుంచి దేవుళ్లపై సినిమాలు చేస్తాను అని చెప్పారు.

## ఈ విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది



సుధీర్‌బాబు నటించిన లేటెస్ట్ చిత్రం 'హరోంహర'. మాళవిక శర్మ ఇందులో హీరోయిన్‌గా నటించారు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సుబ్రమణ్యం.జి, సుమంత్ నాయుడు.జి మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా కథ వినగానే తండ్రీ కొడుకుల సెంటిమెంట్, కథానాయకుడి పాత్ర నన్ను బాగా ఆకర్షించాయి. వెంటనే సినిమాను నిర్మించడానికి ఒప్పుకున్నా. ఈ సినిమా విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది. విడుదలైన అన్ని చోట్లా థియేటర్లు నిండిపోవడం చూసి ఎంతో ఆనందంగా ఉంది. మంచి సినిమా తీశామని ప్రేక్షకులు, మిత్రులు, ఇండస్ట్రీ పెద్దలు ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. ప్రస్తుతం మూడు నాలుగు చిత్రాలు నిర్మిస్తున్నాం. వాటి గురించి త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తాము" అని చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PySH7NE లో చదవండి.

## అన్ని చోట్లా ఆదరిస్తున్నారు



కన్నడ హీరో యశ్ నటించిన ఓ చిత్రం తెలుగులో 'రాజధాని రౌడీ' పేరుతో విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'మా 'రాజధాని రౌడీ' చిత్రాన్ని 94 కేంద్రాల్లో విడుదల చేశాం. అన్ని చోట్లా మంచి వసూళ్లు వస్తున్నాయి. ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు.



## జగన్ నివాసం వద్ద అక్రమ కట్టడాల కూల్చివేత

బంజారాహిల్స్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హైదరాబాద్ నివాసం వద్ద అక్రమ కట్టడాలను జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం కూల్చివేశారు. బంజారాహిల్స్ లోటస్‌పాండ్ వద్ద ఫొటోగ్రాఫర్స్ కాలనీని ఆనుకొని జగన్మోహన్‌రెడ్డి నివాసం ఉంది. ఇంటి వెలుపల ఉన్న ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తూ సెక్యూరిటీ సిబ్బంది కోసం నిర్మాణాలు చేపట్టారు. మొదట తాత్కాలికంగా ఏర్పాటు చేసినప్పటికీ ఆ తరువాత నాలుగు గదులు నిర్మించారు. అయితే, ఇవి అక్రమ నిర్మాణాలని తేల్చిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం శనివారం కూల్చివేతలు చేపట్టారు.

## బెజవాడ నుంచి ముంబైకి డైలీ ఫ్లైట్

విజయవాడ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దేశ వాణిజ్య రాజధాని ముంబైకి విజయవాడ నుంచి డైలీ ఫ్లైట్ ప్రారంభమైంది. విజయవాడ(గన్నవరం) అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శనివారం రాత్రి 7.15 గంటలకు 180 సీట్ల సామర్థ్యం కలిగిన ఎయిర్‌ఇండియా ఎయిర్ బస్ విమానం బయలుదేరింది. ముంబై నుంచి విజయవాడకు 153 మంది ప్రయాణికులు రాగా విజయవాడ నుంచి 142 మంది ప్రయాణికులు ముంబైకి బయలుదేరారు. ముంబై విమాన సర్వీసును మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని సంయుక్తంగా ప్రారంభించారు.

# జగన్ ఇంటిగుట్టు!

## సర్కారు సొమ్ముతో ఏపీ మాజీ సీఎం జల్సా.. తాడేపల్లి ప్యాలెస్‌పై కోట్లు కుమ్మరింత

- రాజభోగాలకు ఐదేళ్లలో 45 కోట్ల ఖర్చు
- జీవోలు, ఇతర ఆదేశాలన్నీ రహస్యం
- సొంత ఇంటినే క్యాంప్ ఆఫీసుగా మార్చి.. హెలీప్యాడ్, ఆలయాల సెట్టింగ్‌లు
- ఫర్నీచర్ ఇవ్వలేదని గతంలో కోడెలకు వేధింపులు
- ఇప్పుడు జగన్ పదవి పోయినా వదలని వైనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీ ముఖ్యమంత్రి హోదాలో జగన్ తాడేపల్లిలోని సొంత ఇంటినే క్యాంపు ఆఫీసుగా మార్చేసుకొని సకల రాజభోగాలు అనుభవించారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో సకల ఆడంబరాలు, వసతులు కల్పించుకున్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన ఏడాదే.. 2019లో రోడ్లు భవనాల శాఖ ఆయన ఇంటికి అదనపు ఏర్పాట్ల పేరిట రూ.18 కోట్లు ఖర్చు పెట్టింది. 2020లో మరో రూ.10 కోట్లు కుమ్మరించింది. వీవీఐపీ సెక్యూరిటీ ఏర్పాట్ల పేరిట ఆర్అండ్‌బీతో అడ్డగోలుగా నిధులు ఖర్చు పెట్టించారు. జగన్ ఆ నిధుల విడుదలకు సంబంధించిన జీవోలను బయటకు రాకుండా చేశారు. 2022లో రూ.8 కోట్లు, 2023లో రూ.6 కోట్లు, ఆయన హయాంలో చివరి ఏడాది 2024లో రూ.3.50 కోట్లు ఖర్చు చేయించారు. మార్గదర్శకాలు, నిబంధనలను తుంగలో తొక్కిన అధికారులు.. సీఎం ఇంటిచుట్టూనే మరో ప్రపంచాన్ని నిర్మించే ప్రయత్నం చేసేందుకు ఐదేళ్ల కాలంలో మొత్తం రూ.45.54 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిసింది. ఇందులో 15 కోట్ల వ్యయానికే ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం..!

### అడ్డగోలుగా ఖర్చు

తాడేపల్లిలో జగన్ నివాసం కొత్తదే. ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడే.. 2019 ఎన్నికలకు ముందు గృహప్రవేశం చేశారు. అధికారంలోకి వచ్చాక తన ఇంటినే క్యాంపు ఆఫీసుగా మార్చుకున్నారు. ఆ తర్వాత మూడు రాజధానుల డ్రామాను తెరమీదకు తీసుకొచ్చారు. అమరావతిలోని సచివాలయానికి వెళ్లకుండానే ఇంటినే ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో)గా మార్చేశారు. జగన్ ఆదేశాలతో ఆయన నివాసం, క్యాంపు ఆఫీసు, దాని పరిసరాలను అభివృద్ధి చేసేందుకు నాటి ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, ఇంజనీరింగ్ అధికారులు అత్యుత్సాహం కనబరిచారు. నిజానికి ముఖ్యమంత్రి నివాసానికి రక్షణ నిమిత్తం, ఇతర అవసరాల పేరిట ఎంత ఖర్చు చేయాలన్నదానికి నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. ఆర్అండ్‌బీలో చక్రం తిప్పిన ఓ ఉన్నతాధికారి జగన్ సేవలో తరించిపోయారు. బిల్డింగ్ విభాగంలో ఉన్న సొమ్మంతా ఊడ్చేశారు. ఆయన స్థానంలో ఆర్అండ్‌బీకి వచ్చిన ఓ జూనియర్ అధికారి కూడా జగన్ సేవలో తరించేందుకు తాపత్రయపడ్డారు. ఆలయాలు, సినిమా తరహా సెట్టింగ్‌ల కోసం అవసరమైన నిధులు ఇప్పించి, స్వామిభక్తి చాటుకున్నారు. జగన్ ఇంటికి అదనపు హంగులు, రక్షణ ఏర్పాట్లు, సెట్టింగ్‌ల పేరిట ప్రభుత్వం 45.54 కోట్లపైనే ఖర్చు పెట్టింది.



తాడేపల్లిలో జగన్ నివాసం చుట్టూ నిర్మించిన భారీ ఇనుపకంచె

### ఖర్చుల పద్దు ఇదీ

- జగన్ ఇంటికి అల్యూమినియం కిటికీలు, దృఢమైన చెక్క తలుపుల ఏర్పాటుకు రూ.73 లక్షలు ఖర్చు చేశారు
- 2019లో 3.66 మీటర్ల రహదారి(పొడవు 1.33 కి.మీ.)ని 10 మీటర్లు వెడల్పు చేసేందుకు 5 కోట్లు ఖర్చు చేశారు.
- జగన్ రక్షణ కోసం ఆయన ఇల్లు, పరిసరాల్లో తదుపరి చర్యలకు 1.89 కోట్లు ఖర్చుపెట్టారు. ఇంటి వద్దే ప్రత్యేక హెలీప్యాడ్, దానికి ఫెన్సింగ్, అప్రోచ్ రోడ్ నిర్మాణం కోసం రూ.40 లక్షలు, హెలీప్యాడ్ వద్ద గార్డ్ రూమ్, ఇతర సదుపాయాల కోసం రూ.13.50 లక్షలు, సీఎం నివాసం వద్ద పర్మినెంట్ బ్యారికేడింగ్ ఏర్పాటుకు రూ.75 లక్షలు, పోలీస్‌బారెక్ సదుపాయాలకోసం రూ.30 లక్షలు, సెక్యూరిటీ పోస్ట్, సెక్యూరిటీ గేట్లు, క్యాబిన్‌ల ఏర్పాటుకు రూ.31 లక్షలు ఖర్చు చేశారు.
- అత్యాధునిక విద్యుత్తు వ్యవస్థ, లైట్లు, సీసీటీవీలు, యూపీఎస్ ఏర్పాటుకు రూ.3.63 కోట్లు ఖర్చు పెట్టారు. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్, హెచ్‌టీ లైన్, ఆధునిక లైటింగ్ సిస్టమ్‌కు అదనంగా మరో 97 లక్షలు కేటాయించారు.
- అత్యాధునిక ఏసీల ఏర్పాటుకు కోటిన్నర ఖర్చు పెట్టారు. ఇంటా బయట లైటింగ్ కోసం రూ.11.50 లక్షలు ఖర్చు చేశారు. హైదరాబాద్ సచివాలయంలోని ఎల్‌బ్లాక్‌లో ఉన్న యూపీఎస్‌ను జగన్ ఇంట్లో ఏర్పాటు చేశారు. ఇందుకు 11 లక్షలు ఖర్చు చేశారు.
- ప్రజాదర్బార్ ఏర్పాటు పేరిట రూ.82.50 లక్షలను ఇతర అవసరాలకు ఖర్చు పెట్టినట్లు తెలిసింది.
- క్యాంపు ఆఫీసులో తాత్కాలికంగా పీవీసీ రూఫ్స్, మొబైల్ టాయిలెట్స్, కూలర్ల కోసం రూ.22.50 లక్షలు ఖర్చుపెట్టారు.
- భద్రతకు వ్యాకట్టర్ ఏర్పాటు పేరిట ప్రైవేటు భూమిని సేకరించారు. ఈ భూమికి పరిహారంగా 3.25 కోట్లను విడుదల చేశారు.
- జగన్ ఇంటి చుట్టూ ఉన్న రహదారిని విస్తరించడం కోసం పేదల ఇళ్లను ఖాళీ చేయించారు. వారికి పరిహారం కింద రూ.7.67 కోట్లను ఆర్అండ్‌బీతో ఇప్పించారు.
- క్యాంపు ఆఫీసులో అత్యాధునిక వీడియో కాన్ఫరెన్స్, టెలీ కాన్ఫరెన్స్ సిస్టమ్‌ల కోసం 3.45 కోట్లు ఖర్చు పెట్టారు. 85 అంగుళాల ఓఎల్ఈడీ టీవీల కొనుగోలుకు కోటిన్నరదాకా ఖర్చుపెట్టినట్లు తెలిసింది.
- ఐప్యాడ్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర డిజిటల్ ఎక్విప్‌మెంట్ కోసం మరో 45 లక్షలు ఖర్చు చేసినట్లు బిల్లులు పెట్టినట్లు సమాచారం.
- రూ.4.5 కోట్ల విలువైన సోఫాలు, కుర్చీలు, రిక్లైనర్‌లు, లాంజ్ సోఫాలు సమకూర్చారు.
- క్యాంపు ఆఫీసు పరిధిలో జరిగే సమావేశాల కోసం 1.37 కోట్ల విలువైన టేబుల్స్ ఫర్నీచర్‌ను కొనుగోలు చేశారు.
- ఆలయాల సెట్టింగ్‌కు రూ.1.45 కోట్లు, ఇతర ఆర్భాటాల పేరిట 1.67 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం.

### ఇంకా జగన్ అధీనంలోనే

జగన్ ఇప్పుడు అధికారంలో లేరు. కనీసం ఆయన ప్రతిపక్షనేత కూడా కాదు. సాధారణ ఎమ్మెల్యేగానే ఉండాల్సిన పరిస్థితి. ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ సాలరీస్, పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్‌క్వాలిఫికేషన్స్ యాక్ట్-1953 ప్రకారం జగన్ తన ఇంట్లో, క్యాంపు ఆఫీసులో ప్రభుత్వ ఖర్చుతో సమకూర్చుకున్న చరాస్తులన్నింటిని వెనక్కి ఇచ్చేయాలి. ఎన్నికల ఫలితాలు వచ్చి పది రోజులు గడుస్తున్నా ప్రభుత్వ ఆస్తితోనే జగన్ జల్సా చేస్తున్నారు.

### ప్రభుత్వం.. గుట్టు విప్పుతుందా?

జగన్ తాడేపల్లి ప్యాలెస్‌పై గత ప్రభుత్వం రూ.45.54 కోట్లు ఖర్చు చేసిందని అంచనా. ఈ లెక్క మరింత ఉండే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం ఈ విషయంపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు. సీఎంవోకు నిబంధనల ప్రకారం ఎంత ఖర్చు చేయాలి? జగన్ ప్రభుత్వంలో ఎంత ఖర్చు పెట్టారు? అన్న విషయాన్ని నిగ్గుతేల్చాలంటున్నారు. ఈ దిశగా కొత్త ప్రభుత్వం అడుగులు వేస్తుందా?

ప్రత్యేక హెలీప్యాడ్, ఆలయాల సెట్టింగ్‌లు, కళ్లు చెదిరే ఫర్నీచర్, అత్యంత విలాసవంతమైన సదుపాయాలు.. అబ్బో చూడటానికి ఇంద్రభవనాన్నే తలపిస్తుంది. ఇందుకోసం చేసిన ఖర్చు రూ.45.54 కోట్లు. మొన్నటి దాకా పేదల పక్షపాతినని పదేపదే చెప్పుకొన్న మాజీ సీఎం జగన్ తాడేపల్లి ప్యాలెస్ కోసం ప్రభుత్వ ఖజానా నుంచి చేసిన ఖర్చు ఇదీ. ఆ ఖర్చుతో ముఖ్యమంత్రికి విలాసవంతమైన శాశ్వత భవనాన్ని నిర్మించవచ్చు. అప్పటి అధికారులు అక్కడున్న పేదలను తరిమేసి.. జగన్‌కు రాజభోగాలు కల్పించారు.

జగన్‌కు ఇప్పుడు కనీసం ప్రతిపక్ష నేత హోదా కూడా లేదు. ఆయన ఓ ఎమ్మెల్యే మాత్రమే. అయినా రాజభోగాలను అనుభవిస్తూనే ఉన్నారు. గతంలో మాజీ స్పీకర్ కోడెల సొంతానికి ఫర్నీచర్ వాడుకున్నారని ఆయన్ను వేధించారు. మరి ఇప్పుడు ప్రభుత్వ ఖర్చుతో జల్సా చేస్తున్న జగన్‌ను ఏం చేయాలి?

### కోడెలకో నీతి, జగన్‌కో నీతా?

ఆంధ్రప్రదేశ్ స్పీకర్‌గా పనిచేసిన డాక్టర్ కోడెల శివప్రసాదరావుకు నాటి ప్రభుత్వం ఆయన ఇంటికి, ఆఫీసుకు ఫర్నీచర్ సమకూర్చింది. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన తన ఇంట్లో ఉన్న ఫర్నీచర్‌ను తీసుకెళ్లాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. అధికారులు కావాలని దాన్ని పక్కనపెట్టి ప్రభుత్వ ఫర్నీచర్‌ను సొంత అవసరాలకు వాడుకున్నారంటూ కోడెలపై నిందలు మోపారు. వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ వేధింపులతో ఆయన ఎంతో మనోవేదనకు గురయ్యారు. తీవ్ర మనోవేదనకు గురైన కోడెల ఆత్మహత్య చేసుకున్నారు. మరి జగన్ విషయంలో ప్రభుత్వ నిబంధనలు వర్తించవా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

---

# ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

## వరుడు కావలెను



★ కమ్మ /కుల పట్టింపు లేదు/డైవర్సీ / 42y/5'6"/ డాక్టర్ రేడియాలజిస్ట్ / వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 9885394654 AJH-001955

★ రెడ్డి 2nd / వయస్సు : 34y / ఎత్తు 5.5 / Business కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు. ఫోన్ : 9121300377 AJH-14390

★ కుల ఆస్తి పట్టింపు లేదు/ కమ్మ / 43y/5'6"/ లేట్ మ్యారేజ్ / MD General Medicine / మంచి ఆస్తి గల అందమైన వధువుకు వరుడు కావలెను. వాట్సాప్ : 9666832809 AJH-001955

★ చౌదరి / 54y / విడో / 5'5" /PG / Govt Job VRS / బిజినెస్ / సొంత ఇల్లు, పొలాలు / మంచి ప్రాపర్టీ / వెల్ సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్ : 8498936945 AJH-002416

★ 55y / రెండవ పెళ్ళి / విడో/ Fair / Govt. Job / పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ / వెల్ సెటిల్డ్ / ఎలాంటి బాదరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల / ఆస్తి పట్టింపు లేదు) ఫోన్:7995376608 AJH-002416

★ బ్రాహ్మణ / 27y / 5'3" / B.Com కంప్యూటర్ / వధువుకు తగిన జాబ్ / బిజినెస్ / పురోహితం వరుడు కావలెను. ఫోన్ : 9701743336 AJH-14390

★ CNB;కాపు / 26y / 5'6" / B.Tech ★ కమ్మ / 26y / 5'8" / MCA ★ రెడ్డి / 25y / 5'5" / M.Tech / స్థిరాస్తి, ఎకరాల మాగాణి కల అందమైన వధువులకు వరులు కావలెను. ఫోన్ : 6304448107 AJH-14390

★ రెండవ పెళ్ళి / 41y, పిల్లలు లేని అందమైన సాంప్రదాయ వధువుకు తగిన వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. ఫోన్ : 9701605100 AJH-14390

★ చౌదరి / కుల పట్టింపు లేదు / 48y / Central Govt. Job / వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. (2వ సంబంధం అయినా ఒకే) ఫోన్: 9676896226 AJH-14390

★ కుల పట్టింపు లేదు/ 41y/5'5"/ విడో / Govt. Job / మంచి జీతం / ఓన్ హౌస్ / వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9618637613 AJH-001955

★ కుల పట్టింపు లేదు/ 58y / Widow / G.V.T. / R.T.D. / Good Salary / Own House / Rents/20,000 / మనీ సపోర్ట్ చేయబడును. / పిల్లలు లేరు / ఏలాంటి బాదరబందీలేని వధువుకు వరుడు కావలెను. సెల్ : 9160070872 AJH-002465

★ రెడ్డి : మొదటి సంబంధం, 27 సం॥ రాలు, సొంత ఇల్లు, డిగ్రీ, ప్రైవేట్ టీచర్, ఒక బ్రదర్ మ్యారీడ్, వ్యవసాయం ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. సెల్ : 96526 24005 AJL_186373

★ కుల పట్టింపు లేదు/ 42y / Widow / Telangana /Warangal, Hyderabad / Govt. Employee / Own House / Lands / పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. సెల్ : 8374476725 AJH-002465

★ మున్నూరు కాపు : 1st మ్యారేజ్, 5.3, 26 సం॥ రాలు, ప్రైవేట్ టీచర్, ఫాదర్ బిజినెస్, సొంత ఇల్లు ఉన్న వధువుకు వరుడు కావలెను. సెల్ : 96526 24005 AJL_186373

★ కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ Widow / ఆంధ్ర / 48y / Family Pensioner / Own Business / One Girl Settled / Own House / Agriculture Lands అందమైన వధువుకు వరుడు కావలెను. సెల్ : 7286976721 AJH-002465

★ బలిజ : 26 సం॥ రాలు, డిగ్రీ, 5.3, ప్రైవేట్ జాబ్, ఫాదర్ ఫార్మర్,సొంత ఇల్లు, స్థిరాస్తి ఉన్న అమ్మాయికి ఏదైనా జాబ్ (లేదా) బిజినెస్ వరుడు కావలెను. సెల్ : 96526 24005 AJL_186373

★ బ్రాహ్మణ/ 27y/5'4"/1st మ్యారేజ్ / Qua: 10th Class / Father & Mother Late. పౌరోహితం also OK, 2nd మ్యారేజ్ also OK. వరుడు కావలెను. సెల్ : 7207552927 AJH-002465

★ శ్రృంగేరి బ్రాహ్మణ : హైదరాబాద్, 1994, 30 వయస్సు, 5.3, B.Tech, మంచి జీతం, ఫాదర్ మరియు మదర్ గవర్నమెంట్ జాబ్ ఒక సిస్టర్ మ్యారీడ్ గా ఉన్న అమ్మాయికి సాంప్రదాయ వరుడు కావలెను (సాఫ్ట్‌వేర్ (or) గవర్నమెంట్ జాబ్) సెల్ : 96526 24005 AJL_186373

★ బ్రాహ్మణ/ 30y/1st మ్యారేజ్ / Height 5'4"/ Qua: Inter / Pvt. Job / 2nd మ్యారేజ్ also OK. పౌరోహితం also OK వరుడు కావలెను. సెల్ : 8978808244 AJH-002467

★ ముదిరాజ్, పద్మశాలి : 26 సం॥రాలు, డిగ్రీ, 5.4., మొదటి సంబంధం. అలాగే 34 సం॥రాలు, రెండవపెళ్లి, సొంత ఇల్లు ఉన్న అమ్మాయిలకు వరులు కావలెను. సెల్ : 96526 24005 AJL_186373

★ కుల పట్టింపు లేదు/ 40-60y/Widow / ఆంధ్ర / పిల్లలు లేరు / Gvt. Job / Good Salary / సొంత ఇల్లు / పొలాలు/ అందమైన వధువులకు వరులు కావలెను. సెల్ : 9989350417 AJH-002467

★ రజక : 1st మ్యారేజ్, 25 సం॥రాలు, 10 To డిగ్రీ వరకు. అలాగే రెండవపెళ్లి, 32 సం॥రాలు ఉన్న వారికి ఏదైనా జాబ్ (లేదా) బిజినెస్ వరులు కావలెను. సెల్ : 96526 24005 AJL_186373

★ కుల పట్టింపు లేదు/ 45y/Widow / ఆంధ్ర / గైనకాలజిస్ట్ / ఫ్యామిలీ పెన్షనర్ / పిల్లలు లేరు / ఆస్తి ప్రసక్తి లేదు / అందమైన వధువుకు వరుడు కావలెను. (Hyd OK). సెల్ : 7075948409 AJH-002467

★ గౌడ్స్ : 1st మ్యారేజ్, డిగ్రీ, 5.3, సొంత ఇల్లు, ఫాదర్ బిజినెస్ బ్రదర్ ప్రైవేట్ జాబ్, ఒక సిస్టర్ మ్యారీడ్‌గా ఉన్న అమ్మాయికి సాంప్రదాయ వరుడు కావలెను. సెల్ : 96526 24005 AJL_186373

★ కుల పట్టింపు లేదు / విడో / 58 Y / / బ్యాంక్ మేనేజర్ / మంచి జీతం / ఓన్ బిజినెస్ / రెంట్స్ / లాండ్స్ / మంచి ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. సంప్ర. 85559 47283 AJB-193

★ చౌదరి : మొదటి సంబంధం, (10 To B.Tech) Age (25-35) ప్రైవేట్ జాబ్, సాఫ్ట్‌వేర్ జాబ్ ఉన్న అమ్మాయిలకు ఏదైనా జాబ్ (లేదా) బిజినెస్ వరులు కావలెను. సెల్ : 96526 24005 AJL_186373

## వధువు కావలెను



★ ఎరుకల / S.T./48y/ బిజినెస్ రెండో పెళ్ళి వరుడికి పిల్లలు ఏ బాధర బందీలేని మిడిల్ క్లాస్ వధువు కావలెను. 40 నుండి 48 వయస్సులో ఉండాలి. కుల ప్రసక్తి లేదు. నో బ్రోకర్స్. డైరెక్ట్ ఫోన్ : 7075184890 / 9948605439 AJH-001955

★ కమ్మ / కుల పట్టింపు లేదు /31y/ బిజినెస్ / మంచి సంపాదన / సొంత ఇల్లు / వరంగల్ వరునికి వధువు కావలెను. తెలంగాణా వారికి ప్రాధాన్యత. నో బ్రోకర్స్. డైరెక్ట్ - 7989676749 AJH-002416

★ కాపు /53y/5'8"/ USA సిటిజన్ / B.Tech & MS (USA)/ మంచిజీతం / మంచి ప్రాపర్టీ / సొంత ఇల్లు గల వరునికి 35-48 వయసు గల ఇండియా / USA వధువు కావలెను. వివరాలతో డైరెక్ట్ - 8555961146 AJH-002416

★ 55 Yrs / కాపు /సొంత ఇల్లు, ఉన్నతమైన వృత్తి, వెల్ సెటిల్డ్ గల వరుడికి, 2వ పెళ్ళి, Widows అయిన వధువు కావలెను. ఫోన్ నం. 9032098529 AJH-002416

★ 36 సం.ల బిజినెస్ చేస్తున్న వరుడికి రెండోవ / విడో పిల్లలు ఉన్న వారు అయిన సంప్రదించండి. డౌరీ, కుల ప్రసక్తి లేదు. ఫోన్ : 6301943220, 9866724586 AJH-97535

★ మాల, 28 Years, B.Tech (IIT), MBA, IIM, Good Salary / వరుడికి తగిన వధువు కావలెను. No Brokers Ph: 9493285326 AJH-14390

★ 2వ పెళ్ళి / M.Com/C.Govt. Sr. మేనేజర్ / బ్యాంక్ ఆఫ్ బరోడా / మంచి జీతం / 5'7" ఎత్తు / 35 సం.ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. Ph: 9963757612 AJH-14390

★ గౌడ / B.Tech/C.Govt. GST ఇన్‌స్పెక్టర్ / మంచి జీతం / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. Ph: 7032058965 AJH-14390

★ బలిజ / 35y/ డిగ్రీ, జాబ్ - కంప్యూటర్ ఆపరేటర్ @ మెడికల్ ఏజెన్సీ, కరీంనగర్‌లో స్వంత గృహం వున్న అబ్బాయికి తగిన వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్ : 9440378427 AJH-002467

★ కాపు, 40 సం., 5'10, రెడ్ కలర్, QUL : M.S. ఆస్ట్రేలియా, నో జాబ్, 5 అపార్ట్‌మెంట్స్ గల వరుడుకు, ఎడ్యుకేటెడ్ / జాబ్ గల, విజయవాడ పరిసర ప్రాంత వధువు కావలెను. సెల్ : 98481 98655 AJB-194706

★ BC/67+Y/Rtd/Dy.MRO/PM. 50K Above / వెల్ సెటిల్డ్ అయిన వ్యక్తికి ఏ బాధ్యతలు లేని ఆంధ్ర ప్రాంతానికి చెందిన 50 to 55 సం.లు BC వధువు కావలెను. సెల్ : 81796 33700 AJC-188768

★ డైరెక్ట్ కాంటాక్ట్: కులపట్టింపులేదు /50y/ 5.6 ఎత్తు / చామనిఛాయరంగు/ ప్రైవేట్ జాబ్ వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్ : 9000025991. AJM-167800

### కళ్యాణ వేదిక

★Free Registration హిందు / మాల / మాదిగ క్రిస్టియన్ వధూవరుల Online స్వయంవరం July 14th Bhavani Matrimony, Hyd. Ph: 9704656103 /9533608887 AJH-002416

★ కాపు మ్యారేజ్ లింక్స్ : 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ (స్త్రీలకు ఫ్రీ). ఫోన్ : 7702526428 AJH-002416

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matchesకై సంప్ర: Ph: 9704656103 / 9533608887 (Whatsapp) AJH-002416

★ శ్రీ లలితా వివాహ వేదిక. కేవలం సేవా భావంతో అన్ని శాఖల బ్రాహ్మణ వధువు, వరుల సంబంధముల కొరకు ఉచితంగా నడుపుతున్న సంస్థ శ్రీమతి గౌరిదేవి సంప్ర. 94410 51100 AJB-111

★ వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 14-07-2024న ఉ. 9 గంటలకు 65వ అర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ. 2 గంటలకు 20వ పునర్వి వివాహ పరిచయ వేదిక. విజయవాడ KBN కాలేజీలో జరుగును. మరియు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కూడా కలదు. సంప్ర. 99895 00130 AJB-285

## ధాత్రి జగద్ధాత్రి మ్యారేజ బ్యూరో

(అన్ని కులముల వారికి)

Head Office : Vijayawada, Contact : 96422 15777
B.O : HYD : 96429 57888

### వధువు కావలెను

కాపు : 30, 5.8 DM (Neurology) 25Cr ★ 30, 5.6, MD (Dermotology) 30Cr ★ 32, 5.9, MD (GM) 10Cr ★ 96422 15777

రెడ్డి : 33, 6, MCH (Surgical Oncology) 130Cr ★ 33, 5.11, MBBS, MD (GM) JIPMER, DM (Cardiology) AIIMS (Delhi) 36Cr ★ 34, 5.10, MS (GS) 10Cr ★ 96429 57888

కమ్మ : 30, 5.9, MS (Ortho) 50Cr ★ 30, 5.11, MCH (Surgical Oncology) 50Cr ★ 30, 5.11, DM (Neounotology) 50Cr ★ 96422 15777

పద్మశాలి : 36, 6, MD (GM) 20Cr ★ 33, 5.11, MS (GS) 10Cr ★ 33, 6, MD (Pediatrics) 15Cr ★ 96429 57999

పద్మనాయక వెలమ : 30, 6, MD (Radiology) 25Cr ★ 29, 5.11, MD (GM) 15Cr ★ 31, 5.9, MS (Ortho) 15Cr ★ 96422 15777

కాపు : 32, 5.9, M.Tech, 25 LPA, 5Cr ★ 33, 6, M.Sc (Computers) 18LPA, 6Cr ★ 33, 5.8, B.Tech, 12LPA, 3Cr ★ 96429 57888

రెడ్డి : 32, 5.7, MS, MBA (Stanford) 300K, 20Cr ★ 33, 6, MS, 170K, 15Cr ★ 30, 5.9, MS, 180K, 10Cr ★ 96422 15777

యాదవపూజ : 30, 5.10, B.Tech, 16LPA, 10Cr ★ 31, 5.11, B.Tech, MBA, 25LPA, 5Cr ★ 32, 5.9, B.Tech, 10LPA, 8Cr ★ 96429 57888

ST కొండ దొర : 33, 5.11, IIT (KGP) MBA (IIM) CAL, 60LPA, 20Cr ★ 32, 5.6, IIT (KGP) 18LPA, 5Cr ★ 32, 5.10, IIT (Guhawati) 25LPA, 10Cr ★ 96422 15777

Munuru కాపు : 31, 5.7, MS, 120K, 10Cr ★ 32, 5.10, MS, 140K, 5Cr ★ 32, 5.11, MS, 160K, 10Cr ★ 96429 57888

కమ్మ Divorce: 33, 5.11, MCH (Surgical Oncology) 150LPA, 20Cr ★ 33, 6, MCH (Neuro Surgeon) 60LPA, 25Cr ★ 36, 5.9, DM (Medical Oncology) 200Cr ★ 96422 15777

### వరుడు కావలెను

కాపు : 27, 5.6, MS (OBG) 10Cr ★ 30, 5.4, MS (Optamalogy) 10Cr ★ 32, 5.6, MD (Cardiology) 20Cr ★ 96422 15777

కాపు : 29, 5.6, MD (GM) 18LPA, 5Cr ★ 31, 5.7, MD (GM) 20 LPA, 10Cr ★ 31, 5.7, MD (GM) 20LPA, 10Cr ★ 96429 57888

కాపు : 29, 5.2, MD (Dermotology) 12LPA, 15Cr ★ 28, 5.2, MD (Radiology) 15LPA, 10Cr ★ 29, 5.3, MS (OBG) 36LPA, 20Cr ★ 96422 15777

రెడ్డి : 32, 5.5, MS (OBG) 36LPA, 10Cr ★ 32, 5.7, MS (OBG) 25LPA, 15Cr ★ 31, 5.7, MD (Radiology) 28LPA, 10Cr ★ 96429 57888

కొప్పుల వెలమ : 33, 5.6, MD (Radiology) 36LPA, 5Cr ★ 33, 5.5, MD (GM) 30LPA, 10Cr ★ 31, 5.4, MS (OBG) 36LPA, 10Cr ★ 96422 15777

దేవంగ : 29, 5.6, MS (OBG) 25Cr ★ 28, 5.5, MS (OBG) 20Cr ★ 30, 5.7, MS (OBG) 30LPA, 20Cr ★ 96429 57888

పద్మనాయక వెలమ : 30, 5.6, MS, 200K, 20Cr ★ 30, 5.5, MS, 160K, 10Cr ★ 31, 5.7, MS, 140K, 15Cr ★ 96422 15777

కాపు : 26, 5.4, MS, 100K, 10Cr ★ 28, 5.5, MS, 110K, 15Cr ★ 29, 5.7, MS, 160K, 10Cr ★ 96429 57888

Munuru కాపు : 25, 5.5, B.Tech, 10LPA, 25Cr ★ 28, 5.6, B.Tech, 18LPA, 5Cr ★ 29, 5.3, B.Tech, 9LPA, 10Cr ★ 96422 15777

యాదవ పూజ : 26, 5.4, B.Tech, 10LPA, 2Cr ★ 27, 5.5, B.Tech, 8PLA, 5Cr ★ 25, 5.3, B.Tech, 1Cr ★ 96429 57888

గౌడాస్ : 27, 5.5, B.Tech, 10LPA, 12Cr ★ 28, 5.5, B.,Tech, 12LPA, 10Cr ★ 32, 5.4, B.Tech, 18LPA, 5Cr ★ 96422 15777

కమ్మ Divorce: 32, 5.5, MD (Radiology) 36LPA, 60Cr ★ 32, 5.7, MS (OBG) 100Cr ★ 34, 5.6, MS (OBG) 36LPA, 80Cr ★ 96429 57888

## స్నేహ మ్యారేజ్ బ్యూరో

(కమ్మవారికి మాత్రమే)

HEAD OFFICE : #11-160, గడ్డం రత్తయ్యవీధి, Near Time హాస్పిటల్, అశోక్‌నగర్, VJA-7: 99481 29111, 99481 29222
Branch Office : Hyderabad : 87905 99799, 99510 32647 Khammam, Vizag, Rajhamundry
www.snehamarriage.com. 87905 99799 (whatsapp)

### వరుడు కావలెను

కమ్మ : 27, 5.5, MBBS Jipmer, MD GM 30 LPA 50Cr ★ 27, 5.2, MD Pediatrics, 20 LPA, 15 Cr ★ 27, 5.5, MD Radiology 50 Cr ★ 99481 29111

కమ్మ : 27, 5.5, MD GM 50Cr ★ 27, 5.5, MD Pediatrics 60 LPA 15Cr ★ 27, 5.2, MD GM 20Cr ★ 27, 5.6, MD Radiology 20 LPA 30 Cr ★ 89782 17967

కమ్మ : 27, 5.5, MD Pediatrics, 20 LPA 30Cr ★ 27, 5.4, MD GM 18 LPA 15 Cr ★ 27, 5.4, MS OBG 15Cr ★ 98488 97778

కమ్మ : 28, 5.5, MS OBG 36 LPA, 25 Cr ★ 28, 5.4, MS OBG 20 LPA 15Cr ★ 28, 5.6, MBBS Osmania MD Radiology 30 LPA 20Cr ★ 96666 58789

కమ్మ : 28, 5.6, MS OBG IVF 36 LPA 100Cr ★ 28, 5.4, MS OBG 50Cr ★ 28, 5.7, MD GM 15 Cr ★ 95420 16659

కమ్మ : 29, 5.7, MDGM 40 LPA, 70Cr ★ 28, 5.3, MD GM 25 LPA, 15 Cr ★ 28, 5.2, MS OBG Osmania, 40 LPA 15 Cr ★ 98487 54267

కమ్మ : US Citizen Doctors : 29, 5.4, MD Internal Medicine 350K, 40Cr ★ 29, 5.6, MD Internal Medicine 300K, 50Cr ★ 29, 5.5, MD Internal Medicine 350K 20Cr ★ 99481 29222

కమ్మ : US Citizen : 27, 5.4, MD Internal Medicine 50Cr ★ 28, 5.6, MD Internal Medicine 40Cr ★ 28, 5.6, MD Internal Medicine 50Cr ★ 98488 97778

కమ్మ : Australia Citizen Doctor : 28, 5.7, MD Australia 200K$ AU Dollors 100Cr ★ 27, 5.4, MD Australia 50Cr ★ 29, 5.6, MD Australia 150K$ AU Dollors 30Cr ★ 96666 97778

కమ్మ : 27, 5.6, MDS 20Cr ★ 27, 5.5, MDS 30Cr ★ 28, 5.2, MDS 15 Cr ★ 27, 5.6, MDS 10Cr ★ 89782 17967

కమ్మ Divorce : 29, 5.7, MD GM 25 LPA 50Cr ★ 31, 5.5, MD Radiology 30 LPA 60 Cr ★ 33, 5.3, MDGM 36 LPA 50Cr ★ 99481 29222

కమ్మ Divorce : 34, 5.5, MD Radiology 30 LPA 50Cr ★ 35, 5.4, MS OBG IVF 36 LPA 20Cr ★ 34, 5.6, MS OBG 40 LPA, 30Cr ★ 98487 54267

కమ్మ : 26, 5.5, MS 120K, 20Cr ★ 26, 5.5, MS 140K 30Cr ★ 27, 5.7, MS 160K 30Cr ★ 27, 5.5 MS 160K 40Cr ★ 99481 29111

కమ్మ : 27, 5.7, MS 150K 50Cr ★ 27, 5.2, MS 140K 25 Cr ★ 27, 5.4, MS 172 K 35 Cr ★ 27, 5.6, MS 140K 15Cr ★ 99510 32647

కమ్మ : 28, 5.3, MS 195K 20Cr ★ 28, 5.5, MS 160K 15 Cr ★ 28, 5.8 MS 185K 30Cr ★ 28, 5.5, MS 180K 25 Cr ★ 99481 29222

కమ్మ : 28, 5.4, MS 140K 20Cr ★ 28, 5.7, MS 150K, 25Cr ★ 28, 5.5 MS 175K 15Cr ★ 28, 5.4, MS 110K 10Cr ★ 89782 17967

కమ్మ : 28, 5.3, MS, 160K, 100Cr ★ 28, 5.6, MS 165K 20Cr ★ 28, 5.6, MS 140K, 15Cr ★ 29, 5.9 MS 160K 15 Cr ★ 98488 97778

కమ్మ India MS : 32, 5.6, MS 2000 Cr ★ 32, 5.7, MS Stanford 1000Cr Property కలిగిన Own Business చేయుచున్న అందమైన వధువుకు Well settled Business వరుడు కావలెను ★ 96666 58789

కమ్మ : 28, 5.6, IIT BNG 30 LPA 100Cr ★ 32, 5.6, IIT KGP MBA IAM, CAL, 50 LPA, 100Cr ★ 30, 5.4, IIT Mumbai MBA IAM, AHMA 80 LPA 100Cr ★ 89782 17967

కమ్మ : 27, 5.7, M. Arch 40 LPA 50Cr ★ 27, 5.9, M. Arch 36 LPA 50Cr ★ 29, 5.6, M.Arch 36 LPA 50Cr ★ 99481 29222

కమ్మ : 27, 5.6, B.Tech, MBA 20 LPA 15Cr ★ 28, 5.6, B.Tech, MBA 20 LPA 15 Cr ★ 28, 5.3, B.Tech MBA 18 LPA 10Cr ★ 98487 54267

కమ్మ : 26, 5.4, B.Tech, 100Cr ★ 26, 5.3, B.Tech, 5 Cr ★ 26, 5.5, B.Tech, 100Cr ★ 26, 5.2, B.Tech 50Cr ★ 99481 29111

కమ్మ : 29, 5.4, B.Com 50Cr ★ 29, 5.6, BA 20Cr ★ 30, 5.8, B.Com, 40Cr ★ 30 5.4, B.Com, 100Cr ★ 99510 32647

కమ్మ : 26, 5.4, B.Tech MBA 150Cr ★ 28, 5.7, B.Tech 150Cr ★ 29, 5.2, B.Tech, MBA 100Cr ★ 30, 5.6, B.Tech, MBA 100Cr ★ 95420 16659

### వధువు కావలెను

కమ్మ : 27.6", MCH (Surgical Oncology) 200Cr ★ 28, 5.8, MCH (Neuro Surgeon) 100Cr ★ 28, 5.10, DM (Cardiology) 30Cr ★ 96666 58789

కమ్మ : 28, 5.7, MCH (Surgical Oncology) 40Cr ★ 29, 5.8, DM (Neurology) 20Cr ★ 29, 5.10, MD (GM) 40Cr ★ 98488 97778

కమ్మ : 29, 5.10, DM (Cardiology) 20Cr ★ 30, 6.0, MCH (Surgical Oncology) 100Cr ★ 30, 5.10, MS Ortho, 50Cr ★ 89782 17967

కమ్మ : 30, 5.10, MS, GS, 30Cr ★ 30, 5.9, MS, GS, 100Cr ★ 30, 5.11, DM (Neounotology) 50Cr ★ 96666 58789

కమ్మ : 30, 6.0, MS, Ortho, 100Cr ★ 30, 6.0, MS, GS, 25Cr ★ 30, 6.0, MD (Pulmonology) 50Cr ★ 99481 29222

కమ్మ : 30, 5.10, Anthesia, 100Cr ★ 31, 5.0, MS (Ortho) 30Cr ★ 31, 5.11, MS (GS) 35Cr ★ 98487 54267

కమ్మ : 30, 5.11, MCH (Surgical Oncology) 150Cr ★ 31, 5.10, DM (Nephrology) CMC, 50Cr ★ 31, 5.11, MCH (Plastic Surgeon) 40Cr ★ 99481 29111

కమ్మ : 30, 6.1, MDS, 20 LPA, 15Cr ★ 31, 6.2, MDS, 25LPA, 30Cr ★ 32, 5.11, MDS, 12LPA, 10Cr ★ 32, 5.7, MDS, 18 LPA, 15Cr ★ 99481 29111

కమ్మ US Citizen : 29, 5.11, MD (Internal Medicine) 1000Cr ★ 30, 6, MD (Internal Medicine) 260K, 70Cr ★ 32, 6, MD (Internal Medicine) 400K, 150Cr ★ 99510 32647

కమ్మ MD (Australia) : 29, 60, MD in Australia, 100Cr ★ 31, 5.10, DM (Cardiology) 50Cr ★ 32, 5.11, MCH (Neuro Surgeon) 30Cr ★ 95420 16659

కమ్మ Divorce : 33, 5.8, DM (Cardiology) 100Cr ★ 35, 6.0, DM (Medical Oncology) 100Cr ★ 36, 5.9, DM (Medical Oncology) 100Cr ★ 96666 58789

కమ్మ : 30, 6.1, MS (Stanford) 400K, 1500Cr ★ 26, 5.11, MS Onward 270K, 25Cr ★ 28, 5.9, MS, 270K, 20Cr ★ 98488 97778

కమ్మ : 28, 6.1, MS, 170K, 25Cr ★ 28, 6, MS, 150K, 10Cr ★ 28, 5.9, MS, 120K, 25Cr ★ 28, 5.11, MS, 160K, 20Cr ★ 99481 29222

కమ్మ : 28, 5.11, MS, 140K, 15Cr ★ 29, 5.9, MS, 250K, 10Cr ★ 29, 5.11, MS, 130K, 15Cr ★ 28, 5.11, MS, 150K, 15Cr ★ 96666 58789

కమ్మ : 29, 5.8, MS, 160K, 40Cr ★ 30, 5.7, MS, 180K, 35Cr ★ 30, 5.10, MS, 160K, 30Cr ★ 30, 6, MS, 180K, 15Cr ★ 98488 97778

కమ్మ Indian (MS) : 30, 6.1, MS (Stanford) 1500Cr ★ 31, 5.8, MS, 300Cr Own Business Hyd, Bengalore ★ 89782 17967

కమ్మ : 30, 5.10, CA, 35 LPA, 30Cr ★ 31, 6, CA, 18LPA, 15Cr ★ 32, 6.1, CA ICW, 20LPA, 15Cr ★ 32, 6.1, CA, 30LPA, 20Cr ★ 99481 29222

కమ్మ : 27, 5.10, IIT (Gowhathi) 40 LPA, 20Cr ★ 29, 6, IIT (Gowhathi) 80 LPA, 50Cr ★ 30, 5.11, IIT (Delhi) 40 LPA, 20Cr ★ 98487 54267

కమ్మ : 31, 6, IIT KGP, MBA (IIM) AHMA, 1Cr LPA, 40Cr ★ 31, 5.11, IIT (Conpur) MBA (IIM), CAL, 50LPA, 20Cr ★ 33, 5.11, IIT (Mumbai) MBA (IIM) CAL, 50LPA, 50Cr ★ 99481 29111

కమ్మ : 31, 5.7, B.Tech, MBA, 20LPA, 20Cr ★ 33, 5.8, IIT (Chennai) 56 LPA, 15Cr ★ 32, 6, IIT, MBA (IIM) KOZ, 50LPA, 20Cr ★ 89782 17967

## గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9703618806, 9985921386

# బిజినెస్

హైదరాబాద్ ● ఆదివారం 16 జూన్ 2024

# ఐటీ రూటు మారింది..

## ప్రాంగణ నియామకాలకు బదులు ఆఫ్ క్యాంపస్ హైరింగ్‌కు కంపెనీల మొగ్గు

### నియామకాల సంఖ్య కన్నా నాణ్యతపై దృష్టి



దేశీయ ఐటీ కంపెనీలు ఫ్రెషర్ల నియామకాల విషయంలో వ్యూహం మార్చాయని స్టాఫింగ్ సేవల కంపెనీలంటున్నాయి. వీరిని ప్రాంగణ నియామకాలకు బదులు ఆఫ్ క్యాంపస్ ద్వారా రిక్రూట్ చేసుకుంటున్నాయి. నియామకాల సంఖ్య కంటే నాణ్యతపై కంపెనీలు దృష్టి సారిస్తున్నాయని.. దాంతో ఫ్రెషర్ల ఆఫ్ క్యాంపస్ హైరింగ్ కనీసం 30-50 శాతం పెరిగిందని, ఈ ఏడాది మరింత పుంజుకోవచ్చని స్టాఫింగ్ సంస్థలు పేర్కొన్నాయి. ఓపెన్ మార్కెట్ నుంచి హైరింగ్ ఈ ఏడాది 20-30 శాతం పెరగవచ్చని, ప్రస్తుతం 15-20 శాతం ఫ్రెషర్ల నియామకాలు ఆఫ్ క్యాంపస్ ద్వారానే జరుగుతున్నాయని టీమ్‌లీజ్ డిజిటల్ బిజినెస్ హెడ్ కృష్ణ విజ్ అన్నారు. గత ఏడాదితో పోలిస్తే, ఐటీ రంగంలో ప్రాంగణేతర నియామకాలిప్పటికే 50 శాతం పెరిగాయని, ఇది 125-150 శాతం వరకు పెరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఈలిట్మస్ ఎవాల్యువేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ అసీమ్ మార్వాహ అన్నారు.

**వ్యయాలు తగ్గించుకునేందుకే..**

ప్రస్తుతం ఐటీ సేవల డిమాండ్‌పై నెలకొన్న అనిశ్చితి ఇంకా తొలగిపోలేదు. ఈ నేపథ్యంలో ఆన్ బెంచ్ ఉద్యోగుల జీతభత్యాల వ్యయాలు తగ్గించుకునేందుకు ఐటీ కంపెనీలు ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల అవసరాల మేరకు ప్రాంగణేతర నియామకాలపైనే ప్రధానంగా దృష్టిసారించాయని స్టాఫింగ్ కంపెనీల ప్రతినిధులు అంటున్నారు. అంతేకాదు, చాలా ఐటీ కంపెనీలు ప్రాంగణ నియామకాల్లో భాగంగా ఇప్పటికే ఆఫర్ లెటర్లను జారీ చేసిన వారిని ఉద్యోగంలో చేర్చుకునే ప్రక్రియనూ వాయిదా వేస్తూ వస్తున్నాయన్నారు. అలాగే, ఉన్న ఉద్యోగులనే సమర్థవంతంగా ఉపయోగించుకోవడంతో పాటు వారు మరో కంపెనీకి వలస పోకుండా కాపాడుకోవడంపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నాయి. ఈ ఏడాది ఇంజనీరింగ్ పూర్తి చేసుకుంటున్న 15 లక్షల మంది ఉద్యోగుల్లో కనీసం 10 శాతం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగం దక్కించుకోవచ్చని స్టాఫింగ్ కంపెనీలు తొలుత అంచనా వేశాయి. కానీ, ఈ వాటా 5-6 శాతానికి పరిమితం కావచ్చని అంచనా.

**అనిశ్చితిలో 10,000 మంది ఫ్రెషర్ల భవితవ్యం**

విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ఐటీ దిగ్గజాలతో పాటు జెన్సార్ టెక్నాలజీస్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ వంటి మధ్య స్థాయి ఐటీ కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా నియమించుకున్న 10,000కు పైగా ఫ్రెషర్లను ఇంకా ఉద్యోగంలో చేర్చుకోలేదని ఐటీ ఎంప్లాయీ యూనియన్ ఎన్ఐటీఈఎస్ అంటోంది. ఈ విషయంలో ఇప్పటికే పలువురు ఫ్రెషర్ల నుంచి తమకు ఫిర్యాదులందాయని ఎన్ఐటీఈఎస్ అధ్యక్షుడు హర్‌ప్రీత్ సింగ్ సలూజా అన్నారు.

కంపెనీ వ్యాపార అవసరాలకు అనుగుణంగా మిమ్మల్ని ఉద్యోగంలో చేర్చుకోబోయే తేదీపై 3-4 వారాల ముందుగానే సమాచారం అందిస్తామని ఇన్ఫోసిస్ ఈ మధ్యనే వీరికి ఈ-మెయిల్ పంపినట్లు తెలిసింది. విప్రో అయితే రెండేళ్ల క్రితం ఆఫర్ లెటర్లు జారీ చేసిన వారినీ ఇంకా ఉద్యోగంలో చేర్చుకోలేదు. టాప్ ఐటీ కంపెనీలు 2022లో ఆఫర్ లెటర్లు జారీ చేసిన వారిలో కనీసం 3-5 శాతం ఫ్రెషర్లను ఇంకా ఉద్యోగంలో చేర్చుకోవాల్సి ఉందని కృష్ణ విజ్ అన్నారు.

### ప్రతిభ ఆధారంగా ప్యాకేజీ

*ప్రస్తుతం ఐటీ రంగంలో ఫ్రెషర్లకు రూ.3-3.5 లక్షల స్థాయిలో వార్షిక పారితోషికం లభిస్తోంది. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ఐటీ కంపెనీలు మాత్రం ఫ్రెషర్లందరికీ ఒకే స్థాయి పారితోషికానికి బదులు వారి ప్రతిభ ఆధారంగా భిన్న ప్యాకేజీలను ఆఫర్ చేస్తున్నాయి. టాలెంట్ టెస్ట్‌ల ద్వారా అత్యంత ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ.6.5 లక్షల నుంచి రూ.12 లక్షల వరకూ వార్షిక పారితోషికాన్ని అందించేందుకు కంపెనీలు ముందుకొస్తున్నాయి. ఉదాహరణకు, టీసీఎస్ పలు కేటగిరీల్లో ఫ్రెషర్లను నియమించుకుంటోంది. అందులో నింజా విభాగం వారికి రూ.4.5-6.5 లక్షల వరకు వార్షిక ప్యాకేజీ ఆఫర్ చేస్తోంది. డిజిటల్ కేటగిరీలో రూ.7-8 లక్షలు, ప్రైమ్ విభాగం వారికి రూ.9 లక్షలు, అంతకు పైగా పారితోషికం అందిస్తోంది.*

**నిపుణులు దొరక్క కంపెనీలు సతమతం**

*ఐటీ రంగంలో ఆధునిక సాంకేతికత నైపుణ్యం కలిగిన వారు లభించక కంపెనీలు సతమతం అవుతున్నాయి. సరైన నిపుణులు దొరక్క టీసీఎస్‌లో 80,000 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. దాంతో కంపెనీ కాంట్రాక్టర్లపై ఆధారపడాల్సి వస్తోందని టీసీఎస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్ గ్లోబల్ ఆపరేషన్స్ హెడ్ అమర్ షెట్యే తెలిపారు. ప్రస్తుత ఉద్యోగుల నైపుణ్యాలు ప్రాజెక్టుల అవసరాల మేరకు లేకపోవడం, జాబ్ మార్కెట్లోనూ ఆధునిక సాంకేతిక నిపుణులు అందుబాటులో లేకపోవడంతో ఐటీ కంపెనీలు ఉద్యోగుల నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నాయి.*

## ఏడేళ్లు.. ఏడు లక్షల విక్రయాలు

**» అమ్మకాల్లో టాటా నెక్సాన్ రికార్డు**



ముంబై: టాటా మోటార్స్.. ఎస్‌యూవీ నెక్సాన్ అమ్మకాల్లో రికార్డులు సృష్టిస్తోంది. ఏడేళ్ల కాలంలో నెక్సాన్ విక్రయాలు ఏడు లక్షల యూనిట్ల మైలురాయిని చేరుకున్నట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. టాటా మోటార్స్ 2017లో టాటా నెక్సాన్‌ను మార్కెట్లోకి విడుదల చేసినప్పటి నుంచి విక్రయాల్లో రికార్డులను తిరగరాస్తూ వస్తోందని పేర్కొంది. 2021 నుంచి 2023 వరకు వరుసగా మూడేళ్లపాటు నెక్సాన్ దేశంలో అత్యధికంగా అమ్ముడుపోయిన ఎస్‌యూవీగా ఉంది. డిజైన్, రక్షణ, కంఫర్ట్ విషయాల్లో నెక్సాన్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దటంతో కస్టమర్లను ఆకట్టుకోగలిగినట్లు టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవాత్సవ తెలిపారు. కాగా నెక్సాన్‌ను తీసుకువచ్చి ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా మోడల్, వేరియంట్‌ను బట్టి రూ.లక్ష వరకు బెనిఫిట్స్‌ను అందిస్తున్నట్లు వివేక్ చెప్పారు.

## ఐపీఓకి గోదావరి బయోరిఫైనరీస్

న్యూఢిల్లీ: ఇథనాల్, బయో ఆధారిత కెమికల్స్ తయారీ కంపెనీ గోదావరి బయోరిఫైనరీస్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూలో భాగంగా కొత్తగా రూ.325 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను జారీ చేయటంతో పాటు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు 65.27లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.



**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 72,550 ▲ | 66,500 ▲ | 95,600 ▲ |
| ముంబై | 71,866 ▲ | 65,829 ▲ | 87,833 ▼ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| 16వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 490 | విజయవాడ | 480 |
| వరంగల్ | 492 | గోదావరి | 475 |
| చిత్తూరు | 573 | విశాఖపట్నం | 500 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 139 | గోదావరి | 145 |
| వరంగల్ | 139 | విజయవాడ | 145 |
| కరీంనగర్ | 139 | గుంటూరు | 145 |
| మహబూబ్‌నగర్ | 139 | ఒంగోలు | 145 |
| కర్నూలు | 139 | చిత్తూరు | 152 |
| విశాఖపట్నం | 136 | | |

## ఈఎంఐలు మరింత ప్రియం

**» అన్ని కాలపరిమితి వడ్డీ రేట్లను 0.10 శాతం పెంచిన ఎస్‌బీఐ**

**» ఈ నెల 15 నుంచే అమల్లోకి..**

న్యూఢిల్లీ: అన్ని కాలపరిమితుల రుణాలపై నిధుల సమీకరణ వ్యయ ఆధారిత వడ్డీ రేటు (ఎంసీఎల్ఆర్)ను 0.10 శాతం పెంచుతున్నట్లు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ వెల్లడించింది. ఈ నెల 15 (శనివారం) నుంచే పెంపు అమల్లోకి వచ్చింది. దాంతో ఎంసీఎల్ఆర్ అనుసంధానిత రుణాల నెలవారీ వాయిదా (ఈఎంఐ) చెల్లింపుల భారం మరింత పెరగనుంది. ఎస్‌బీఐ ఏడాది కాల పరిమితి రుణాల ఎంసీఎల్ఆర్ రేటును 8.65% నుంచి 8.75 శాతానికి, రెండేళ్ల కాల పరిమితి రుణాల ఎంసీఎల్ఆర్‌ను 8.75% నుంచి 8.85 శాతానికి పెంచింది. మూడేళ్లకు ఎంసీఎల్ఆర్ 8.85% నుంచి 8.95 శాతానికి పెరిగింది. చాలావరకు గృహ, వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లు ఏడాది ఎంసీఎల్ఆర్‌తో అనుసంధానితమై ఉన్నాయి. అయితే, వడ్డీ పెరుగుదల బ్యాంక్ జారీచేసిన ఎంసీఎల్ఆర్ అనుసంధానిత రుణాలకు మాత్రమే వర్తిస్తుంది. రుణాల వడ్డీ రేట్లను ఎంసీఎల్ఆర్‌కు బదులు రెపో రేటు లేదా మరే ఇతర మార్కెట్ రేట్లతో అనుసంధానించాలని బ్యాంక్‌లను ఆర్‌బీఐ 2019లో నిర్దేశించింది. అప్పటి నుంచి బ్యాంక్‌లు చాలావరకు రుణాలపై వడ్డీ రేట్ల నిర్ణయానికి రెపో రేటునే ప్రామాణికంగా తీసుకుంటున్నాయి.

## బ్రైట్‌కామ్ షేర్ల ట్రేడింగ్ నిలిపివేత

**వరుసగా రెండు త్రైమాసికాల ఆర్థిక ఫలితాలు ప్రకటించనందువల్లే..**

ముంబై: దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ.. హైదరాబాద్‌కు చెందిన డిజిటల్ మార్కెటింగ్ సొల్యూషన్స్ కంపెనీ బ్రైట్‌కామ్ గ్రూప్ షేర్ల ట్రేడింగ్‌ను శుక్రవారం నుంచి నిలిపివేశాయి. జూన్ 14 నుంచి కంపెనీ షేర్ల ట్రేడింగ్‌ను నిలిపివేయనున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ గత నెల 15న ప్రకటించాయి. వరుసగా రెండు త్రైమాసికాల (2023 జూలై- సెప్టెంబరు, అక్టోబరు-డిసెంబరు) ఆర్థిక ఫలితాలను ప్రకటించడంలో కంపెనీ విఫలమైన కారణంగా క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ 2023 జూలై 11న జారీ చేసిన మాస్టర్ సర్క్యులర్‌లోని 33వ నిబంధనకు అనుగుణంగా కంపెనీపై చర్యలు చేపట్టినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలు తమ సర్క్యులర్‌లో వెల్లడించాయి. నియంత్రణ మండలి నిబంధనలను పాటించేవరకు బ్రైట్‌కామ్ గ్రూప్ షేర్ల ట్రేడింగ్‌పై సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేశాయి. అయితే, కంపెనీ షేర్ల ట్రేడింగ్‌ను రద్దు కానివ్వమని, ఈ నెల 11లోగా రెండు త్రైమాసిక ఆర్థిక ఫలితాలను విడుదల చేస్తామని బ్రైట్‌కామ్ గ్రూప్ షేర్‌హోల్డర్లకు తెలిపింది. కానీ, కంపెనీ 11న జూలై-సెప్టెంబరు త్రైమాసిక (క్యూ2) ఫలితాలను మాత్రమే ప్రకటించగలిగింది. అక్టోబరు-డిసెంబరు (క్యూ3) ఫలితాల విడుదలపై మాత్రం స్పష్టతనివ్వలేదు. దాంతో స్టాక్ ఎక్స్ఛేంజీలు ముందుగా ప్రకటించిన ప్రకారం కంపెనీ షేర్ల ట్రేడింగ్‌ను సస్పెండ్ చేశాయి.

**ఇరుక్కుపోయిన 6.56 లక్షల మంది రిటైల్ ఇన్వెస్టర్లు**

ఈ సస్పెన్షన్ కాలంలో కంపెనీ ప్రమోటర్ వాటా షేర్లను స్తంభింపజేయడంతో పాటు తన డీమ్యాట్ ఖాతాలోని ఇతర సెక్యూరిటీలను సైతం స్తంభింపజేయడం జరుగుతుందని బీఎస్ఈ తెలిపింది. ప్రస్తుతం బ్రైట్‌కామ్ గ్రూప్‌లో ప్రమోటర్‌కు వాటా 18.38 శాతంగా ఉండగా.. మిగతా 81.62 శాతం వాటా పబ్లిక్ వాటాదారుల చేతుల్లో ఉంది. పబ్లిక్ షేర్‌హోల్డర్లలో 6.56 లక్షల మంది రిటైల్ మదుపరులే. వీరి చేతుల్లో కంపెనీకి చెందిన 41.69 శాతం వాటాకు సమానమైన షేర్లున్నాయి.

# రూ.50,000 కోట్ల పెట్టుబడులు

**2030-31 నాటికి ఉత్పత్తి సామర్థ్యం రెండింతలు పెంపు**

**కొత్త గనులకు బిడ్స్, కొనుగోళ్లపై నజర్: ఎన్ఎండీసీ**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయ ముడి ఇనుప ఖనిజ ఉత్పత్తి సంస్థ ఎన్ఎండీసీ భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా రానున్న ఐదు నుంచి ఆరేళ్ల కాలంలో ముడి ఇనుప ఖనిజ ఉత్పత్తిని రెండింతలు పెంచేందుకు గాను ఏకంగా రూ.50,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఎర్నింగ్స్‌కాల్‌లో సంస్థ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. ప్రతిపాదిత పెట్టుబడులతో గనుల విస్తరణ, గనుల్లో మరింత లోతుగా తవ్వకాలు చేపట్టేందుకు అనుమతులు తీసుకోవటంతో పాటు కొత్త గనులకు బిడ్స్ దాఖలు చేయటం సహా కొనుగోళ్లు చేపట్టాలని భావిస్తోంది. వీటితో పాటు కొత్తగా స్లర్రీ పైప్‌లైన్స్ ఏర్పాటు చేయటం సహా ఇతరత్రా కార్యకలాపాలను విస్తరించాలని చూస్తోంది.

**10 కోట్ల టన్నులకు ఉత్పత్తి:** ప్రస్తుతం ఎన్ఎండీసీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 4.5 కోట్ల టన్నులుగా ఉండగా 2030-31 నాటికి రెండింతల వృద్ధితో 10 కోట్ల టన్నులకు చేర్చాలని చూస్తున్నట్లు ముఖర్జీ వెల్లడించారు. ఇందుకోసం రూ.50,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా పెట్టుబడులకు సంబంధించి రానున్న ఆరేళ్ల కాలానికి ప్రత్యేకంగా రోడ్‌మ్యాప్‌ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.2,500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ముఖర్జీ తెలిపారు. ఆ తర్వాతి సంవత్సరాల్లో ఏటా రూ.8,000 కోట్ల నుంచి రూ.9,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే ఏడాది కాలంలో ఈ పెట్టుబడులకు సంబంధించిన అన్ని అనుమతులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత పెట్టుబడుల్లో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు రూ.1,000 కోట్లు, స్లర్రీ పైప్‌లైన్స్‌కు రూ.10,000 కోట్లు, పెల్లెట్ ప్లాంట్స్‌కు రూ.2,000 కోట్లు, స్టాక్ యార్డుల ఏర్పాటుకు రూ.10,000 కోట్ల వరకు అవసరమవుతాయని అంచనా వేస్తున్నట్లు ముఖర్జీ చెప్పారు.

**డిమాండ్ పెరుగుతోంది:** దేశీయంగా స్టీల్‌కు డిమాండ్ పెరుగుతుండటంతో ముడి ఇనుప ఖనిజానికి అదే స్థాయిలో డిమాండ్ ఉండనుందని ముఖర్జీ తెలిపారు. ఇందుకనుగుణంగానే ఛత్తీస్‌గఢ్, కర్ణాటకల్లోని గనుల్లో ఉత్పత్తిని పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తిని 11% పెంచటం ద్వారా మొత్తం ఉత్పత్తిని 5 కోట్ల టన్నులకు, వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో 5.4 కోట్ల టన్నులకు చేర్చాలని చూస్తున్నట్లు ముఖర్జీ పేర్కొన్నారు.

# స్పోర్ట్స్

**ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు**

ఆస్ట్రేలియా x స్కాట్లాండ్ (ఉ.6. గం.)

పాకిస్థాన్ x ఐర్లాండ్ (రా.8. గం.)



స్మృతి మంధాన

## అమ్మాయిలకు 'వన్డే' సవాల్

● సౌతాఫ్రికాతో భారత్ తొలి మ్యాచ్ నేడు

మ. 1.30 నుంచి జియో సినిమా, స్పోర్ట్స్ 18లో

బెంగళూరు: వన్డే ఫార్మాట్‌లో తడబడుతున్న భారత మహిళలు మళ్లీ గాడిలో పడేందుకు చక్కని అవకాశం. ఈ నేపథ్యంలో మల్టీ ఫార్మాట్ సిరీస్‌లో భాగంగా సౌతాఫ్రికాతో ఆదివారం జరిగే తొలి వన్డేలో మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా బరిలోకి దిగనున్నారు. గత జనవరిలో సొంతగడ్డపై ఆస్ట్రేలియా చేతిలో వన్డే, టీ20 సిరీస్‌ల్లో చిత్తయిన హర్మన్‌ప్రీత్ సేన.. ఆ తర్వాత జరిగిన టీ20 సిరీస్‌లో బంగ్లాదేశ్‌ను 5-0తో ఓడించింది. అక్టోబరులో జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకొని స్వదేశంలో సౌతాఫ్రికాతో జరిగే సిరీస్‌తో జట్టులోని కొన్ని లోపాలను సరిదిద్దుకోవాలనుకొంటోంది. ఇటీవలి కాలంలో హర్మన్‌సేన ఫీల్డింగ్‌పై తీవ్ర విమర్శలు రావడంతో.. ఆ దిశగా ఎక్కువగా దృష్టిపెట్టినట్టు కోచ్ అమోల్ మజుందార్ చెప్పాడు. బ్యాటింగ్‌లో హర్మన్, స్మృతి మంధాన, షెఫాలీ వర్మ కీలకం. జెమీమా రోడ్రిగ్స్ ఫిట్‌నెస్ విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. కానీ, గాయం నుంచి కోలుకొన్న పేసర్ పూజా వస్త్రాకర్‌కు తుది జట్టులో చోటుదక్కే అవకాశాలున్నాయి. యువ వికెట్ కీపర్ ఉమా ఛెత్రీని పరీక్షించే చాన్సుంది. పేసర్ రేణుకా సింగ్‌తోపాటు స్పిన్నర్లు ఆశా శోభన, శ్రేయాంక పాటిల్‌లతో బౌలింగ్ విభాగం కొంత బలంగానే కనిపిస్తోంది. మరోవైపు 2025లో వన్డే వరల్డ్‌కప్ జరగనున్న నేపథ్యంలో ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌తో మరిన్ని వన్డే చాంపియన్‌షిప్ పాయింట్లు సాధించాలని సౌతాఫ్రికా లక్ష్యంగా పెట్టుకొంది. కెప్టెన్ లారా వొల్వార్డ్ టాప్ ఫామ్‌లో ఉండడం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం.

# వర్షార్పణం

**కెనడాతో భారత్ మ్యాచ్ రద్దు**

**గ్రూప్ 'ఎ' టాపర్‌గా సూపర్-8లోకి రోహిత్ సేన**

**టీ20 ప్రపంచకప్**



లాడర్‌హిల్: ఫ్లోరిడాలో భారీ వర్షాలు టీ20 వరల్డ్‌కప్‌ను వెంటాడుతున్నాయి. స్థానిక సెంట్రల్ బ్రోవర్డ్ రీజనల్ పార్క్ స్టేడియంలో వరుసగా రెండో మ్యాచ్ కూడా వర్షార్పణమైంది. శనివారం గ్రూప్ 'ఎ'లో భాగంగా భారత్-కెనడా జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ కనీసం టాస్ పడకుండానే ముగిసింది. శుక్రవారం యూఎస్-ఐర్లాండ్ మ్యాచ్ కూడా వర్షంతో రద్దయిన విషయం తెలిసిందే. ఈ గ్రూప్‌లో ఏడు పాయింట్లతో రోహిత్ సేన టాప్‌లో ఉండగా.. ఆతిథ్య యూఎస్ఏ ఐదు పాయింట్లతో ఆ తర్వాత స్థానంలో నిలిచింది. ఇక సూపర్-8లో ఈనెల 20న బ్రిడ్జిటౌన్‌లో అఫ్ఘాన్‌తో భారత్ తలపడనుంది. కెనడాతో ఆడాల్సిన పోరు నామమాత్రమే అయినా.. కరీబియన్ వెళ్లడానికి ముందు భారత్‌కు ఇది చక్కటి మ్యాచ్ ప్రాక్టీస్ లభించినట్టయ్యేది. వాస్తవానికి మ్యాచ్ సమయానికి వర్షం ఆగిపోయినా అవుట్ ఫీల్డ్ మాత్రం పూర్తి చిత్తడిగా మారింది. అప్పటికీ సిబ్బంది భారీ హెయిర్ డ్రయర్స్‌తో పొడిగా మార్చేందుకు ప్రయత్నించారు. అయితే ఆకాశం మేఘావృతంగా ఉండడంతో సూర్యుడి వెలుతురు కరువైంది. అటు అంపైర్లు రెండుసార్లు పరీక్షించినా ఆడేందుకు అనుకూలంగా కనిపించలేదు. దీంతో రాత్రి 9 గంటలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

**పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ**

| జట్టు | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | రన్‌రేట్ |
|---|---|---|---|---|---|---|
| భారత్ | 4 | 3 | 0 | 1 | 7 | 1.137 |
| అమెరికా | 4 | 2 | 1 | 1 | 5 | 0.127 |
| కెనడా | 4 | 1 | 2 | 1 | 3 | -0.493 |
| పాకిస్థాన్ | 3 | 1 | 2 | 0 | 2 | 0.191 |
| ఐర్లాండ్ | 3 | 0 | 2 | 1 | 1 | -1.712 |

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

### ఆటను మరిచి.. వ్యాపారంపై దృష్టి?

**గిల్‌పై క్రమశిక్షణ చర్య!**



న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో రిజర్వ్ ప్లేయర్‌గా ఉన్న భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ స్వదేశానికి రానున్నాడు. అయితే క్రమశిక్షణ చర్యల కారణంగానే అతడిపై బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుందన్న కథనాలు వెలువడ్డాయి. అమెరికాలో అడుగుపెట్టాక గిల్ జట్టుతో ఉండకుండా, ప్రాక్టీస్‌కు రాకుండా వ్యక్తిగత బిజినెస్ ప్రాజెక్ట్‌లపై ఎక్కువగా దృష్టి సారించాడని సమాచారం. పాకిస్థాన్‌తో మ్యాచ్ సమయంలోనూ ఇతర రిజర్వ్ ప్లేయర్లు రింకూ, అవేశ్, ఖలీల్ కనిపించినా.. గిల్ మాత్రం ఎక్కడా లేడు. ఈ నేపథ్యంలో కెప్టెన్ రోహిత్-గిల్ మధ్య వాగ్వాదం జరిగిందని, అందుకే రోహిత్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో అన్‌ఫాలో చేశాడని అంటున్నారు. యూఎస్‌లో మ్యాచ్‌లు ముగిశాయి కాబట్టి ఆదివారం గిల్‌తో పాటు అవేశ్ ఖాన్ స్వదేశానికి వస్తుండగా.. రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్ అక్కడే ఉండనున్నారు. మరోవైపు ఇలాంటి కథనాలు అవాస్తవమని, గిల్‌పై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.



ఫుల్‌క్రగ్

## జర్మనీ.. సూపర్ బోణీ

**యూరో చాంపియన్‌షిప్**

మ్యూనిచ్: యూరోపియన్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య జర్మనీ అద్భుత బోణీ కొట్టింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో గత టోర్నీ రన్నరప్ జర్మనీ 5-1తో స్కాట్లాండ్‌ను చిత్తు చేసింది. విర్ట్జ్ (10వ నిమిషం), ముసీలా (19), హవెర్ట్జ్ (45+1), ఫుల్‌క్రగ్ (68), కాన్ (90+3) జర్మనీ తరపున గోల్స్ చేశారు. స్కాట్లాండ్‌కు ఏకైక గోల్ అప్పనంగా లభించింది. జర్మనీ ఆటగాడు అంటోనియో రుడిగెర్ సెల్ఫ్ గోల్‌తో స్కాట్లాండ్‌కు గోల్ అందించాడు. ఇక.. ప్రత్యర్థి ఆటగాడిని మొరటుగా అడ్డుకోవడంతో స్కాట్లాండ్ డిఫెండర్ ర్యాన్ రెడ్‌కార్డ్‌కు గురయ్యాడు. దీంతో ఆ జట్టు 10 మందితోనే ఆడింది. ఇదే గ్రూప్‌లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ 3-1తో హంగేరీపై గెలిచింది. గ్రూప్-బిలో జరిగిన పోరులో స్పెయిన్ 3-0 గోల్స్ తేడాతో క్రొయేషియాపై విజయం సాధించింది.

## సఫారీలు చచ్చీ..చెడీ

**పరుగు తేడాతో విజయం**

**చెమటలు పట్టించిన నేపాల్**



షంసీ (4/19)

కింగ్స్‌టౌన్ (సెయింట్ విన్సెంట్): అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుత విజయాన్ని దక్కించుకొనే అరుదైన అవకాశాన్ని పసికూన నేపాల్ జట్టు త్రుటిలో చేజార్చుకుంది. టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా శనివారం ఉత్కంఠగా జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో బలమైన సౌతాఫ్రికాకు నేపాల్ ముచ్చెమటలు పట్టించింది. చివరకు ఒక్క పరుగు తేడాతో గెలిచి సఫారీలు ఊపిరి పీల్చుకున్నారు. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. ప్రత్యర్థి బౌలర్లు కుషాల్ (4/19), దీపేంద్ర (3/21) ధాటికి 20 ఓవర్లలో 115/7 స్కోరుకే పరిమితమైంది. హెన్‌డ్రిక్స్ (43), స్టబ్స్ (27 నాటౌట్) మాత్రమే రాణించారు. ఛేదనలో నేపాల్ 20 ఓవర్లలో 114/7 స్కోరు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ ఆసీఫ్ (42) సత్తా చాటాడు. అనిల్ (27)తో కలిసి మూడో వికెట్‌కు ఆసిఫ్ 50 పరుగులు జోడించాడు. నాలుగు వికెట్లు తీసిన షంసీ (4/19) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. మ్యాచ్ చివరి బంతి రెండు జట్లను హైటెన్షన్‌కు లోను చేసింది. రెండు పరుగులు చేస్తే నేపాల్ సంచలన విజయం అందుకునే పరిస్థితి. కనీసం ఒక్క రన్ చేసినా మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీస్తుంది. కానీ టీనేజర్ గుల్షన్ ఝా (6) ఒక్క పరుగు తీసే క్రమంలో రనౌటవడంతో సౌతాఫ్రికా సంబరాలు చేసుకోగా..నేపాల్ ఆటగాళ్లు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఓటమితో టోర్నీ నుంచి నేపాల్ నిష్క్రమించగా, ఇప్పటికే సూపర్-8కి చేరిన సఫారీలు గ్రూపు దశను ఓటమి లేకుండా ముగించారు.

**సంక్షిప్తస్కోర్లు: సౌతాఫ్రికా:** 20 ఓవర్లలో 115/7 (హెన్‌డ్రిక్స్ 43, స్టబ్స్ నాటౌట్ 27, కుషాల్ భుర్టెల్ 4/19, దీపేంద్ర 3/21); **నేపాల్:** 20 ఓవర్లలో 114/7 (ఆసీఫ్ షేఖ్ 42, అనిల్ సా 27, కుషాల్ 13, షంసీ 4/19).

**పాయింట్ల పట్టిక — గ్రూప్-సి**

| జట్టు | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | రన్‌రేట్ |
|---|---|---|---|---|---|---|
| అఫ్ఘానిస్థాన్ | 3 | 3 | 0 | 0 | 6 | 4.230 |
| వెస్టిండీస్ | 3 | 3 | 0 | 0 | 6 | 2.596 |
| న్యూజిలాండ్ | 3 | 1 | 2 | 0 | 2 | -0.241 |
| ఉగాండా | 4 | 1 | 3 | 0 | 2 | -4.510 |
| పీఎన్‌జీ | 3 | 0 | 3 | 0 | 0 | -0.886 |

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

**గ్రూప్-డి**

| జట్టు | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | రన్‌రేట్ |
|---|---|---|---|---|---|---|
| దక్షిణాఫ్రికా | 4 | 4 | 0 | 0 | 8 | 0.470 |
| బంగ్లాదేశ్ | 3 | 2 | 1 | 0 | 4 | 0.478 |
| నెదర్లాండ్స్ | 3 | 1 | 2 | 0 | 2 | -0.408 |
| నేపాల్ | 3 | 0 | 2 | 1 | 1 | -0.293 |
| శ్రీలంక | 3 | 0 | 2 | 1 | 1 | -0.777 |


ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

## కివీస్ తొలి గెలుపు

**9 వికెట్లతో ఉగాండా చిత్తు**

టరోబా (ట్రినిడాడ్): వరల్డ్‌కప్ రేసు నుంచి అవుటైన న్యూజిలాండ్ ఎట్టకేలకు ఓదార్పు విజయాన్ని అందుకొంది. గ్రూప్-సిలో శనివారం జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో న్యూజిలాండ్ 9 వికెట్లతో పసికూన ఉగాండాపై రికార్డు విజయం సాధించింది. అఫ్ఘానిస్థాన్, వెస్టిండీస్ చేతిలో ఓడిన కివీస్‌కు టోర్నీలో ఇదే తొలి గెలుపు. పేసర్లు ట్రెంట్ బౌల్ట్ (2/7), 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' టిమ్ సౌథీ (3/4) నిప్పులు చెరగడంతో.. తొలుత ఉగాండా 18.4 ఓవర్లలో 40 పరుగులకే కుప్పకూలింది. కెన్నెత్ వైస్వా (11) ఒక్కడే రెండంకెల స్కోరు చేశాడు. కాగా, పొట్టి కప్‌లో ఇది రెండో అత్యల్ప స్కోరు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో ఉగాండా 39 పరుగులకే ఆలౌటైంది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని న్యూజిలాండ్ 5.2 ఓవర్లలో 41/1 స్కోరు చేసి గెలిచింది. మిగిలి ఉన్న బంతుల (88) పరంగా టీ20ల్లో కివీస్‌కిది ఇది భారీ విజయం కాగా.. పొట్టి కప్‌లో మూడోది.

**సంక్షిప్త స్కోర్లు: ఉగాండా:** 18.4 ఓవర్లలో 40 ఆలౌట్ (కెన్నెత్ 11; సౌథీ 3/4, బౌల్ట్ 2/7); **న్యూజిలాండ్:** 5.2 ఓవర్లలో 41/1 (కాన్వే 22 నాటౌట్; రియాజత్ అలీ 1/10).



**ఇదే నా చివరి వరల్డ్‌కప్: బౌల్ట్**

తనకు ఇదే చివరి ప్రపంచకప్ అని న్యూజిలాండ్ వెటరన్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ ప్రకటించాడు. 2011లో జట్టులోకి వచ్చిన 34 ఏళ్ల బౌల్ట్.. అనతికాలంలోనే కీలక సభ్యుడిగా ఎదిగాడు. మూడు టీ20 వరల్డ్‌కప్‌ల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. అయితే, న్యూజిలాండ్ తరఫున ఎంతకాలం ఆడతాడనే దానిపై అతను స్పష్టత ఇవ్వలేదు.



## బ్రిక్స్ గేమ్స్‌లో టీటీ బృందానికి కాంస్యం

న్యూఢిల్లీ: బ్రిక్స్ గేమ్స్‌లో భారత మహిళల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్టు కాంస్య పతకం సాధించింది. శనివారం రష్యాలోని కజాన్‌లో జరిగిన ఈ టోర్నీ టీటీ సెమీఫైనల్స్‌లో మౌవిత దత్త, యషిని శివశంకర్, పోమంటి బైస్యాతో కూడిన భారత త్రయం 1-3 తేడాతో చైనా జట్టు చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. కేంద్ర నూతన క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవ్య భారత జట్టును అభినందించారు.

## ఫైనల్లో సుమిత్ నగల్



పెరూగియా (ఇటలీ): భారత టెన్నిస్ సింగిల్స్ స్టార్ సుమిత్ నగల్ వరుసగా రెండో ఏటీపీ చాలెంజర్ టైటిల్ నెగ్గేందుకు అడుగుదూరంలో నిలిచాడు. గతవారం జర్మనీలో టైటిల్ అందుకున్న సుమిత్ తన సూపర్‌ఫామ్‌ను కొనసాగిస్తూ పెరూగియా చాలెంజర్ టోర్నమెంట్‌లోనూ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శనివారం జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో ఆరోసీడ్ సువిత్ 7-6(7-2), 1-6, 6-2తో స్పెయిన్‌కు చెందిన అన్‌సీడెడ్ ఆటగాడు బెర్నాబె జపాట మిరాలెస్‌ను ఓడించాడు. లూసియానో డార్డెరి (ఇటలీ), డానియెల్ ఆల్ట్‌మెయిర్ (జర్మనీ) మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో సుమిత్ ఫైనల్లో తలపడతాడు.

## యాదగిరిగుట్టలో 'గిరి ప్రదక్షిణ'

- అరుణాచలం, సింహాచలం తరహాలో అందరికీ చాన్స్
- ఈనెల 18న ఉదయం 5.30 గంటలకు ప్రారంభం

యాదాద్రి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మహిమాన్విత స్వయంభు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి చెంత స్థానిక భక్తులు గిరిప్రదక్షిణ చేసుకొని స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ సంప్రదాయం ఏళ్లుగా కొనసాగుతోంది. అయితే 2016లో ఆలయాన్ని పునర్నిర్మించడంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో గిరిప్రదక్షిణ చేసేందుకు ఇబ్బందికరంగా మారింది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడగానే యాదగిరిగుట్టలో ఉన్న పాత ఆచారాలను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకుంది. యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహ స్వామి వారికి ఇప్పటివరకు స్థానిక భక్తులే గిరి ప్రదక్షిణ చేస్తున్నారు. ఇక నుంచి అరుణాచలం, సింహాచలం తరహాలో భక్తులందరికీ గిరి ప్రదక్షిణ అవకాశాన్ని కల్పించాలని యాదగిరిగుట్ట అధికారులు సంకల్పించారు. స్వామి వారి ఆలయం చుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేరకు భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 18వ తేదీన స్వాతినక్షత్రం పురస్కరించుకుని ఉదయం 5.30గంటలకు స్వామివారి గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టనున్నారు. సుమారు ఐదు వేల మందితో ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం భక్తులకు ఉచితంగా స్వామివారి దర్శనం కల్పించేందుకు అధికారులు నిర్ణయించారు.



వేద పండిత దంపతులకు వస్త్రాలు అందజేస్తున్న భట్టి విక్రమార్క

## ఘనంగా భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

పంజాగుట్ట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు శనివారం ప్రజాభవన్‌లో ఘనంగా జరిగాయి. జన్మదినం సందర్భంగా సతీమణి నందినితో కలిసి భట్టి ప్రజాభవన్‌లో ఉన్న శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్రంలోని వివిధ ఆలయాలకు చెందిన 300 మంది వేదపండిత దంపతులకు పట్టు వస్త్రాలు, తాంబూలాలు, సంభావనలు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానుల మధ్య భట్టి కేక్ కట్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

## విత్తనాలు, ఎరువులు సిద్ధం చెయ్యండి

- పారదర్శకంగా పంటల నమోదు: తుమ్మల

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ముందుగానే సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. విత్తనోత్పత్తి క్షేత్రాల్లో విత్తనాలు, ప్రభుత్వ నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలను ఉత్పత్తి చేసి రైతులకు తక్కువ ధరలో అందించాలని సూచించారు. సచివాలయంలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ, పత్తి విత్తనాల లభ్యత, ఎరువుల నిల్వలపై మంత్రి ఆరా తీశారు. పత్తి విత్తన కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వానికి హామీ మేరకు విత్తనాలు సరఫరా అయ్యాయా ? అవి రైతులకు చేరాయా ? అనే అంశంపై తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. పంటల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోని ఆయిల్‌పామ్ కంపెనీలకు నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాలన్నారు. సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటు అవకాశాలపై మార్క్‌ఫెడ్ అధికారులతో చర్చించారు. పహాడీషరీఫ్ వక్ఫ్‌భూముల్లో ఏర్పాటుచేసిన తాత్కాలిక షెడ్లలో సబ్‌మార్కెట్ ప్రారంభానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని మార్కెటింగ్ అధికారులకు సూచించారు. కాగా, పదోన్నతులు కల్పించాలని తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ ఛైర్మన్ రాములు, కార్యవర్గం మంత్రి తుమ్మలను కోరింది.

## రోజుకి 200 ఆహార నమూనాలు పరీక్షించాలి

- పని తీరు మెరుగుపడకుంటే చర్యలు: మంత్రి దామోదర

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఫుడ్‌సేఫ్టీ అధికారుల పనితీరుపై మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపర్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు ఆహార భద్రత అంశంపై సచివాలయంలో ఆయన శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆహార భద్రత అంశంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆహార తనిఖీ బృందాల నిరంతర పర్యవేక్షణ కొనసాగాలన్నారు. మొబైల్ ఫుడ్ ల్యాబ్స్ ద్వారా రోజుకు 150-200 ఆహార నమూనాలను సేకరించి పరీక్షించాలని పేర్కొన్నారు. ప్రతి శనివారం మొబైల్ ఫుడ్ ల్యాబ్స్ ద్వారా చేసే పరీక్షల వివరాలను నివేదిక రూపంలో అందించాన్నారు.

## రాకెట్లలో వాడే తైవ్‌ను అభివృద్ధి చేసిన ఐఐసీటీ

హైదరాబాద్, జూన్ 15: రాకెట్, క్షిపణుల తయారీలో స్వాలంబన దిశగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ముందడుగు వేసింది. రాకెట్లు, క్షిపణుల ప్రొపెల్లెంట్స్‌లో ఉపయోగించే (చైనాలేక్ 20) సీఎల్-20 తయారీకి అవసరమైన అత్యంత శక్తివంతమైన ఇంధనాన్ని హైదరాబాద్‌కు చెందిన ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌తో కలిసి అభివృద్ధి చేసింది. సీఎల్-20 సంప్రదాయ ఆర్‌డీఎక్స్ కంటే మెరుగైన ఆక్సిడైజర్ ఇంధన నిష్పత్తిని కలిగి ఉంటుంది. అలాగే ఎక్స్‌ఎంఎస్ ఆధారిత ప్రొపెల్లెంట్ కంటే 20 శాతం అధిక శక్తిని కలిగి ఉంటుంది. సీఎల్-20ని అత్యంత ఖరీదైన (టీఏఐడబ్ల్యూ) తైవ్ అనే పదార్థం నుంచి తయారు చేస్తారు. సీఎల్-20ని తయారు చేసేందుకు గాను భారత్ భారీగా ఖర్చు చేసి తైవ్‌ను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. తైవ్‌ను మన దేశంలోనే తయారు చేసుకునేందుకు అవసరమైన కీలక ఉత్ప్రేరకాన్ని ఐఐసీటీ శాస్త్రవేత్త ఎస్.లింగయ్య సారథ్యంలోని శాస్త్రవేత్తల బృందం అభివృద్ధి చేసింది. ఈ ఉత్ప్రేరకాన్ని తక్కువ ఖర్చుతో, పర్యావరణహితంగా తయారు చేసినట్లు ఐఐసీటీ వెల్లడించింది. దీనిపై ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ సంస్థతో సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి ఒప్పందం చేసుకున్నట్లు ఐఐసీటీ శనివారం తెలిపింది.

## 531 సర్కారు వైద్యుల పోస్టులు

(మొదటిపేజీ తరువాయి)

భర్తీకి నోటిఫికేషన్ విడుదలకానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక ప్రజారోగ్యంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. ప్రతి వర్షాకాలం రాష్ట్రంలో డెంగీ, ఇతర విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించేందుకు ఖాళీల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు (ఎల్టీ), స్టాఫ్ నర్సుల ఖాళీలను తక్షణమే భర్తీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) సివిల్ అసిస్టెంట్ సర్జన్ల కొరత అధికంగా ఉంది. ఈ సమస్యను అధిగమించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ) త్వరలోనే ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనుంది. నియామకాల అనంతరం ఆయా పీహెచ్‌సీల్లోని డిమాండ్‌ను బట్టి సర్జన్లను నియమించనున్నారు. అలాగే ఎల్టీ, స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ ఉండనుంది. ఇదిలా ఉండగా.. వారంలోగా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌ఏ-ఏఎన్‌ఎమ్) రాత పరీక్ష తేదీని వెల్లడించే అవకాశం ఉంది. సుమారు 1,900 పోస్టుల భర్తీకిగాను గతేడాది జూలైలో నోటిఫికేషన్ ఇచ్చారు. పరీక్షా తేదీ సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు రాత పరీక్ష నిర్వహించి వెంటనే ఆ పోస్టులను భర్తీ చేయాలని మెడికల్ బోర్డును సర్కారు ఆదేశించింది.

# ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి హోంగార్డులు

- ఔటర్ లోపల సీసీ కెమెరాలన్నింటినీ.. కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించండి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు హోంగార్డులను ట్రాఫిక్ విధుల్లో నియమించాలని సూచించారు. ట్రాఫిక్‌జామ్‌ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఎఫ్ఎం రేడియోల ద్వారా ప్రజలకు అందజేయాలన్నారు. శనివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సీఎం సందర్శించారు. వర్షాకాలం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) పరిధిలోని ప్రాంతాలను యూనిట్‌గా తీసుకుని విపత్తు నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న సీసీ కెమెరాలన్నింటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా పటిష్ఠ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే వరద తీవ్రత ఎక్కువగా ఉండే 141 ప్రాంతాలను గుర్తించినట్లు అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. వరద నీటి సమస్యకు పరిష్కారంగా వాటర్ హార్వెస్ట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం వెంట సీఎస్ శాంతి కుమారి, డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.




కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

# ఆగస్టు 1 విడుదల!

**రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ విలువల సవరణ తేదీ ఇదే.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కమిటీల ఏర్పాటు**

- 18 నుంచి పరిశీలన, 24న జాబితా
- మార్కెట్, రిజిస్ట్రేషన్ విలువల పరిశీలన
- అంతరం తక్కువగా ఉన్నచోట కొద్దిగా.. ఎక్కువున్నచోట భారీగా సవరణలు

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సవరించిన స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువలు ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. వాటిని ప్రతిపాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విలువల నిర్ధారణ కమిటీలను ఏర్పాటు చేసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన కమిటీలు ఈనెల 18వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా క్షేత్ర స్థాయికి వెళ్లనున్నాయి. అక్కడ జరుగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపార లావాదేవీలను తెలుసుకోనున్నాయి. అనంతరం ప్రభుత్వానికి ప్రతిపాదనలను సమర్పించనున్నాయి. వాటిని పరిశీలించి జూలై 24న రిజిస్ట్రేషన్ విలువల తుది జాబితాను సర్కారు ప్రకటించనుంది. సదరు వివరాలను జూలై 31 నాటికి కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయనుంది. ఈ మేరకు స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువల సవరణకు మార్గదర్శకాలు వెలువడ్డాయి. గ్రామీణ ప్రాంతాల కమిటీలో ఛైర్మన్‌గా ఆర్డీవో, సభ్యులుగా ఎమ్మార్వో, ఎండీవో, జిల్లా రిజిస్ట్రార్, ఆడిట్ సబ్ రిజిస్ట్రార్, కన్వీనర్‌గా సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌ను నియమించారు. పట్టణ ప్రాంతాల కమిటీలో ఛైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, సభ్యులుగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్, సంబంధిత మునిసిపల్ కమిషనర్, కన్వీనర్‌గా సబ్ రిజిస్ట్రార్‌ను నియమించారు. కంటోన్మెంట్‌లో కలెక్టర్ ఛైర్మన్‌గా కమిటీని నియమించారు. ఈ కమిటీలు తమ తమ పరిధిలో వ్యవసాయ భూములు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు తదితరాల స్థిరాస్తుల విలువలు బహిరంగ మార్కెట్‌లో ఎంత ఉన్నాయి!? వాటి వాటి రిజిస్ట్రేషన్ విలువలు ఎంత ఉన్నాయనే విషయాన్ని పరిశీలిస్తుంది. ధరలకు సంబంధించిన వివరాల కోసం స్థానిక సంస్థలు, తహశీల్దారులను సంప్రదించనుంది. మార్కెట్ విలువలు తెలుసుకునేందుకు వివిధ మార్గాల ద్వారా అవసరమైన నివేదికలు సేకరించనుంది. అంతరం తక్కువగా ఉన్నచోట కొద్దిగానూ.. ఎక్కువగా ఉన్నచోట భారీగాను రిజిస్ట్రేషన్ విలువలను సవరించాలని ఆయా కమిటీలు సిఫారసు చేయనున్నాయని తెలుస్తోంది. వీటిని ప్రభుత్వం ఉన్నతస్థాయిలో పరిశీలించి, సవరింపుపై తుది నిర్ణయం తీసుకోనుంది.



### గ్రామీణ ప్రాంతాల్లో...

గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ, రాష్ట్ర రహదారులకు సమీప ప్రాంతాల్లోని భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాల మార్కెట్ రేట్లను సదరు కమిటీలు తెలుసుకోనున్నాయి. పరిశ్రమల కోసం ఏర్పాటు చేసిన సెజ్‌ల సమీపంలోని స్థలాల మార్కెట్, రిజిస్ట్రేషన్ విలువల వ్యత్యాసాన్ని గుర్తించనున్నాయి. వ్యవసాయేతర కార్యక్రమాలు (అభివృద్ధి) చేపట్టేందుకు అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించనున్నాయి. వాటి సమీప, పక్కపక్కనే ఉన్న గ్రామాల్లోని భూముల ధరలను తెలుసుకొని వాటికి అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను సవరించనున్నాయి. గ్రామాల మ్యాప్‌లను పరిశీలించి, వాటిలో నుంచి వెళ్తున్న జాతీయ, రాష్ట్ర రహదారులను గుర్తించనున్నాయి. వాటి సమీపంలో లే అవుట్‌లు చేసిన ప్రాంతాలు, భవిష్యత్‌లో అందుకు అవకాశం ఉన్న గ్రామాలను కూడా గుర్తించనున్నాయి. అక్కడికి సబ్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నేరుగా వెళ్లి మార్కెట్ ధరలను తెలుసుకోనున్నారు. రెవెన్యూ అధికారులు, రియల్ వ్యాపారులతో మాట్లాడనున్నారు. వెంచర్లకు సంబంధించిన బ్రోచర్లు, వివిధ ప్రచార ప్రకటనలను పరిశీలించి, మార్కెట్ విలువలను తెలుసుకోనున్నారు. గ్రామాల మధ్య రియల్ ఎస్టేట్ లావాదేవీల వ్యత్యాసాన్ని గుర్తించనున్నారు. ఒక ప్రాంతంలో ఎక్కువ ధర ఉండి.. రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతూ సమీప గ్రామ పరిధిలో తక్కువ రిజిస్ట్రేషన్ విలువ ఉంటే అక్కడి తేడాను గుర్తిస్తారు. ఇలాంటి గ్రామాల్లో రిజిస్ట్రేషన్ విలువలు సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటారు.

### పట్టణ ప్రాంతాల్లో..

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నివాస స్థలాలు, ఇళ్లు, ప్లాట్ల ధరలను కమిటీలు తెలుసుకోనున్నాయి. ప్రధాన రహదారులకు ఆనుకొని ఉన్న వాణిజ్య ప్రాంతాలు, కాలనీలు, విల్లాలు, క్లబ్‌లు ఉన్న ప్రాంతాల్లో వివిధ స్థాయిలో రిజిస్ట్రేషన్ విలువలు ఉండేలా ప్రతిపాదనలు చేయనున్నాయి. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లోని భూములు, ప్లాట్లు, కాలనీల్లో ఉన్న ధరలను పరిశీలించనున్నాయి. వాస్తవానికి ఇక్కడ బహిరంగమార్కెట్‌కు, రిజిస్ట్రేషన్ చార్జీలకు భారీ తేడా ఉంది. ఉదాహరణకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలో ఎకరా భూమి ధర బహిరంగ మార్కెట్లో కోట్లలో ఉంటే.. రిజిస్ట్రేషన్ విలువ వేలల్లో ఉంది. చేవెళ్లలో ఎకరా భూమి ధర రూ.2 కోట్లు పలుకుతుంటే.. రిజిస్ట్రేషన్ విలువ రూ.42లక్షలే ఉంది. మేడ్చల్ జిల్లాలో ఏ ప్రాంతం తీసుకున్నా బహిరంగ మార్కెట్ ధర ఎకరం కోట్లలోనే ఉంది. జూబ్లీహిల్స్‌లో గజం విలువ 3లక్షలు ఉంటే రిజిస్ట్రేషన్ విలువ రూ.90 వేలే. ఇలాంటి వ్యత్యాసాలు లేకుండా రిజిస్ట్రేషన్ విలువలను సవరిస్తూ అంచనాలు రూపొందించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

# నిధుల దారులన్నీ రుణమాఫీ వైపే!

(మొదటిపేజీ తరువాయి)

చెల్లింపులనూ ఆపేయడం ద్వారా మిగిలే నిధులను.. అన్నింటినీ కలిపి రుణమాఫీ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కాగా, జూలై నుంచి వేయాల్సిన రైతు భరోసాపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు కింద 2018-19నుంచి మొన్నటి వరకు రూ.80,450కోట్లు ఖర్చు చేయగా.. అందులో సాగులో లేని భూములు, గుట్టలకు రూ.25600 కోట్లు వేసినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. అలాంటి భూములకు, పెద్ద రైతులకు రైతు భరోసా ఇవ్వాలా వద్దా అనే అంశంపై.. శాసన సభలో చర్చించిన తరువాతే తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియ ఆగస్టు దాకా కొనసాగే అవకాశం ఉందని అంచనా.

### రుణ మాఫీ ఇలా..

తొలుత ఆగస్టు మొదటివారంలో.. రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేయాలని సర్కారు భావిస్తోంది. ఆ తరువాత రూ.లక్షన్నర, ఆగస్టు నాటికి రూ.2లక్షల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని యోచిస్తోంది. గతంలో బీఆర్ఎస్ సర్కారు ఈ పథకాన్ని అమలు చేసినా.. లక్షలోపు రుణాల మాఫీకే పరిమితమైంది. అది కూడా దశలవారీగా మాఫీ చేసింది. దాంతో బీఆర్ఎస్ సర్కారుపై ఒకేసారి ఆర్థిక భారం పడలేదు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఒకేసారి రూ.2లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఇందుకోసం రూ.35వేలకోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని అంచనా వేశారు. రుణమాఫీ కోసం అందుబాటులో ఉన్న నిధులన్నీ వాడేస్తే.. ఆ తర్వాత ప్రభుత్వ అవసరాలకు అప్పులు చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో పెద్ద ఎత్తున భూముల అమ్మకం, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, పన్నులు, ఎక్సైజ్ సుంకాలు, గనుల సీనరేజీ చార్జీలు, రవాణా పన్నుల్లో లీకేజీలను అరికట్టే చర్యలు తీసుకుంటూ.. అదనపు ఆదాయం సాధించే అవకాశం ఉంది. ఇందులో ప్రధానంగా భూముల విలువలను పెంచడంపై సర్కారు దృష్టి పెట్టింది. ప్రభుత్వ భూములు, 'దిల్' ఆధీనంలోని భూములు తనఖా పెట్టడం ద్వారా రూ.20-25 వేల కోట్ల దాకా సేకరించొచ్చని తెలిసింది. ఇక భూముల విలువ పెంపు ద్వారా అదనంగా ఏడాదికి రూ.5000 కోట్ల వరకు రాబడి పెరగవచ్చని భావిస్తున్నారు.

# సబ్ కాంట్రాక్ట్ సంస్థలపై గురి!

**వాటి వివరాలు సేకరించాలని.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిర్ణయం**

**మేడిగడ్డలో బ్యారేజీ నిర్ణయం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌దే: మాజీ ఇంజనీర్లు**

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి సబ్ కాంట్రాక్టర్ల వివరాలు సేకరించాలని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నిర్ణయించింది. ఇందుకోసం ఆయా నిర్మాణ సంస్థలకు నోటీసులు ఇవ్వాలని యోచిస్తున్నట్లు సమాచారం. వివరాలు ఇవ్వని పక్షంలో ఆయా సంస్థలకు సంబంధించి రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీల నుంచి పదేళ్ల ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్‌లు తెప్పించుకొని, వాటిని పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ 8 బ్లాకులుగా ఉండగా.. అందులో 6, 7, 8 బ్లాకులు నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్ టీ కట్టలేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ విచారణలో భాగంగా మధ్యంతర నివేదిక ఇచ్చిన విషయం విదితమే. నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ బ్యారేజీ మొత్తం కట్టి ఉంటే.. కుంగిపోయిన 7వ బ్లాకుతో పాటు.. బ్యారేజీ మొత్తం ప్రభావితం అయ్యేదని పలువురు నిపుణులు కూడా అనుమానం వ్యక్తం చేశారు. దాంతో కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణ లోపాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కూడా ఇదే అంశంపై దృష్టి పెట్టారు. ఇక సుందిళ్ల బ్యారేజీని నవయుగ సంస్థ కట్టగా.. అన్నారం బ్యారేజీని అఫ్కాన్స్, మేడిగడ్డను ఎల్ అండ్ టీ నిర్మించింది. సుందిళ్ల, అన్నారంలో సమస్యలు నామమాత్రంగానే ఉన్నాయి. మేడిగడ్డలో ఏడో బ్లాకు కుంగిపోవడంతో బ్యారేజీ మొత్తం విఫలమయింది. మూడు బ్యారేజీల నిర్మాణాల్లో దాదాపు 10-15 మంది దాకా సబ్ కాంట్రాక్టర్లు ఉన్నట్లు కమిషన్ ప్రాథమికంగా గుర్తించింది. ఇందులో ఒకరు మాజీ సీఎం కేసీఆర్ బంధువు కంపెనీ(ప్రతిమా) ఉన్నట్లు విచారణ కమిషన్‌కు సమాచారం ఉంది. దాంతో సబ్ కాంట్రాక్టర్ల లెక్కలన్నీ తీసే పనిలో కమిషన్ పడింది.

### కేసీఆర్ మా సిఫారసును పట్టించుకోలేదు

2015లో ఏర్పాటు చేసిన అనంతరాములు కమిటీలోని మాజీ ఇంజనీర్లతో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ శనివారం భేటీ అయింది. ఈ సందర్భంగా అప్పటి నివేదికను కమిషన్ ముందు ఉంచిన మాజీ ఇంజనీర్లు.. మేడిగడ్డను కేసీఆర్ సూచించారని, తమ నివేదికను పట్టించుకోలేదని కమిషన్‌కు నివేదించారు. ప్రాణహిత చేవెళ్లలో భాగంగా 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కడితే.. 90 కిలోమీటర్ల దాకా గ్రావిటీతో నీటిని తరలించవచ్చని, 20 మీటర్ల ఎత్తుతో నీటిని పంపింగ్ చేస్తే నీరు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో చేరుతుందని నివేదిక ఇచ్చామని ఆ ఇంజనీర్లు ఈ సందర్భంగా తెలిపారు. తమ సిఫారసును కేసీఆర్ పట్టించుకోలేదని వారు కమిషన్‌కు నివేదించారు.

విజిలెన్స్ పూర్తి నివేదిక రానుంది: జస్టిస్ పీసీ ఘోష్

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు సంబంధించిన పూర్తి నివేదిక త్వరలోనే కమిషన్‌కు చేరనుందని, దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చామని జస్టిస్ పీసీ ఘోష్ చెప్పారు. ఇక ప్రస్తుతానికి సాంకేతిక అంశాలపై ఇంజనీర్లతో విచారణ పూర్తి అయిందని, ఈనెల 27వ తేదీలోపు అఫిడవిట్లు చేరాకా.. వాటిలోని అంశాల ఆధారంగా తదుపరి నోటీసులు/సమన్లు/వారెంట్లపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అఫిడవిట్లు పరిశీలించాకా అవసరమైతే కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) అధికారుల వివరణ కూడా అడుగుతామని, అవసరమైతే వారిని కూడా విచారణకు పిలుస్తామని చెప్పారు. కాగా, జస్టిస్ పీసీ ఘోస్ మలిదశ షెడ్యూల్ విచారణను ముగించారు. ఆదివారం ఆయన కోల్‌కత్తాకు వెళ్లిపోనున్నారు.

# సాధారణ బదిలీలు ఎప్పుడు?

- ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఉద్యోగులు

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలు సకాలంలో జరగకపోవడంతో వారంతా సుదీర్ఘకాలంగా ఒకే చోట పనిచేయాల్సివస్తోంది. కొందరు ఉద్యోగులు 15 ఏళ్లుగా ఒకే స్థానంలో కొనసాగుతుండగా, మరికొందరు పదేళ్లుగా, ఇంకొందరు ఐదేళ్లుగా ఒకే కుర్చీకి పరిమితమయ్యారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ సంఘాల తరఫున సర్కారుకు పదే పదే విజ్ఞప్తి చేసినా పట్టించుకున్నవారే లేరని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అయినా పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశిస్తే ఇప్పుడు కూడా పరిస్థితి అలాగే ఉందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ శాఖల్లో సుమారు 3.50లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరికి సంబంధించి సాధారణ బదిలీల ప్రక్రియను ప్రతి ఏటా చేపట్టాల్సి ఉంటుంది. కొన్ని శాఖల్లో రెండేళ్లకోసారైనా ఉద్యోగుల బదిలీ చేయాలనే నిబంధనలున్నాయి. కానీ, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గడిచిన పదేళ్లలో ఒక్కసారి మాత్రమే సాధారణ బదిలీలు చేపట్టారని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. 2018లో 40 శాతం మంది ఉద్యోగులకు బదిలీలు చేస్తామని చెప్పిన నాటి కేసీఆర్ ప్రభుత్వం.. కేవలం 20 శాతం మందికే అవకాశం కల్పించిందని గుర్తు చేస్తున్నాయి. ఆ తరువాత మళ్లీ బదిలీల ఊసే లేదని, గత ప్రభుత్వంలో బదిలీల కోసం పెద్దల చుట్టూ తిరిగి విసిగిపోయామని పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కూడా ఇప్పటికే పలుమార్లు ఉద్యోగ సంఘాల తరఫున సీఎం రేవంత్‌రెడ్డితోపాటు సీఎస్ శాంతికుమారి, సీఎంవో అధికారులు, మంత్రులకు సాధారణ బదిలీల కోసం వినతి పత్రాలు సమర్పించామని టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కోడ్ ముగిసిన వెంటనే ప్రభుత్వం బదిలీలు చేస్తుందని ఆశించినా స్పందన లేకపోవడం నిరాశకు గురిచేస్తోందన్నారు.

# అటవీ సిబ్బందిపై దాడులను సహించం

- పోడు రైతులను ఇబ్బంది పెట్టే ఉద్దేశం లేదు
- అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు
- తాజాగా దాడి నేపథ్యంలో మంత్రి సురేఖ

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పోడు రైతులకు ఇబ్బందులు కలిగించబోమని, అదే సమయంలో అటవీ అధికారులపై దాడులు చేస్తే సహించబోమని మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. పోడు సాగుదారుల హక్కులను కాపాడడంతోపాటు అటవీ అధికారులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. వ్యవసాయం పేరుతో అటవీ చట్టాలకు విరుద్ధంగా కొత్తగా భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. సచివాలయంలో శనివారం మరో మంత్రి సీతక్కతో కలిసి అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆమె సమావేశమయ్యారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కాల్పోల్‌లో ఎఫ్ఆర్ఓ, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్‌పై గిరిజనుల దాడి ఘటనను ఆమె ప్రస్తావించారు. ప్రజల ప్రయోజనాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తామో, అటవీ సంపద పరిరక్షణకు అంతే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో అనర్హులకు పోడు భూములు కేటాయించిన విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. గతంలో చేపట్టిన పోడు భూముల పంపిణీపై నివేదిక సమర్పించాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పోడు భూముల సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు ఇదే ప్రాథమిక సమావేశమని భావిస్తున్నామన్నారు. ఛత్తీసగఢ్ నుంచి వస్తున్న గిరిజనులు అటవీ భూములను ఆక్రమించుకుంటున్న విషయాన్ని అధికారులు వివరించగా.. భవిష్యత్‌లో ఇలాంటి వలసలు కొనసాగకుండా కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి కచ్చితమైన మార్గదర్శకాలను రూపొందించాలని, ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలు దెబ్బతినకుండా చూడాలని ఆదేశించారు. కాగా, తమపై దాడులకు దిగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జూనియర్ అటవీ అధికారుల సంఘం ప్రతినిధులు మంత్రి కొండా సురేఖను కోరారు. ఈ మేరకు ఆమె స్పందిస్తూ.. కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని, సిబ్బందికి ఏ సాయం కావాలన్నా సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు.

# భారీస్థాయిలో ఐఏఎస్‌ల బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టింది. కాగా, ఇప్పటి వరకూ ఆయా జిల్లాలకు కలెక్టర్లుగా పని చేస్తున్న పది మంది ఐఏఎస్ అధికారులకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్‌లో పెట్టింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. కాగా, కొత్త కలెక్టర్ల రాకతో రిలీవ్ కావాల్సిన 10 మంది పాత కలెక్టర్లకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. వీపీ గౌతమ్ (ఖమ్మం), పి.ఉదయ్‌కుమార్ (నాగర్‌కర్నూల్), పమేలా సత్పతి (కరీంనగర్), భవేష్ మిశ్రా (జయశంకర్-భూపాలపల్లి), యాస్మిన్ బాషా (జగిత్యాల), జి.రవి (మహబూబ్‌నగర్), హరిచందన దాసరి (నల్లగొండ), ఎస్.వెంకటరావు (సూర్యాపేట), ఇలా త్రిపాఠి (ములుగు), ఆల ప్రియాంక (భద్రాద్రి-కొత్తగూడెం)లకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్‌లో పెట్టింది.

| పేరు | బదిలీకి ముందు | బదిలీ తర్వాత |
|---|---|---|
| ముజమ్మిల్‌ఖాన్ | పెద్దపల్లి కలెక్టర్ | ఖమ్మం కలెక్టర్ |
| బడావత్ సంతోష్ | మంచిర్యాల్ కలెక్టర్ | నాగర్‌కర్నూల్ కలెక్టర్ |
| సందీప్‌కుమార్‌ఝా | ట్రాన్స్‌కో జాయింట్ ఎండీ | రాజన్న-సిరిసిల్ల కలెక్టర్ |
| అనురాగ్ జయంతి | రాజన్న-సిరిసిల్ల కలెక్టర్ | కరీంనగర్ కలెక్టర్ |
| ఆశిష్ సంగ్వాన్ | నిర్మల్ కలెక్టర్ | కామారెడ్డి కలెక్టర్ |
| జితేష్ వి.పాటిల్ | కామారెడ్డి కలెక్టర్ | భద్రాద్రి-కొత్తగూడెం కలెక్టర్ |
| రాహుల్‌శర్మ | వికారాబాద్ అదనపు కలెక్టర్ | జయశంకర్-భూపాలపల్లి కలెక్టర్ |
| సిక్తా పట్నాయక్ | హన్మకొండ కలెక్టర్ | నారాయణపేట్ కలెక్టర్ |
| కోయ హర్ష | నారాయణపేట్ కలెక్టర్ | పెద్దపల్లి కలెక్టర్ |
| పి.ప్రావిణ్య | వరంగల్ కలెక్టర్ | హన్మకొండ కలెక్టర్ |
| బుడుమజ్జి సత్యప్రసాద్ | ఖమ్మం అదనపు కలెక్టర్ | జగిత్యాల కలెక్టర్ |
| బి.విజయేంద్ర | రవాణా, రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి | మహబూబ్‌నగర్ కలెక్టర్ |
| కుమార్ దీపక్ | నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ | మంచిర్యాల్ కలెక్టర్ |
| ప్రతీక్ జైన్ | భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ | వికారాబాద్ కలెక్టర్ |
| నారాయణరెడ్డి | వికారాబాద్ కలెక్టర్ | నల్లగొండ కలెక్టర్ |
| ఆదర్శ్ సురభి | ఖమ్మం మునిసిపల్ కమిషనర్ | వనపర్తి కలెక్టర్ |
| తేజస్ నంద్‌లాల్ పవార్ | వనపర్తి కలెక్టర్ | సూర్యాపేట కలెక్టర్ |
| ఎం.సత్యశారదాదేవి | వ్యవసాయశాఖ జాయింట్ సెక్రటరీ | వరంగల్ కలెక్టర్ |
| దివాకర టీఎస్ | జగిత్యాల అదనపు కలెక్టర్ | ములుగు కలెక్టర్ |
| అభిలాష అభినవ్ | జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ | నిర్మల్ కలెక్టర్ |

# మీ కమిషనే చట్ట విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

కూడా చట్ట విరుద్ధమేనని, అందుకే విచారణ కమిషన్ బాధ్యత నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలని వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు ఒప్పందం, పోటీ బిడ్డింగ్ లేకుండా యాదాద్రి ప్లాంట్ నిర్మాణం, కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మించారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్‌కు కమిషన్ నోటీసులు జారీ చేసింది. 'ఆయా అంశాల్లో మీ పాత్ర ఏమిటో లిఖితపూర్వకంగా వివరాలు అందించాలి. రికార్డులన్నీ పరిశీలిస్తుంటే ఆ నిర్ణయాలన్నీ మీరే తీసుకున్నట్లు కనిపిస్తోంది' అని ఆ నోటీసుల్లో కమిషన్ పేర్కొంది కూడా. ఆ సందర్భంగా జస్టిస్ నర్సింహా రెడ్డి విలేకరుల సమావేశంలోనూ మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే, కమిషన్ ఇచ్చిన గడువు రోజైన శనివారం జస్టిస్ నర్సింహా రెడ్డికి కేసీఆర్ 12 పేజీల లేఖ రాశారు. ఆయన తీరుపై తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. తన నిర్ణయాలను సమర్థించుకుంటూనే కనీస అవగాహన లేకుండా మాట్లాడారంటూ జస్టిస్ నర్సింహా రెడ్డిపై ఎదురు దాడి చేశారు. రాజకీయ కక్షతోనే విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేశారని ఆక్షేపించారు. "ఇరు పక్షాల మధ్య ఒక వివాదం తలెత్తినప్పుడు, మధ్యవర్తిగా నిలిచి, అసలు నిజాన్ని నిగ్గు తేల్చాల్సిన బాధ్యత మీది. అన్ని విషయాలను అన్ని కోణాల్లో సమగ్రంగా పరిశీలించి, పూర్తి నిర్ధారణకు వచ్చిన తర్వాత డాక్యుమెంటరీ ఎవిడెన్స్ (పత్రాలతో కూడిన సాక్ష్యాలతో)తో బాధ్యులకు మాత్రమే నివేదిక ఇవ్వాల్సిన గురుతరమైన బాధ్యత మీది. కానీ, మీ వ్యవహారశైలి అట్లా లేదని చెప్పడానికి చింతిస్తున్నా" అంటూ విరుచుకుపడ్డారు. ఆ లేఖలోని వివరాలు..

ఉభయ రాష్ట్రాల మధ్య ఒప్పందాలను రాష్ట్ర ఈఆర్సీలు పరిశీలించకూడదని, ఆ అధికారం కేంద్ర ఈఆర్సీకి మాత్రమే ఉందని విలేకరుల సమావేశంలో మీరు వ్యాఖ్యానించారు. తద్వారా ఏదో తప్పు జరిగిందనే భావన కలిగేలా మాట్లాడారు. కానీ, ఎలక్ట్రిసిటీ చట్టం 2003లోని సెక్షన్ 64(5) ప్రకారం ఈ అధికారం ఎస్ఈఆర్సీలకే ఉందని స్పష్టమవుతోంది. దానిని అనుసరించే ఉభయ రాష్ట్రాల ఈఆర్సీలూ వ్యవహరించి తమ తీర్పులను వెలువరించాయి. న్యాయ ప్రాధికార సంస్థలైన ఉభయ రాష్ట్రాల ఈఆర్సీలు అన్ని రకాల పరిశీలనలు జరిపి ఇచ్చిన ఆమోదాలపై తిరిగి విచారణ జరపాలన్న ఆలోచనే దురదృష్టకరం. న్యాయ నిపుణులైన మీరు చట్టాల్లో పొందుపరిచిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే న్యాయ ప్రాధికార సంస్థలపై వ్యాఖ్యలు చేయడం విచారకరం. దీనినిబట్టి మీరు విచారణార్హతను కోల్పోయినట్లు స్పష్టమవుతోంది. కనక మీరు ఆ బాధ్యతల నుంచి విరమించుకోండి.

అసాధారణ పరిస్థితుల్లో కొన్ని అసాధారణ నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. కరెంటు విషయంలో ఆనాడు తెలంగాణ అలాంటి అసాధారణ సంక్షోభంలోనే ఉంది. తెలంగాణ బిడ్డ అయిన మీరు అప్పట్లో రాష్ట్ర ప్రజలు పడుతున్న అవస్థలను పరిగణనలోకి తీసుకుని అప్పటి ప్రభుత్వం చేపట్టిన చర్యలను అభినందించాల్సింది పోయి.. విమర్శలు చేయడం దురదృష్టకరం.

తెలంగాణలో 2014 నాటికే కొత్త విద్యుత్తు కేంద్రాల నిర్మాణం ప్రారంభించాం. అప్పటికి సబ్ క్రిటికల్ టెక్నాలజీపై ఎలాంటి నిషేధం కానీ నియంత్రణ కానీ లేదు. సబ్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్లు నిర్మించుకోవచ్చని 2017 వరకూ అమల్లో ఉండే 12వ పంచవర్ష ప్రణాళికలోనూ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని చట్టబద్ధ సంస్థల నుంచి అనుమతులు, ఆమోదాలు తీసుకునే దానిని నిర్మించాం. కానీ, విలేకరుల సమావేశంలో మీరు భద్రాద్రి సబ్ క్రిటికల్ ప్లాంటుపై విపరీత వ్యాఖ్యలు చేశారు. వాస్తవాలను విస్మరించి తెలంగాణ ప్రభుత్వం చేయరాని తప్పు చేసినట్లు మాట్లాడారు. దురుద్దేశాలు ఆపాదించారు. కనీస పరిజ్ఞానం ఉన్న ఎవరూ కూడా మీ వ్యాఖ్యలను అంగీకరించరు.

రెండేళ్లలోనే ప్లాంటును పూర్తి చేసి ఇస్తామని బీహెచ్ఈఎల్ లిఖితపూర్వక హామీ ఇచ్చింది. అధిక ధరల భారం రాష్ట్రంపై పడకుండా ఉండాలని నామినేషన్ పద్ధతిపై బీహెచ్ఈఎల్‌కు పనులు అప్పగించాం. భారీ విద్యుత్కేంద్రాల నిర్మాణానికి మన దేశంలో ఉన్నది బీహెచ్ఈఎల్ ఒక్కటే. నిర్మాణాన్ని ప్రభుత్వ రంగ సంస్థకు అప్పగిస్తే నామినేషన్ పద్ధతిలోనూ ఇవ్వవచ్చు. ఇది చట్టబద్ధమే. కేంద్ర, రాష్ట్ర సంస్థలు, ఎన్టీపీసీ, చివరికి ప్రైవేటు కంపెనీలు కూడా నామినేషన్ పద్ధతిపైనే పనులు అప్పగించాయి. నవరత్న కంపెనీల్లో ఒకటైన బీహెచ్ఈఎల్ పనికిమాలిన సంస్థ అన్నట్లు.. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడమే తప్పన్నట్లు మీ మాటలున్నాయి. తెలంగాణ నిర్ణయాన్ని ఎలాగైనా తప్పుబట్టాలనే మీ ప్రీ డిటర్మైన్డ్ మైండ్ సెట్ (ముందే ఒక అభిప్రాయానికి వచ్చి మాట్లాడడం)ని ఇది పట్టి చూపిస్తోంది.

కరోనా, ఎన్జీటీ స్టే వంటి ఎన్నో అవరోధాలను ఎదుర్కొని యాదాద్రి ప్లాంట్‌ను దాదాపు పూర్తి చేశాం. అయినా, వాస్తవాలకు విరుద్ధంగా పనులు అస్సలు కాలేదన్నట్లు మీరు వ్యాఖ్యానించడం అసమంజసం. దురుద్దేశం ఆపాదించేలా నిందలు వేశారు. జ్యుడిషియల్ కమిషన్ నియమ నిబంధనల్లో దీని గురించి అసలు ప్రస్తావనే లేదు. అయినా, దాని గురించి మాట్లాడి మీరు పరిధి దాటి వ్యవహరించారు. గత ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే మీ ధోరణికి ఇది నిదర్శనం.

ఛత్తీస్‌గఢ్‌తో 2014లో తెలంగాణ విద్యుత్తు కొనుగోలు ఒప్పందం (పీపీఏ) చేసుకుంది. ఆ ఏడాదే యూనిట్ రూ.4.94 చొప్పున తమిళనాడు; యూనిట్ రూ.4.33 చొప్పున కర్ణాటక పీపీఏ చేసుకున్నాయి. తెలంగాణ మాత్రం యూనిట్ రూ.3.90కే కొంది. అయినా, తెలంగాణ ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చిందని మీరు ఎలా వ్యాఖ్యానిస్తారు!?

పీపీఏ కుదుర్చుకునే సమయంలో తాము మార్వా విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు ఇస్తామని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. మార్వా విద్యుత్తు కొనుగోలుకు పీపీఏ చేసుకోవడం జరిగింది. ఎంవోయూలోనే అప్‌కమింగ్ మార్వా ప్రాజెక్టు అని స్పష్టంగా ఉంది. అయినా, మార్వా ప్లాంటే ఉనికిలో లేదన్నట్లు మీరు ఎలా మాట్లాడతారు!? పీపీఏలన్నీ ప్లాంట్ల నిర్మాణం ప్రారంభించడానికి ముందే జరుగుతాయన్న వాస్తవాన్ని విస్మరించి మాట్లాడడం అత్యంత దురదృష్టకరం.

రాజకీయ కక్షతో నన్ను, అప్పటి మా ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాల్జేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కరెంటు కోసం అంగలార్చిన తెలంగాణలో అన్ని రంగాలకూ 24 గంటల నాణ్యమైన కరెంటును మేం ఇచ్చాం. దీనిని తక్కువ చేసి చూపించడానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రయత్నించడమే అత్యంత దురదృష్టకరం అనుకుంటే.. కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న మీరు విలేకరుల సమావేశంలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం బాధాకరం. విచారణ కమిషన్ సంప్రదాయాలకు విరుద్ధంగా, విచారణ పూర్తి కాకముందే విలేకరుల సమావేశం నిర్వహించారు. విచారణ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మీరు చేసిన ఏ వ్యాఖ్యను గమనించినా మీరు గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివేదిక ఇవ్వాలన్న అభిప్రాయంతోనే మాట్లాడుతున్నట్లు స్పష్టమవుతోంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు విద్యుత్ రంగం అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. అప్పట్లో రాష్ట్ర స్థాపిత విద్యుత్ సామర్థ్యం 7778 మెగావాట్లు. ఆ తర్వాత తీసుకున్న నిర్ణయాలతో అది 20 వేల మెగావాట్లకు చేరింది. అన్ని రంగాలకు 24 గంటలపాటు కరెంట్ ఇచ్చే ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. 2014లో తెలంగాణ విద్యుత్ వినియోగం 1,196 యూనిట్లు కాగా... పదేళ్లలో 2,349 యూనిట్లకు చేరింది. ఈ విజయాలను ఆషామాషీగా సాధించలేదు.

> న్యాయ ప్రాధికార సంస్థలైన ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్సీ)లు వెలువరించిన తీర్పులపై విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన మీరు ప్రభుత్వానికి సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విచారకరం. చట్టవిరుద్ధంగా విచారణ ప్రారంభించారు. అనేక విషయాలను సమగ్రంగా పరిశీలించకుండా, పరిశీలన చేయకుండా పత్రికా విలేకరుల సమావేశంలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. విచారణ పూర్తి కాకముందే తీర్పు ఇచ్చినట్లు మీ మాటలున్నాయి. మీ విచారణలో నిష్పాక్షికత కనిపించడం లేదు. మీకు అసలు విచారణార్హత లేదు. విచారణ నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.
>
> మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్



## చట్టబద్ధ కమిషన్‌నే తప్పుబడతారా?

- చైర్మన్‌ను వైదొలగాలని బెదిరించడం ధిక్కారమే
- కమిషన్ ఏర్పాటు తప్పయితే కోర్టుకు ఎందుకు వెళ్లలేదు?
- మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం



హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేసిన విద్యుత్తు కొనుగోళ్ల వ్యవహారంపై విచారణ జరుపుతున్న జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను మాజీ సీఎం కేసీఆర్ తప్పుబట్టడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చట్టబద్ధంగా ఏర్పాటు చేసిన కమిషన్ ఛైర్మన్‌ను విచారణ నుంచి వైదొలగాలని బెదిరించడం ముమ్మాటికీ ధిక్కారమే నన్నారు. కమిషన్ ఏర్పాటే తప్పయితే కేసీఆర్ కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. విచారణ కమిషన్‌ను ధిక్కరించిన కేసీఆర్‌ను తక్షణమే అరెస్టు చేసి విద్యుత్తు కొనుగోళ్లలో జరిగిన అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, వాస్తవాలను నిగ్గు తేల్చా లన్నారు. ఈ మేరకు బండి సంజయ్ శనివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. జస్టిస్ నర్సింహారెడ్డిని అవమానించేలా కేసీఆర్ రాతపూర్వకంగా ఇచ్చిన వివరణ ఆయన అహంకారానికి నిదర్శనమని, ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికి.. చట్టబద్ధమైన కమిషన్‌కు గౌరవం ఇవ్వాలనే విజ్ఞత లేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కేసీఆర్ తన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి ఈఆర్సీని వివాదంలోకి లాగి బదనాం చేయడం తగదని హితవు పలికారు.

### వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం..

జస్టిస్ నర్సింహారెడ్డిని తెలంగాణ బిడ్డ అని సంబోధిస్తూనే ఆయన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా కేసీఆర్ వ్యవహరించడం దుర్మార్గమని సంజయ్ అన్నారు. నర్సింహారెడ్డి తెలంగాణ బిడ్డ కాబట్టే.. ప్రత్యేక తెలంగాణకు వ్యతిరేకంగా కేంద్రానికి జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ పంపిన రహస్య నివేదికను బహిరంగ పరచాలని ఆదేశాలు జారీ చేశారని, ఆ కమిటీలోని 8వ చాప్టర్ అంశాలను బట్టబయలు చేయించారని గుర్తు చేశారు. కేసీఆర్ తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఏ స్థాయి వ్యక్తుల ప్రతిష్ఠనైనా దెబ్బతీసేందుకు వెనుకాడరన్నారు. గతంలో ఎమ్మెల్యేల కొనుగోళ్ల డ్రామా వ్యవహారం కోర్టు పరిధిలో ఉండగా కేసీఆర్ ప్రెస్‌మీట్ నిర్వహించి న్యాయస్థానాలను ప్రభావితం చేసేలా బీజేపీపై అభాండాలు మోపారని ఆరోపించారు. విద్యుత్తు కొనుగోళ్లతోపాటు కాళేశ్వరం, గొర్రెల పంపిణీలో అక్రమాలపై విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందని సంజయ్ విమర్శించారు. కేసీఆర్‌తోపాటు అప్పటి మంత్రులు, అధికారులు అక్రమాలకు పాల్పడ్డట్లు ఆధారాలున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యులను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు.

## జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్ పరిధిని విస్తరించాలి

- విచారణ కమిషన్ గడువునూ పెంచాలి:ఎన్వీఎస్ఎస్

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం వ్యవహారానికి సంబంధించి ఏర్పాటైన జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్ పరిధిని విస్తరించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. కమిషన్ పరిధిని అధికారులను విచారించడానికి మాత్రమే కాకుండా నాడు ఆరోపణలు చేసిన రాజకీయ నాయకులను కూడా విచారించి ఆధారాలు తీసుకోవాలన్నారు. విచారణ కమిషన్ గడువును కూడా పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కనబడుట లేదు

- ఆచూకీ చెప్పిన వారికి తగిన బహుమానం
- గజ్వేల్‌లో పోస్టర్లు అంటించిన బీజేపీ నేతలు




గజ్వేల్, జూన్ 15: గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికలైనప్పటి నుంచి కనబడటం లేదని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే చెప్పాలని, వారికి తగిన బహుమానం ఇస్తామని బీజేపీ నాయకులు గజ్వేల్ పట్టణంలో పోస్టర్లు వేశారు. తర్వాత పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. 'కేసీఆర్ ఎక్కడున్నా గజ్వేల్‌కు రావాలి' అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్ గుర్తులుగా "తెల్ల చొక్కా, తెల్ల ప్యాంటు లేదా తెల్ల లుంగీ. నెత్తి మీద టోపీ. భయంకరమైన హిందువు. 80వేల పుస్తకాలు చదివిన వ్యక్తి. ఎకరాకు కోటి రూపాయలు సంపాదించే వ్యక్తి" అని పోస్టర్లలో రాసుకొచ్చారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజల పేరిట ఈ పోస్టర్లను ముద్రించారు.

## ఆర్టీసీ డిజిటల్ టికెట్ల టెండర్లలో గోల్‌మాల్ : క్రిశాంక్

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ డిజిటల్ టికెట్ల టెండర్లలో భారీ గోల్‌మాల్ జరిగిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ శనివారం ఆరోపించారు. ఈ టెండర్ల అంశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అవినీతికి పాల్పడ్డారని అన్నారు. జనవరి 11న ఆర్టీసీ డిజిటల్ టిక్కెట్ల కోసం ఇచ్చిన టెండర్‌ను రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచారని క్రిశాంక్ చెప్పారు. అయితే, ఈ టెండర్‌లో ఎన్ని సంస్థలు వచ్చాయి? ఎంత మొత్తానికి కోట్ చేశారు? తదితర వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టలేదని తెలిపారు. కానీ, ఛలో మొబిలిటీ అనే సంస్థకు కాంట్రాక్టు కట్టబెట్టారని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆర్టీసీ డిజిటల్ టికెట్ల టెండరులో జరిగిన అవినీతిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని క్రిశాంక్ కోరారు.

## కమీషన్లు ఇవ్వలేదనే కౌశిక్‌రెడ్డి ఆరోపణలు

- ఫ్లైయాష్ రవాణాపై అవగాహన లేకుండా వ్యాఖ్యలు
- కరీంనగర్ జిల్లా ఫ్లైయాష్ లారీ ట్రాన్స్‌పోర్టర్లు

పంజాగుట్ట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తాము కమీషన్లు ఇవ్వలేదన్న అక్కసుతోనే ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫ్లైయాష్ రవాణాపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఫ్లైయాష్ లారీ ట్రాన్స్‌పోర్టర్లు ఆరోపించారు. కౌశిక్‌రెడ్డి ఎంత కమీషన్ డిమాండ్ చేశారు? ఏ రోజు లోపు ఇవ్వాలన్నారు? వంటి వివరాలు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. మరో సారి తమ లారీలను అడ్డుకోవాలని చూస్తే ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కరీంనగర్ జిల్లాకు చెందిన ఫ్లైయాష్ లారీ ట్రాన్స్‌పోర్టర్లు ఎంఏ సమద్ నవాబ్, మల్లేశం, ఫరీద్, రవీందర్, శ్రీపాల్, రాజేష్, ఇక్బాల్ తదితరులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. బసంత్ నగర్‌లోని బూడిద నిల్వ కేంద్రం నుంచి ఫ్లైయాష్‌ను ఉచితంగా తరలించేందుకు ఎన్టీపీసీ ఆన్‌లైన్ ద్వారా టెండర్లు ఆహ్వానిస్తుంటుందని తెలిపారు. ఫ్లైయాష్‌ను గ్రావెల్ (మొరం) అందుబాటులో లేని ప్రాంతాల్లో జాతీయ రహదారుల నిర్మాణానికి ఉపయోగించాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగానే ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేకు ఫ్లైయాష్‌ను తరలిస్తున్నామన్నారు. వృథా మెటీరియల్‌కు వే బిల్లులు ఉండవనే విషయాన్ని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తెలుసుకోవాలని సూచించారు. జిల్లాకు చెందిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు.

## రమేష్ కార్తీక్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు

- కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం
- 'ఢావ్లో' కథా సంపుటికి గౌరవం
- చంద్రశేఖర్ ఆజాద్‌కు బాల సాహిత్య పురస్కారం
- 'మాయాలోకం' నవల ఎంపిక






న్యూఢిల్లీ, హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ 2024 సంవత్సరానికి యువ, బాలసాహిత్య పురస్కారాలను ప్రకటించింది. నిజామాబాద్‌కు చెందిన బంజారా యువ రచయిత రమేష్ కార్తీక్ నాయక్‌కు ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ కథా రచయిత పి.చంద్రశేఖర్ ఆజాద్‌ను బాల సాహిత్య పురస్కారం వరించింది. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన జరిగిన కార్యనిర్వాహక మండలి సమావేశంలో ఈ ఏడాదికి 23 మంది యువ రచయితలకు యువ పురస్కారాలు, 24 మంది రచయితలకు బాల సాహిత్య పురస్కారాలను అందించాలని నిర్ణయించినట్లు అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు శనివారం వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం వివేక్‌నగర్ తండాలో జన్మించిన రమేష్ కార్తీక్ నాయక్ రచించిన 'ఢావ్లో' గోర్ బంజారా కథా సంపుటి సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైంది. ప్రొఫెసర్ సూర్యధనుంజయ్, ఆర్.సీతారామారావు, శిఖామణితో కూడిన న్యాయనిర్ణేతల బృందం రమేష్ కార్తీక్ నాయక్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. రమేష్ కార్తిక్ పదో తరగతి నుంచే రచనలు చేస్తున్నారు. ఆయనకు ఇంతకు ముందు రావిశాస్త్రి కథా పురస్కారం, చిలకమర్తి లక్ష్మీనరసింహం పురస్కారాలతోపాటు అనేక అవార్డులు లభించాయి. గోర్ బంజారాల జీవితం, వారి సంస్కృతి, సంప్రదాయాలను 'బల్దేర్ బండి' కవిత్వం, 'ఢావ్లో' కథా సంపుటి, 'చక్ మక్' ఆంగ్ల కవిత్వం ద్వారా అక్షర బద్ధం చేశారు. కార్తీక్ నాయక్ రచించిన 'జారేర్ బాటి (జొన్న రొట్టెలు)' కవితను కాకతీయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఖమ్మంలోని ఓ కళాశాల డిగ్రీ కోర్సు ఐదో సెమిస్టర్‌లో పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. ఆంధ్రా వర్సిటీ ఎంఏ తెలుగు నాలుగో సెమిస్టర్ పాఠ్యాంశాల్లో 'బల్దేర్ బండి' కవితా సంపుటిని చేర్చారు. చాలా రోజుల తర్వాత కలిసిన బంధు మిత్రులను ఆలింగనం చేసుకొని దుఃఖించడం గోర్ బంజారాల సంస్కృతిలో భాగం. అలా కన్నీరు పెట్టడాన్ని లంబాడా భాషలో 'ఢావ్లో' అంటారు. ఆ పేరుతో వెలువడిన కథా సంపుటిలో గిరిజనుల బతుకు చిత్రాన్ని కళ్లకు కట్టే ఎనిమిది కథలు ఉన్నాయని రచయిత చెప్పారు. అందులోని 'పురుడు' కథను వీబీ సౌమ్య ఇంగ్లిష్‌లోకి అనువదించగా.. ప్రముఖ అంతర్జాతీయ జర్నల్ 'ఐవోడబ్ల్యూఏ'లో 'ది బర్త్' పేరుతో ప్రచురితంకావడం విశేషం.

### గోర్ బంజారా సంస్కృతికి దక్కిన గౌరవం : రమేష్ కార్తీక్ నాయక్

తనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం గోర్ బంజారా సంస్కృతికి దక్కిన గౌరవం అని రమేష్ కార్తీక్ నాయక్ అన్నారు. రమేష్ కార్తీక్ నాయక్ యువ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు యాకూబ్, ఆకాశవాణి సిబ్బందితో పాటు పలువురు కవులు, రచయితలు అభినందనలు తెలియజేశారు.






### బాల సాహిత్యంలో ఆజాద్ ప్రయోగాత్మక రచనలు

డీకే చదువుల బాబు, సీహెచ్ లక్ష్మణ చక్రవర్తి, పీఎస్ గోపాలకృష్ణతో కూడిన న్యాయనిర్ణేతల బృందం ఆజాద్‌ను బాల సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసింది. ఆయన రాసిన 'మాయాలోకం' నవల ఈ పురస్కారానికి ఎంపికైంది. పదేళ్లు దాటిన పిల్లల కోసం రాసిన ఈ నవలకు 2021 తానా బాల సాహిత్య పోటీలో బహుమతి లభించింది. చంద్రశేఖర్ ఆజాద్ స్వస్థలం గుంటూరు జిల్లా వెల్లటూరు. ఆయన తొమ్మిది వందలకు పైగా కథలు, 90కి పైగా నవలలు, 'రాధామధు', 'లయ', 'ఎదురీత' తదితర టెలివిజన్ సీరియళ్లకు సంభాషణలు రాశారు. చంద్రశేఖర్ ఆజాద్ బాలల కోసం వందకు పైగా కథలు, పదికి పైగా నవలలు, పలు రేడియో నాటికలు రచించారు. ఎన్ని రచనలు చేసినా, బాల సాహిత్యమే తనకు గుర్తింపు, గౌరవాన్ని తెచ్చాయని చంద్రశేఖర్ ఆజాద్ చెప్పారు. బాల సాహిత్యంలో తన మొట్టమొదటి రచన 'అందమైన పూల తోట' నవల 1983లో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైందని తెలిపారు. కాగా యువ, బాల సాహిత్య పురస్కారాలకు ఎంపికైన వారికి రూ.50 వేల చొప్పున నగదు, రజత పతకాలు అందజేస్తారు.

## కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

- బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలి
- మహా ధర్నాలో కృష్ణయ్య డిమాండ్
- కులగణనకు కమిషన్ వేయాలి: జాజుల



మహాధర్నాలో కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాపోలు ఆనందభాస్కర్ తదితర నేతల అభివాదం

కవాడిగూడ/హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హామీ మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే సమగ్ర కులగణన చేపట్టి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 6 నెలలు గడిచినా ఇచ్చిన హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్‌తో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణయ్య, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. కులగణన పూర్తైన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల సాధన కోసం బీసీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. మరోవైపు, రాష్ట్రంలో కులగణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కూడా డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణనకు ప్రభుత్వం తక్షణమే స్వతంత్ర కమిషన్‌ను నియమించాలన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు 19న హైదరాబాద్‌లో "సమగ్ర కులగణన సవాళ్లు- స్వతంత్ర కమిషన్ ఏర్పాటు, బీసీ రిజర్వేషన్ పెంపు" అంశంపై బీసీ మేధావులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య దృశ్యం
ఆదివారం • 16 జూన్ 2024

# వెబ్‌సిరీస్‌కు సై

పెద్దతెరపైన కథానాయికలుగా బిజీగా ఉన్నా సరే ఓటీటీ అరంగేట్రానికి ఉత్సాహం చూపుతున్నారు కథానాయికలు. మంచి కథ కుదిరితే వెబ్ సిరీస్‌లు, ఒరిజినల్ మూవీస్ చేయడానికి 'సై' అంటున్నారు. 'ది ఫ్యామిలీమాన్ 2' లాంటి సిరీస్‌లతో సమంత లాంటి అగ్ర కథానాయికలు సైతం మంచి విజయాలను దక్కించుకున్నారు కూడా. కొందరు హీరోయిన్లు సినిమాలతో సమాంతరంగా వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. ప్రస్తుతం డిజిటల్ ఎంట్రీలోనూ సత్తా చాటుతున్న హీరోయిన్ల గురించి తెలుసుకుందాం.









### కాల్ మీ బె

విజయ్ దేవరకొండ 'లైగర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ భామ అనన్యపాండే. నిర్మాత కరణ్ జోహార్ 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' చిత్రంతో అనన్యను బాలీవుడ్ చిత్రసీమకు పరిచయం చేశారు. ఇప్పుడు అనన్యపాండే ఓటీటీ అరంగేట్రం కూడా కరణ్ ప్రాజెక్ట్‌తోనే జరగబోతోంది. అనన్యపాండేతో 'కాల్ మీ బె' అనే హిందీ వెబ్ సిరీస్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో ఆమె బెల్లా బె చౌదరి అనే పాత్రలో కనిపించనున్నారు. శ్రీమంతుల కుటుంబానికి చెందిన యువతి ఓ భారీ కుంభకోణానికి పాల్పడిన నేపథ్యంలో కథ సాగుతుంది. ఇది అమెజాన్ ప్రైమ్‌లో సెప్టెంబర్ 06 నుంచి స్ట్రీమింగ్ అవనుంది. కొలిన్ డి కున్హా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం అనన్య కంట్రోల్, ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ సి శంకరన్ నాయర్ చిత్రాల్లో నటిస్తున్నారు.

### ఓటీటీలో కీర్తి బావుటా

దక్షిణాది చిత్ర పరిశ్రమలో చక్కని స్టార్‌డమ్‌తో కొనసాగుతున్న కొద్దిమంది కథానాయికల్లో కీర్తిసురేశ్ ఒకరు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో 'బేబీ జాన్' చిత్రం చేస్తున్నారు. 'రివాల్వర్ రీటా, కన్నివేడి' అనే లేడీ ఓరియంటెడ్ చిత్రాలు సెట్స్‌పైన ఉన్నాయి. త్వరలోనే 'ఉప్పు కప్పురంబు' అనే ఒరిజినల్ మూవీతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు కీర్తి. సుహాస్ లీడ్‌రోల్ పోషిస్తున్న ఈ చిత్రాన్ని ఐవీ శశి తెరకెక్కిస్తున్నారు. రాధికా లావు నిర్మిస్తున్నారు. ఓ మారుమూల పల్లెలో ప్రజలు తమకు ఎదురైన ఆకస్మిక ప్రమాదాన్నుంచి ఎలా బయటపడ్డారు అనే నేపథ్యంలో కథ సాగుతుంది. నటనకు ఆస్కారమున్న పాత్ర కావడంతో కీర్తిసురేశ్ ఈ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పారట. అమెజాన్ ప్రైమ్‌లో ఈ చిత్రం స్ట్రీమింగ్ అవనుంది.

దీంతో పాటు కీర్తి సురేశ్ హిందీలో 'అక్క' అనే వెబ్‌సిరీస్ కూడా చేస్తున్నారు. ధరమ్ రాజ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ పీరియాడిక్ రివేంజ్ థ్రిల్లర్‌లో రాధికా ఆప్టే కీలకపాత్ర పోషిస్తున్నారు. గతంలో కీర్తి ఎన్నడూ చేయని యాక్షన్ సన్నివేశాల్లో అలరించబోతున్నారని యూనిట్ తెలిపింది. ముఖ్యంగా ఇద్దరు హీరోయిన్ల మధ్య వచ్చే పోరాట ఘట్టాలు సిరీస్‌కు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయని టాక్. యశ్‌రాజ్ ఫిలింస్ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది.

### సీటాడెల్‌తో సమంత

వెండితెరపై అగ్ర కథానాయికగా ఎదిగిన సమంత 'ది ఫ్యామిలీ మాన్ 2' సిరీస్‌తో ఓటీటీ ఎంట్రీ ఇచ్చారు. నెగెటివ్ షేడ్స్ ఉన్న రాజీ అనే పాత్రలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. త్వరలోనే మరోసారి ఓటీటీలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆమె నటించిన 'సీటాడెల్: హనీ బన్నీ' సిరీస్ త్వరలో అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఇందులో వరుణ్ ధావన్ కథానాయకుడు. హాలీవుడ్‌లో తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సీటాడెల్'కు ఇది ఇండియన్ వెర్షన్. అక్కడ ప్రియాంక చోప్రా నటించగా, హిందీలో ఆ పాత్రను సమంత పోషిస్తున్నారు. ఆమె నటించిన 'ది ఫ్యామిలీ మాన్ 2' కు దర్శకత్వం వహించిన రాజ్ అండ్ డీకే ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. ప్రస్తుతం సమంత లీడ్‌రోల్‌లో స్వీయ నిర్మాణంలో కొత్త చిత్రాన్ని ప్రకటించారు. దీనికి 'బంగారం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు.

### బృందతో త్రిష

మధ్యలో హీరోయిన్‌గా కెరీర్ కాస్త మందగించినా 'పొన్నియిన్ సెల్వన్' చిత్రంతో తిరిగి పుంజుకున్నారు త్రిష. ఇప్పుడు వరుస చిత్రాలతో యువ కథానాయికలకు దీటుగా సినిమాలు చేస్తున్నారు. దక్షిణాది అగ్రహీరోల సరసన నటిస్తున్నారు. ఇప్పుడు ఆమె డిజిటల్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. ఆమె నటించిన తొలి తెలుగు వెబ్‌సిరీస్ 'బృంద' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఈ సిరీస్‌లో త్రిష పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. సూర్య వంగల ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించాడు. తొలి సీజన్ చిత్రీకరణ పూర్తి చేశారు. సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ అవనున్నట్లు తెలుస్తోంది. త్రిష తెలుగులో చిరంజీవి సరసన 'విశ్వంభర' చిత్రంలో నటిస్తున్నారు.

### పార్టనర్ తమన్నా

అతిథి పాత్రలు, ప్రత్యేక గీతాలతో ప్రేక్షకులను అలరిస్తున్న సీనియర్ భామ తమన్నా భాటియా. త్వరలో ఆమె మరో వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. మద్యం వ్యాపారంలో అడుగుపెట్టి విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగించిన మహిళ కథతో 'డేరింగ్ పార్ట్‌నర్' సిరీస్ తెరకెక్కుతోంది. ఇందులో తమన్నా లీడ్‌రోల్ పోషిస్తున్నారు. అర్చిత్ కుమార్, నిషాంత్ నాయక్ తెరకెక్కిస్తున్న ఈ సిరీస్‌ను కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. తమన్నా ప్రస్తుతం తెలుగులో 'ఓదెల 2' చిత్రం చేస్తున్నారు.


### మరో సిరీస్‌తో...

రణ్‌బీర్ కపూర్ నటించిన 'రాక్‌స్టార్' చిత్రంతో హీరోయిన్‌గా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు నర్గీస్ ఫక్రీ. ఆ తర్వాత పలు హిట్ చిత్రాల్లో నటించి హీరోయిన్‌గా నిలదొక్కుకున్నారు. పవన్ కల్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రం ద్వారా త్వరలోనే తెలుగు ప్రేక్షకులను అలరించబోతున్నారు నర్గీస్. సినిమాలతో పాటు వెబ్‌సిరీస్‌లపైనా ఆమె దృష్టి సారించారు. గతేడాది 'టట్లూబాజ్' సిరీస్‌తో ఓటీటీ ప్రేక్షకులకు చేరువయ్యారు. తాజాగా ఆమె మరో సిరీస్‌కు ఎస్ చెప్పారని బాలీవుడ్ టాక్. ధర్మా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సిరీస్‌లో ఆమె లాయర్ పాత్రలో కనిపించనున్నారట.

### ప్రయోగాలకు వేదికగా

మాధ్యమం ఏదైనా అభిమానులను అలరించడమే హీరో, హీరోయిన్ల లక్ష్యం. ఓటీటీ వేదికలు దేశ వ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువవుతున్నాయి. దీంతో భారీ సంఖ్యలో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి అవకాశం ఉండడంతో కథానాయికలు ఈ వైపు అడుగులు వేస్తున్నారు. ఓటీటీ దిగ్గజ సంస్థలు నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ లాంటివి భారీ పారితోషికాలను సైతం ముట్ట చెబుతున్నాయి. అలాగే తమ నటలోని కొత్త కోణాలను పరిచయం చేసే అవకాశం నటీనటులకు ఓటీటీల్లో దక్కుతోంది. పెద్ద తెరపై సాధ్యంకాని ప్రయోగాలు, పాత్రలను చేసేందుకు ఓటీటీని వేదికగా మార్చుకున్నారు. కాజల్ అగర్వాల్, ఇలియానా, రెజీనా, అమలాపాల్, రాశీఖన్నా లాంటి సీనియర్ హీరోయిన్లు సైతం డిజిటల్ బాట పట్టి పలు వెబ్ ఫిల్మ్స్, సిరీస్‌లతో అలరిస్తున్నారు. •

## బాధను ఓర్చుకుంటూ షూటింగ్‌లో...



రవితేజ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఇండస్ట్రీలో అనేక కష్టాలు పడి పైకొచ్చిన వ్యక్తిగా రవితేజకు మంచి పేరుంది. పనిపట్ల రవితేజకు ఉన్న అంకిత భావాన్ని ప్రశంసిస్తూ హరీశ్ శంకర్ 'మిస్టర్ బచ్చన్' షూటింగ్‌లో తీసిన కొన్ని ఫొటోలను షేర్ చేశారు. ఓ ఫొటోలో రవితేజ తీవ్రమైన మెడనొప్పితో బాధపడుతుండగా, నొప్పి తగ్గడానికి రవితేజ మెడపై బ్యాండ్ పెట్టి పట్టుకున్నారు హరీశ్ శంకర్. ఆ ఫొటోపై హరీశ్ శంకర్ స్పందిస్తూ 'థాంక్యూ అన్నయ్యా, ప్రతి రోజూ నీ కష్టంతో మాలో స్ఫూర్తిని నింపుతున్నావు. తీవ్రమైన మెడనొప్పి ఇబ్బందిపెడుతున్నా ఆ బాధను ఓర్చుకుంటూ షూటింగ్‌లో పాల్గొంటున్నావు. మాస్ మహారాజా డెడికేషన్‌కు హ్యాట్సాఫ్' అని హరీశ్ శంకర్ పేర్కొన్నారు. హరీశ్ శంకర్, రవితేజ కలయికలో వస్తున్న మూడో చిత్రమిది. ఇందులో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈనెల 17న మేకర్స్ టీజర్‌ను విడుదల చేయనున్నారు.

## ప్రైమ్‌లో ఫెదరర్ కథ



ప్రముఖ టెన్నిస్ ప్లేయర్ రోజర్ ఫెదరర్ జీవిత కథ ఆధారంగా అమెజాన్ ప్రైమ్ ఓ డాక్యుమెంటరీని రూపొందిస్తోంది. దీనికి 'ఫెదరర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'ట్వెల్వ్ ఫైనల్ డేస్' అనేది ఉపశీర్షిక. ఈ డాక్యుమెంటరీ స్ట్రీమింగ్ డేట్ ఖరారైంది. ఈ నెల 20 నుంచి 'ఫెదరర్' స్ట్రీమింగ్ అవ్వనున్నట్లు ఓటీటీ సంస్థ ప్రకటించింది. ఆసిఫ్ కపాడియా, జోసబియా దర్శకత్వం వహించారు. స్విట్జర్లాండ్‌కు చెందిన ఫెదరర్ తన కెరీర్‌లో 20 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను సాధించడంతో పాటు మరెన్నో ప్రతిష్ఠాత్మక పోటీల్లో విజేతగా నిలిచాడు. 2022లో ఆయన ఆట నుంచి రిటైర్‌మెంట్ ప్రకటించారు. లండన్‌లో ఇటీవలే ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనకు ఫెదరర్ హాజరయ్యారు. తన జీవితాన్ని తెరమీద చూసుకుంటూ కంటతడి పెట్టారు ఫెదరర్. తను జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లను తెరకెక్కించిన తీరును ప్రశంసించారు.

## సన్నీ స్పెషల్



నటుడిగా, కొరియోగ్రాఫర్‌గా, దర్శకుడిగా మంచి విజయాలను దక్కించుకున్నారు ప్రభుదేవా. ఇప్పుడు ఆయన హీరోగా వరుస చిత్రాలను సెట్స్‌పైకి తీసుకెళుతున్నారు. ఆయన నటించిన 'భగీర' చిత్రం ఇటీవలే విడుదలైంది. 'జాలియో జింఖానా, పేటరాప్, గోట్' చిత్రాల్లో నటిస్తున్నారు. 'పేటరాప్' చిత్రంలో వేదిక కథానాయికగా నటిస్తున్నారు. బాలీవుడ్ నటి సన్నీలియోన్ ఈ చిత్రంలో ప్రత్యేక గీతంలో అలరించనున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా తెలిపింది. గతంలో పలు తమిళ చిత్రాల్లో నటించారు సన్నీ. చిన్న బ్రేక్ తర్వాత ఆమె మళ్లీ కోలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు.

## ఈ నెల 23న సోనాక్షి సిన్హా వివాహం




మరో బాలీవుడ్ జంట పెళ్లి పీటలెక్కబోతోంది. హీరోయిన్ సోనాక్షి సిన్హా తన ప్రియుడు జహీర్ ఇక్బాల్ మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెడుతున్నారు. సోనాక్షి, జహీర్ పెళ్లి గురించి కొన్ని రోజులుగా మీడియాలో వార్తలు వస్తున్నాయి. వాటిని ఈ జంట అధికారికంగా ధృవీకరించింది. ఈ నెల 23న ముంబైలో వీరి వివాహం జరగనుంది. ఓ మ్యాగజైన్ కవర్ పేజీలా డిజైన్ చేసిన వీరి పెళ్లి పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దానిపైన సోనాక్షిని ముద్దుపెట్టుకుంటున్న జహీర్ ఫొటో ఉంది. 'మీరు వింటున్న వార్తలు నిజమే...అధికారికంగా మా పెళ్లి విషయాన్ని ప్రకటిస్తున్నాం' అని ఆహ్వాన పత్రికపై ముద్రించారు. దాంతో పాటు విడుదల చేసిన ఆడియో సందేశంలో 'గర్ల్‌ఫ్రెండ్, బాయ్‌ఫ్రెండ్ లాంటి పుకార్ల నుంచి భార్యా, భర్తలుగా మారే క్షణం కోసం ఎదురుచూస్తున్నాం. జూన్ 23న మీ పనులన్నీ పక్కనపెట్టి మాతో కలసి పార్టీ చేసుకోండి. ఏడేళ్లుగా మేం ఇద్దరం కలసి ఉన్నాం. మా ఇద్దరినీ ఒక్కటి చేసిన ఎన్నో అభిరుచులు మమ్మల్ని ఇక్కడి వరకూ తీసుకొచ్చాయి. మీ ఆశీస్సులు ఇవ్వండి' అని సోనాక్షి, జహీర్ కోరారు. వీరిద్దరూ ఏడేళ్లుగా డేటింగ్‌లో ఉన్నారు. 2022లో వచ్చిన 'డబుల్‌ఎక్స్‌ఎల్' మూవీలో వీరిద్దరూ కలసి నటించారు. అయితే నా కూతురు (సోనాక్షిసిన్హా) తన పెళ్లి గురించి నాకేం చెప్పలేదు అంటూ శత్రుఘ్నసిన్హా కొన్ని రోజుల క్రితం చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

## రవీనా రూ. వంద కోట్ల దావా



సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న వ్యక్తిపై రవీనాటాండన్ రూ. 100 కోట్లకు పరువు నష్టం దావా వేశారు. రవీనాటాండన్ కొందరితో గొడవపడుతున్న వీడియో ఒకటి కొన్ని రోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. జర్నలిస్ట్‌గా ప్రచారం చేసుకుంటున్న మొహ్సిన్ షేక్ అనే వ్యక్తి ఆ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రవీనా టాండన్ మద్యం మత్తులో ఉన్నారనీ, ర్యాష్ డ్రైవింగ్ చేయడం వల్ల ముగ్గురు గాయపడ్డారనీ, దాంతో వారి బంధువులు రవీనాటాండన్‌పై దాడి చేశారని మొహ్సిన్ ఆ వీడియోకు వివరణ ఇచ్చారు. దీంతో సోషల్ మీడియాలో చాలా మంది రవీనాను కించపరుస్తూ కామెంట్లు పెట్టారు. అయితే అక్కడ జరిగిన విషయం వేరు అని రవీనా లాయర్ సనాఖాన్ చెప్పారు. 'డ్రైవర్ కారును రివర్స్ చేసే క్రమంలో అక్కడున్న కొందరు వ్యక్తులకు దగ్గరగా వెళ్లడంతో గొడవ జరిగింది. వారు డ్రైవర్ పైన దాడి చేసేందుకు ప్రయత్నించగా రవీనా కాపాడేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో ఆమె మద్యం తీసుకోలేదు అని ముంబై పోలీసులు తమ స్టేట్‌మెంట్‌లో తెలిపారు' అని చెప్పారు. దాంతో తనపై తప్పుగా ప్రచారం చేసిన మొహ్సిన్‌కు రూ. 100 కోట్లకు పరువు నష్టం నోటీసులు పంపారు.

## జూలైలో ప్రేక్షకుల ముందుకు



బాలీవుడ్ అగ్రహీరో అక్షయ్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సర్ఫిరా'. సూర్య హీరోగా నటించిన 'ఆకాశం నీ హద్దురా' చిత్రానికి ఇది రీమేక్. మాతృకకు దర్శకత్వం వహించిన సుధా కొంగర రీమేక్‌ను తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రం విడుదల తేదీని యూనిట్ ప్రకటించింది. జూలై 12న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఆకాశం కేసి తదేకంగా చూస్తున్న లుక్‌లో అక్షయ్ ఆకట్టుకున్నారు. సినిమా టీజర్‌ను ఈ నెల 20న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అరుణ్ భాటియా, విక్రమ్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

### ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

| ఓటీటీ వేదిక | సినిమా/సిరీస్ | విడుదల తేదీ |
|---|---|---|
| **నెట్‌ఫ్లిక్స్** | | |
| ఏజెంట్స్ ఆఫ్ మిస్టరీ | కొరియన్ సిరీస్ | జూన్ 18 |
| అవుట్‌స్టాండింగ్ | హాలీవుడ్ మూవీ | జూన్ 18 |
| మహరాజ్ | హిందీ సిరీస్ | జూన్ 19 |
| అమెరికాస్ స్వీట్‌హార్ట్స్ | వెబ్ సిరీస్ | జూన్ 20 |
| కోటా ఫ్యాక్టరీ 3 | హిందీ సిరీస్ | జూన్ 20 |
| నడికర్ | మలయాళ చిత్రం | జూన్ 21 |
| ట్రిగర్ వార్నింగ్ | హాలీవుడ్ మూవీ | జూన్ 21 |
| **డిస్నీ ప్లస్ హాట్‌స్టార్** | | |
| అరణ్మనై 4 | తమిళ చిత్రం | జూన్ 21 |
| బ్యాడ్ కాప్ | హిందీ చిత్రం | జూన్ 21 |
| **జియో సినిమా** | | |
| ది హోల్డోవర్స్ | ఆంగ్ల చిత్రం | జూన్ 16 |
| హౌస్ ఆఫ్ ది డ్రాగన్ 2 | వెబ్ సిరీస్ | జూన్ 17 |
| ఇండస్ట్రీ | వెబ్ సిరీస్ | జూన్ 19 |
| బిగ్‌బాస్ ఓటీటీ 3 | రియాలిటీ షో | జూన్ 21 |









మనం పెట్టుకునే బెల్ట్, ఉపయోగించే బ్యాగ్, వేసుకునే చెప్పులు చాలావరకు తోలు ఉత్పత్తులు. జాగ్రత్తగా వినియోగించుకుంటే చాలా కాలం మన్నిక కలిగి ఉంటాయి. నిజానికి ఒక జంతువుకు సంబంధించిన తోలు లేదంటే చర్మం మూడు రోజులకే కుళ్ళిపోయి నాశనమవుతుంది, వాసన వస్తుంది. దాన్ని అలా కానివ్వకుండా రసాయనాలు/ వెజిటబుల్ మెటీరియల్‌తో సంరక్షించి, ఉత్పత్తికి అనువైనదిగా మార్చడం మొదలుకుని తుది ఉత్పత్తి వరకు యావత్తు వ్యవహారాలపై అవగాహన కలిగించేదే లెదర్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత కోర్సులు ఉన్నాయి.

# విలక్షణ కెరీర్‌కు వీలుకల్పించే లెదర్ టెక్నాలజీ

ఫుట్‌వేర్(పాదరక్షలు), లెదర్ గార్మెంట్స్(తోలు వస్తువులు) ఉత్పత్తిలో మన దేశం రెండో స్థానంలో ఉంది. తోళ్ళు/చర్మాల ఉత్పత్తిలో ఇండియా వాటా పదమూడు శాతం. భారతదేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో వేలకొద్దీ లెదర్ గూడ్స్, ఫుట్‌వేర్ పరిశ్రమలు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. అమెరికా, యూరప్ తదితర పాశ్చాత్య దేశాల్లో లేబర్ వ్యయాలు అధికం. ఫలితంగా లెదర్, లెదర్ గూడ్స్, ఫుట్‌వేర్ రేట్లు కూడా అధికంగా ఉంటాయి. అదే ఇండియా విషయానికి వస్తే, లేబర్ ఖర్చులు తక్కువ. అత్యున్నత నైపుణ్యాలు ఉన్న లేబర్ చాలా ఎక్కువ. ఉత్పత్తి వ్యయం కూడా మనదేశంలోనే తక్కువ. ఫలితంగా క్లార్క్స్, బాలే, ఆడిడాస్, ఎక్కో, బుగతి, రీబాక్, టింబర్‌లాండ్, కొలెహాన్, నైక్ వంటి అంతర్జాతీయ బ్రాండ్లు తమ ఉత్పత్తి కేంద్రాలను మనదేశానికి మార్చుకున్నాయి.

## తెలంగాణలో ఏకైక కాలేజీ

తెలంగాణ - హైదరాబాద్‌లో మాత్రమే గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ఉంది. మెహదీపట్నం నుంచి గచ్చిబౌలి వెళ్లే దారిలోని రాయదర్గ వద్ద దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ఏఐసీటీఈ ఆమోదంతో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌కు అనుబంధంగా ఆరంభమైంది. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తోంది.

- లెదర్ గూడ్స్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా మూడు యూనివర్సిటీల కోటా అమలవుతుంది. ఎస్ఎస్‌సీ(టెన్త్) ఉత్తీర్ణులు ఇందులో చేసేందుకు అర్హులు. ఈ కోర్సులో చేరేందుకు గరిష్ఠ వయోపరిమితి అంటూ ఏమీ లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది. ఈ రెండు కోర్సుల బోధనకు అవసరమైన సదుపాయాలన్నీ ఉన్నాయి. ఫుట్‌వేర్ ఫ్యాషన్ స్టూడియో, స్మార్ట్ తరగతి గదులు, అర్హతలకు తోడు అనుభవం ఉన్న ఫ్యాకల్టీ, డిజిటల్ లైబ్రరీ, ఈ బుక్స్, ఈ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఆధునిక ల్యాబ్స్ - మెషినరీ, బాలురకు హాస్టల్ సదుపాయం కూడా ఉంది.

- కోర్సు కాలవ్యవధి ఆరు సెమిస్టర్లు/మూడేళ్ళు. మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ కోర్సులో లెదర్‌కు సంబంధించి డిజైన్, ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ కొత్తగా మెటీరియల్ టెక్నిక్‌ను బోధిస్తారు. ముడిపదార్థంగా తోలుతో మొదలు పెట్టి ఫినిషింగ్ ప్రొడక్ట్ వరకు ప్రతి అంశాన్నీ థియరీలో భాగంగా చెబుతారు. చర్మం లేదా తోలుకు రంగు, మందం అలాగే విలువ పెంచడానికి అవసరమైన అన్ని వ్యవహారాలను ఈ కోర్సులో చేరిన విద్యార్థులు చదువుకోవాలి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలోనే ప్రాక్టికల్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అలవడతాయి. ఇండస్ట్రీ రెడీగా విద్యార్థులు తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలనుబట్టి నెలకు స్టయిపెండ్‌గా లభిస్తుంది.
- దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిడాస్, రీబాక్, నైక్, హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి. ఫుట్‌వేర్ డిజైనింగ్, లెదర్ గూడ్స్ డిజైనింగ్, ప్రొడక్షన్ ఆఫ్ ఫుట్‌వేర్, ప్రొడక్షన్ ఆఫ్ లెదర్ గూడ్స్, ప్రొడక్షన్/టానింగ్ ఆఫ్ లెదర్, టెస్టింగ్ అండ్ క్వాలిటీ కంట్రోల్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. మూడు నుంచి అయిదేళ్ళ అనుభవంతో ఆంత్రప్రెన్యూర్లుగానూ మారవచ్చు. సొంతంగా యూనిట్ పెట్టుకోవచ్చు. డిప్లొమాతోనే కొందరు విద్యార్థులు విదేశాల్లోని బహుళ జాతి సంస్థల్లో చేరుతున్నారు. ముఖ్యంగా చైనా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఉపాధి పొందుతున్నారు.
- డిమాండ్ అధికంగా ఉండటంతో కొందరు డిప్లొమా పూర్తి చేయకున్నప్పటికీ, కేవలం వ్యక్తిగత సంబంధాలతో కొద్దిపాటి జ్ఞానంతోనే జాబ్స్ పొందుతుండటం విశేషం.

**ఉన్నత చదువులు:** లెదర్ టెక్నాలజీలో డిప్లొమాతోనే చదువు ఆపేయనవసరం లేదు. ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.

పాలిటెక్నిక్ డిప్లొమాలు



### బీటెక్ అందించే కాలేజీలు

- హార్‌కోర్ట్ బట్లర్ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాన్పూర్
- దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్, ఆగ్రా
- అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ, అలీగఢ్
- ముజఫర్‌పూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ముజఫర్‌పూర్
- అలగప్పా కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, చెన్నై
- సీఎస్ఐఆర్ సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై
- గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ లెదర్ టెక్నాలజీ, కోల్‌కతా

## నిట్ రూర్కెలాలో ఎంఏ



రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- ఎంఏ(డెవలప్‌మెంట్ స్టడీస్) ప్రోగ్రాములో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటరాక్షన్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

**సీట్లు:** మొత్తం 39 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 14, ఓబీసీలకు 10, ఎస్సీలకు 6, ఎస్టీలకు 3, దివ్యాంగులకు 2, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 4 సీట్లు ప్రత్యేకించారు. రిజర్వుడు వర్గాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోని పక్షంలో ఆ సీట్లను జనరల్ అభ్యర్థులకు కేటాయిస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో లేదా 10 పాయింట్ల మీద 5.5 సీజీపీఏ స్కోర్‌తో బీఈ/బీటెక్/బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులై ఉండాలి. బీఏ/బీకాం/బీఎస్సీ ఆనర్స్ అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 25
- **రాత పరీక్ష, పర్సనల్ ఇంటరాక్షన్:** జూలై 5
- **ఫలితాలు విడుదల:** జూలై 10
- **కౌన్సెలింగ్, అడ్మిషన్:** జూలై 15
- **వెబ్‌సైట్:** nitrkl.ac.in

## లిటిల్స్



### చిన్నారి పిట్ట సంకల్పం


ఒక అడవిలో అనేక రకాల పక్షులు జంతువులు కలసి మెలసి నివసిస్తూ ఉండేవి. ఒక రోజు ఆ అడవిలో ఎక్కడినుండో నిప్పు అంటుకుంది. అది అంతకంతకూ పెరుగుతూ చెట్లను కాల్చివేయసాగింది. చాలా జంతువులు తలో దిక్కుకు పరిగెత్తి ప్రాణాలు కాపాడుకున్నాయి. చేతకాని జంతువులు అలాగే ఆ మంటల్లో పడి కాలిపోయాయి. అన్ని జంతువులు అలా కంగారు పడుతూ పరిగెడుతూ ఉంటే ఒక చిన్న పిట్ట మాత్రం తన చిన్న నోటిలో పట్టినన్ని నీళ్ల దగ్గర్లోని మడుగు నుంచి తెచ్చి ఆ మంట మీద చల్లసాగింది. అది చూసిన ఒక కొంగ ఆ పిట్టతో ఇలా అంది. 'ఓసి చిన్నారి పిట్టా..., నీవు పిడికెడంత కూడా లేవు అంత పెద్ద మంట ఆర్పడం నీ వల్ల ఏమవుతుంది? వెళ్లి నీ పిడికెడు ప్రాణం కాపాడుకోపో' అన్నది. దానికి ఆ పిట్ట నవ్వి 'నీవన్నది నిజమే, నా ఒక్కదాని వల్ల కాదు కానీ మనమంతా కలసి నీళ్లు చల్లితే మంటలు ఆర్పడం ఎంత పని చెప్పు' అన్నది. దానికి కొంగ నిజమే సుమా మన మిత్రులందరినీ పిలిచి అందరం ఇదే పని చేద్దాం అని తోటి పక్షులు జంతువులన్నిటికీ వినిపించేలా కేక వేసింది. కాసేపట్లోనే చాలా జంతువులు అక్కడికి వచ్చి, చేతనైనన్ని నీళ్లు తలా కొన్ని తెచ్చి మంటల మీద చల్లడంతో ఆ మంటలు ఆరిపోయి అక్కడి పక్షులు, జంతువులు తమ ప్రాణాలతో పాటు నివాసాలు కాపాడుకున్నాయి. అన్నీ ముందుగా పని మొదలు పెట్టిన చిన్నారి పిట్టను అభినందించాయి.




### ఎన్ని ఎలుగుబంట్లు ఉన్నాయి?



### 10 తేడాలు గుర్తించండి



### దారి కనుక్కోండి



### సరైన నీడ ఏది?



## జాబ్ కార్నర్

### సింగరేణిలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ఖాళీలు 272

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టులు

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(మైనింగ్), ఈ2 గ్రేడ్: 139
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఎఫ్ అండ్ ఎ), ఈ2 గ్రేడ్: 22
3. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(పర్సనల్), ఈ2 గ్రేడ్: 22
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఐఈ), ఈ2 గ్రేడ్: 10
5. జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: 10
6. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(హైడ్రో- జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్: 2
7. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సివిల్), ఈ2 గ్రేడ్: 18
8. జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: 3
9. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్: 30

- నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు

10. సబ్-ఓవర్సీస్ ట్రెయినీ(సివిల్), టిఅండ్ఎస్ గ్రేడ్-సి: 16

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్), సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎంఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంబీబీఎస్, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

**వయసు:** గరిష్ఠంగా 30 ఏళ్లు మించకూడదు. జీడీఎంఓ పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయో సడలింపు ఉంటుంది.

**ఎంపిక ప్రక్రియ:** రిక్రూట్‌మెంట్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 19

**వెబ్‌సైట్:** scclmines.com/scclnew/index.asp

### కాటన్ కార్పొరేషన్‌లో వివిధ ఖాళీలు

ఖాళీలు 214

నవీ ముంబయిలోని ప్రభుత్వరంగ సంస్థకు చెందిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



1. అసిస్టెంట్ మేనేజర్(లీగల్): 1 పోస్టు
2. అసిస్టెంట్ మేనేజర్(అఫీషియల్ లాంగ్వేజ్): 1
3. మేనేజ్‌మెంట్ ట్రెయినీ (మార్కెటింగ్): 11
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(అకౌంట్స్): 20
5. జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్: 120
6. జూనియర్ అసిస్టెంట్(జనరల్): 20
7. జూనియర్ అసిస్టెంట్(అకౌంట్స్): 40
8. జూనియర్ అసిస్టెంట్(హిందీ ట్రాన్స్‌లేటర్): 1

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, సీఏ/సీఎంఏ, బీఎస్సీ, బీకాం, లా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 32 ఏళ్లు, ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు

**ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

**పరీక్ష కేంద్రాలు:** ముంబయి/నవీ ముంబయి, హైదరాబాద్, న్యూఢిల్లీ, చెన్నై, లఖ్‌నవూ, ఛండీగఢ్, కోల్‌కతా, బెంగళూరు, అహ్మదాబాద్, పట్నా, జయపుర.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 2

**వెబ్‌సైట్:** cotcorp.org.in/

## ఎడ్యుకేషనల్ ప్లానింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంఏఈడీ

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్(ఎన్ఐఈపీఏ)- 'మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్(ఎంఏఈడీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడు/నాలుగేళ్ల వ్యవధిగల బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్‌టీఏ నిర్వహించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ)-పీజీ 2024(సీఓక్యూపీ11 పేపర్) అర్హత పొంది ఉండాలి. అడ్మిషన్ నాటికి అభ్యర్థుల వయసు 21 నుంచి 65 ఏళ్ల మధ్య ఉండాలి.

**ఎంట్రెన్స్ టెస్ట్:** ఎంట్రెన్స్ టెస్ట్‌ను ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో సోషల్ సైన్స్ విభాగాలకు సంబంధించి డిస్క్రిప్టివ్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. దీనికి 50 మార్కులు నిర్దేశించారు. ఇంటర్వ్యూ కమిటీ నిబంధనల ప్రకారం ఎంపికైన అభ్యర్థులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ-సీఎల్ అభ్యర్థులకు రూ.1000; మహిళలు, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ-ఎన్‌సీఎల్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 16
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 2
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూలై 9
- **ఫలితాలు విడుదల:** జూలై 16
- **అడ్మిషన్స్:** జూలై 22
- **తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.niepa.ac.in



## ఎన్‌పీటీఐలో ఎంబీఏ పవర్ మేనేజ్‌మెంట్

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- ఎంబీఏ ఇన్ పవర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 120 సీట్లు ఉన్నాయి. వీటిలో స్పాన్సర్డ్ అభ్యర్థులకు 15 సీట్లు కేటాయించారు. సంస్థ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్/జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మహిళలకు ట్యూషన్ ఫీజులో పది శాతం వరకు రాయితీ లభిస్తుంది. ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

**ప్రోగ్రామ్ వివరాలు:** మొదటి సంవత్సరం అభ్యర్థులు హ్యూమన్ రిసోర్సెస్, ఆపరేషన్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పవర్ సెక్టార్ విభాగాల నుంచి కోర్సులు ఎంచుకోవచ్చు. రెండో ఏడాది సస్టయినబిలిటీ, డేటాసైన్స్ అండ్ డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ అండ్ క్లౌడ్ స్పెషలైజేషన్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆరు నుంచి ఎనిమిది వారాల సమ్మర్ ట్రెయినింగ్ ప్రాజెక్ట్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్/జీమ్యాట్/సీయూఈటీ/ఎక్స్ఏటీ/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు. స్పాన్సర్డ్ అభ్యర్థులకు ఎటువంటి స్కోర్ అవసరం లేదు. వీరికి నిర్దేశించిన మేరకు అనుభవం తప్పనిసరి.

### ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్

- పరీక్ష సమయం గంటన్నర. ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, డేటా ఇంట్రప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి మొత్తం 90 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 90. నెగెటివ్ మార్కులు లేవు.
- **వెయిటేజీ:** ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్ స్కోర్/జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- స్పాన్సర్డ్ అభ్యర్థుల ఎంపికలో అకడమిక్ ప్రతిభకు 60 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 శాతం, అనుభవానికి 10 శాతం వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 19
- **ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** జూన్ 21
- **వెబ్‌సైట్:** www.npti.gov.in

### డైలీ సుడోకు - 334

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 6 | 7 | | | 1 | 3 |
| | | | | 5 | | | 2 | |
| | | | | | 3 | 4 | | |
| | 3 | | | | 7 | | | 2 |
| 7 | | 4 | | | | 5 | | 8 |
| 5 | | | 4 | | | | 6 | |
| | | 8 | 9 | | | | | |
| | 2 | | | 8 | | | | |
| 6 | 9 | | | 3 | 1 | | | |

సుడోకు - 333 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 8 | 3 | 1 | 9 | 6 | 5 | 4 | 2 |
| 1 | 5 | 6 | 4 | 2 | 7 | 3 | 8 | 9 |
| 4 | 2 | 9 | 5 | 3 | 8 | 7 | 1 | 6 |
| 5 | 3 | 1 | 8 | 4 | 9 | 6 | 2 | 7 |
| 8 | 6 | 2 | 7 | 5 | 1 | 4 | 9 | 3 |
| 9 | 7 | 4 | 2 | 6 | 3 | 1 | 5 | 8 |
| 6 | 4 | 5 | 9 | 7 | 2 | 8 | 3 | 1 |
| 3 | 9 | 8 | 6 | 1 | 5 | 2 | 7 | 4 |
| 2 | 1 | 7 | 3 | 8 | 4 | 9 | 6 | 5 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.